మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

హైదరాబాద్ | సంపుటి: 2 • సంచిక: 81 • పేజీలు:12+16 • వెల: రూ.5 | సోమవారం • 19-2-2018 | www.manamnews.com | /manamnews



ప్రజాస్వామ్యమే బీజేపీ మూలం

- ఆ స్ఫూర్తితోనే పొత్తులు విజయవంతం
- జాతి ప్రయోజనాలే ముఖ్యం: నరేంద్ర మోదీ
- పార్టీ కేంద్ర కార్యాలయం ప్రారంభం
- నవీ ముంబై ఎయిర్‌పోర్ట్‌కు శంకుస్థాపన

7లో..



జైట్లీ దాక్కుంటారు.. మోదీ మాట్లాడరు..

- ప్రధాని అపరాధిలా వ్యవహరించకండి
- విద్యార్థుల పరీక్షలపై రెండు గంటలు మాట్లాడారు
- 22 వేల కోట్ల కుంభకోణంపై 2 నిమిషాలు మాట్లాడలేరా?: రాహుల్

7లో..

మరో పరారీ

నిన్న నీరవ్ మోదీ.. నేడు విక్రమ్ కొఠారీ

- బ్యాంకుల నుంచి రూ.800 కోట్ల అప్పులు
- రోటోమాక్ పెన్నుల కంపెనీ యజమాని
- వారం రోజుల నుంచి కనపడని కొఠారీ
- కాన్పూర్ కార్యాలయానికి తాళాలు
- ఆస్తులు అమ్మితేనే అప్పుల వసూలు
- వలలో యూబీఐ, అలహాబాద్ బ్యాంక్
- మరో మూడు ప్రభుత్వరంగ బ్యాంకులూ



కాన్పూర్, ఫిబ్రవరి 18:

విజయ్ మాల్యాతో మొదలుపెట్టి వరుసగా బ్యాంకుల నుంచి భారీ మొత్తాల్లో అప్పులు చేయడం.. ఎంచక్కా విదేశాలకు చెక్కేయడం అందరికీ అలవాటైపోయింది. నిన్న కాక మొన్న పంజాబ్ నేషనల్ బ్యాంకుకు 11వేల కోట్ల రూపాయలకు పైగా టోపీ పెట్టి నీరవ్ మోదీ విదేశాలకు చెక్కేస్తే.. ఇప్పుడు రోటోమాక్ పెన్నుల కంపెనీ యజమాని విక్రమ్ కొఠారీ తన స్థాయిలో రూ. 800 కోట్ల మేర ప్రభుత్వ రంగ బ్యాంకుల నుంచి అప్పులు తీసుకుని పరారయ్యారు. వారం రోజుల నుంచి ఆయన ఎక్కడున్నారో ఎవరికీ తెలియడం లేదు. కాన్పూర్ సిటీ సెంటర్ రోడ్డులోని ఆయన కార్యాలయానికి తాళం వేసి ఉంది. నీరవ్ మోదీ మిగతా 6లో..

ఎవరీ కొఠారీ?



విక్రమ్ కొఠారీ.. ఒకప్పుడు సాదా సీదా వ్యాపారవేత్త. స్టేషనరీ, పెన్నులు, గ్రీటింగ్ కార్డులు అమ్ముకునేవాడు. అప్పట్లో తొలుత రేనాల్డ్స్ పెన్నులు మార్కెట్‌లోకి రంగ ప్రవేశం చేశాయి. అవి మార్కెట్ మొత్తాన్ని శాసిస్తున్న సమయంలో రోటోమాక్ పెన్నులు మిగతా 6లో..

మహాకూటమి.. తూచ్!





కాంగ్రెస్‌తో జోడీకి సీపీఎం ససేమిరా

కోదండరాం వైఖరిపై అనిశ్చితి

- ఎన్నికలకు ముందే విపక్షాల్లో అనైక్యత
- కలిసి పోరాడుదామని తొలుత యోచన
- సమష్టిగా టీఆర్ఎస్‌ను ఎదుర్కొనే వ్యూహం
- సీపీఎం ప్రకటనతో నీరుగారిన 'కూటమి'

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (మనం ప్రతినిధి):

వచ్చే ఎన్నికల్లో టీఆర్ఎస్‌ను నిలువరించేందుకు అంతర్గతంగా కాంగ్రెస్ చేస్తున్న ప్రయత్నాలకు ఆదిలోనే హంసపాదు ఎదురవుతోంది. మహాకూటమి ఏర్పాటు చేయాలనే కాంగ్రెస్ యోచనపై సీపీఎం నీళ్ల జల్లుతోందనే అభిప్రాయం మిగతా 6లో..



ఆయన వస్తానన్నది హైదరాబాద్‌కు.. ఇక్కడికి కాదు సార్..!



సిటీ సిగలో మరో సదస్సు

ప్రపంచ ఐటీ కాంగ్రెస్

నేటి నుంచి మూడు రోజులు

- వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రసంగించనున్న ప్రధాని
- 80 దేశాల నుంచి 5,000 మంది ప్రతినిధులు
- పాల్గొననున్న దిగ్గజ సంస్థల ప్రముఖులు
- భారత్‌లో ఇదే తొలిసారి



2లో..

రైతు సదస్సులు

ఈ నెల 25, 26న నిర్వహణ.. మండలస్థాయి రైతు సమితులతో భేటీ

- వాటి పాత్రపై రైతులకు విశదీకరణ
- త్వరలో రాష్ట్రస్థాయి రైతు సమితి
- 42 మంది నిపుణులకు స్థానం
- పంట పెట్టుబడి చెక్కు రూపంలోనే..
- రెండు విడతలుగా రైతులకు పంపిణీ
- సబ్సిడీపై నాట్లు వేసే యంత్రాలు
- 'సాగు బడ్జెట్' సిద్ధం చేయండి
- అధికారులకు సీఎం కేసీఆర్ ఆదేశం





వ్యవసాయశాఖ సమీక్షలో సీఎం కేసీఆర్, పాల్గొన్న అధికారులు

హైదరాబాద్, ఫిబ్రవరి 18:

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు నియమించిన రైతు సమన్వయ సమితుల మండలస్థాయి ప్రాంతీయ సదస్సులను ఈ నెల 25, 26 తేదీల్లో నిర్వహించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. వ్యవసాయాన్ని లాభసాటి చేయడం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న మిగతా 6లో..

వాతావరణం



తెలుగు రాష్ట్రాల్లో సోమవారం పొడి వాతావరణం నెలకొంటుంది. పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. చలిగాలుల తీవ్రత తగ్గుతుంది. గంటకు 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 34 డిగ్రీలు

కనిష్ఠ ఉష్ణోగ్రత: 18 డిగ్రీలు

గాలిలో తేమ: 49 శాతం

ముహూర్తం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం, తిథి: చవితి తె.5.16 తదుపరి పంచమి; నక్షత్రం: ఉత్తరాభాద్ర మ.1.36 తదుపరి రేవతి; వర్జ్యం: రా.1.48-3.26; దుర్ముహూర్తం: మ.12.07-12.53, మ.3.11-3.57; రాహుకాలం: ఉ.8.11-9.37; అమృతఘడియలు: ఉ.8.40-10.20; శుభసమయం: ఉ.6.00-7.00.


సూర్యోదయం: 6.44

సూర్యాస్తమయం: 6.16

వ్యవ'సాయం' కావాలి

ఏటికేడు పెరుగుతున్న ఖర్చులు

- నానాటికీ పడిపోతున్న దిగుబడులు
- కల్తీ విత్తనాలు.. ఖరీదైన మందులు
- ఏటా పెరుగుతున్న కూలీ రేట్లు
- ఆకాశాన్నంటుతున్న ఎరువుల ధరలు
- పెట్టుబడి కూడా దక్కక రైతు కుదేలు
- గిట్టుబాటు ధర కోసం ఎదురుచూపు
- వరుస నష్టాలతో కాడి పారేస్తున్న వైనం
- ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల విజ్ఞప్తి



హైదరాబాద్, ఫిబ్రవరి 18(మనం ప్రతినిధి):

రాష్ట్రంలో సాగు వ్యయం ఏటికేడు పెరుగుతుంటే దిగుబడులు మాత్రం తగ్గిపోతున్నాయి. ప్రకృతి వైపరీత్యాలకు తోడు, మానవ తప్పిదాలు ఈ పరిస్థితికి కారణం. పెరుగుతున్న సాగు ఖర్చుకు అనుగుణంగా మిగతా 6లో..



కుప్పకూలిన విమానం

66 మంది దుర్మరణం?

- వారిలో 60 మంది ప్రయాణికులు
- అధికారికంగా ఖరారు చేయని ఇరాన్
- పొగమంచుతో కనిపించని కొండలు
- నేరుగా వెళ్లి వాటిని ఢీకొట్టిన విమానం
- నేవిగేషన్ లోపం కూడా కారణమేనా?
- పాతకాలం నాటి డొక్కు విమానాలే గతి

టెహ్రాన్, ఫిబ్రవరి 18:

తీవ్రమైన పొగమంచు కారణంగా ఇరాన్‌లో ఆదివారం ఓ విమానం కుప్పకూలిపోవడంతో అందులో ఉన్న మొత్తం 66 మందీ మరణించారని భావిస్తున్నారు. అయితే మిగతా 6లో..

వీడియో కాల్ మాట్లాడుతూ..

విద్యార్థిని ఆత్మహత్య



హైదరాబాద్, ఫిబ్రవరి 18: కొంపల్లిలోని ఓ కళాశాల వసతి గృహంలో ఎంబీఏ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. హైదరాబాద్ నగర శివారు కొంపల్లిలోని శివశివానీ కాలేజీలో ఎంబీఏ చదువుతున్న హనీషా చౌదరి అనే విద్యార్థిని ఆదివారం నాడు హాస్టల్‌లోని తన గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. మృతురాలు అనంతపురం జిల్లాకు చెందిన బుగ్గయ్య చౌదరి కుమార్తెగా పోలీసులు గుర్తించారు. ఆత్మహత్యకు ముందు హనీషా తన ప్రేమికుడు దక్షిష్ పటేల్‌తో వీడియోకాల్‌లో మాట్లాడింది. వీడియోకాల్‌లో అతను చూస్తుండగానే ఫ్యాన్‌కు ఉరేసుకుంది. దీంతో అతడు వెంటనే హాస్టల్ గదికి చేరుకున్నాడు. లోపల గడియపెట్టి ఉండడంతో తలుపులు బద్దలుకొట్టి తెరిచాడు. ఫ్యాన్‌కు ఉరేసుకున్న హనీషాను అమె స్నేహితురాలి సాయంతో కొంపల్లిలోని సిగ్మా ఆసుపత్రికి తరలించారు. అయితే, ఆస్పత్రికి చేరేలోపే హనీషా ప్రాణాలు కోల్పోయింది. హనీషా మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. హాస్టల్ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, హనీష ఆత్మహత్యకు గల కారణాలు వెల్లడికావాల్సి ఉంది.

పసివాడికి అండగా హరీశ్!

- గుండె ఆపరేషన్‌కు ఆర్థిక సాయం

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 18 (మనం న్యూస్): కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడంలో ముందుండే మంత్రి హరీశ్‌రావు మరోసారి తన ధాతృత్వాన్ని చాటుకున్నారు. గుండె సమస్యతో పుట్టిన ఓ చిన్నారికి అండగా నిలిచారు. ఆపరేషన్‌కు అవసరమైన డబ్బును అందించి ప్రాణం నిలిపారు. సిద్దిపేట మండలం వెల్కటూరు గ్రామానికి పుట్ట ఉమారాణి, సతీశ్‌లకు గత నెలలో పండంటి బాబు జన్మించాడు. అయితే.. పుట్టుకతోనే గుండె సంబంధిత వ్యాధి ఉండటంతో హైదరాబాద్‌లోని స్టార్ ఆస్పత్రిలో చేర్చారు. బాబుకు ఆపరేషన్ చేయించాలని, ఇందుకు రూ.6 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు తేల్చిచెప్పారు. ఏం చేయాలో పాలుపోని ఆ దంపతులు మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన మంత్రి.. స్టార్ ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ గోపీచంద్‌తో మాట్లాడారు. పసిబాబుకు ఆపరేషన్ చేయాలని, ఎంతటి వ్యయమైనా తాను భరిస్తానని హామీ ఇచ్చారు. దాంతో గతనెల 23న ఆ బాబుకు గుండె చికిత్స చేశారు. ఇంటికి వచ్చిన ఆ దంపతులు ఆదివారం సిద్దిపేటలోని మంత్రి నివాసానికి బాబుతో సహా వచ్చారు. మంత్రి ఆశీర్వాదాలు తీసుకున్నారు. తమ బాబుకు పునర్జన్మనిచ్చిన మంత్రి హరీశ్‌రావుకు తాము జీవితాంతం రుణపడి ఉంటామని సందర్భంగా ఆ దంపతులు పేర్కొన్నారు.



ఉమారాణి, సతీశ్ దంపతులతో మంత్రి హరీశ్ రావు



వన్యప్రాణుల దాహం తీరుస్తాం

- నీటి వనరుల లభ్యత, పెంపుపై కసరత్తు
- అటవీ శాఖ సిబ్బంది రెండ్రోజుల సర్వే
- వేసవిలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు
- సమీపంలోని జనావాసాల వద్ద ప్రచారం
- వన్యప్రాణి సంరక్షణ చట్టాలపై అవగాహన

హైదరాబాద్, ఫిబ్రవరి 18(మనం ప్రతినిధి): వన్యప్రాణుల దాహం తీర్చేందుకు అధికారులు సిద్ధమయ్యారు. వచ్చే వేసవిలో వన్యప్రాణులు వేసవిలో నీటి కోసం ఇబ్బంది పడకుండా ఉండేందుకు చర్యలు చేపడుతున్నారు. గత నెలలో రాష్ట్ర వ్యాప్తంగా వన్యప్రాణుల గణనను విజయవంతంగా పూర్తి చేసిన అటవీ శాఖ అధికారులు మరోమారు అడవి బాట పట్టనున్నారు. ఈ సారి అరణ్యంలో జలవనరులు, వాటి సంరక్షణ అంశాలపై రెండు రోజుల పాటు సర్వే చేయనున్నారు. అడవుల్లో సహజంగా ఉండే నీటి వనరులు కాలుష్యం బారినపడకుండా కాపాడడంతో పాటు అటవీ ప్రాణులకు వీలైనంత సమీపంలోనే తాగునీరు ఉండేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఇందుకు ఈ నెల 24, 25 తేదీల్లో అధ్యయనం చేయనున్నారు. రెండు రోజుల సర్వేలో అటవీ శాఖ అధికారులు, సిబ్బందితో పాటు ఇటీవల పులుల గణనలో పాల్గొన్న వాలంటీర్లను కూడా భాగస్వాములగా చేస్తున్నారు.

టైగర్ రిజర్వ్, రక్షిత అడవుల్లో..


రాష్ట్రవ్యాప్తంగా అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లతో పాటు రక్షిత అడవులు, ఏటూరు నాగారం, కిన్నెరసాని, పోచారం అభయారణ్యాల్లో సర్వే నిర్వహించనున్నారు. ఈ ప్రాంతాల్లో ఎక్కడెక్కడ సహజ నీటి వనరులు ఉన్నాయి. అవి ఏ దశలో ఉన్నాయి, నీరు స్వచ్ఛంగా ఉందా.. లేదా, ఒక వేళ కలుషితం అయితే కారణమేంటి వంటి విషయాలను పరిశీలించనున్నారు. వీటితో పాటు అటవీ ప్రాంతాలకు సమీపంలో మానవ ఆవాసాలు ఉన్నాయా, జంతువులు, మనుషులకు మధ్య ఇటీవల చోటుచేసుకున్న ఘటనలు, జంతువులు సంచరించే ప్రాంతానికి నీటి వసతికి మధ్య దూరం, ప్రత్యామ్నాయంగా కృత్రిమ నీటి వసతి ఏర్పాటు అంశంపై ఈ రెండు రోజుల సర్వేలో అధ్యయనం చేస్తారు. సర్వే ఆధారంగా అవసరమైన చర్యలు తీసుకుని వన్యప్రాణులకు నీటి వసతిపై కార్యాచరణ రూపొందించనున్నారు.

జనవాసాల్లో ప్రచారం..

అటవీ శాఖ సిబ్బందితో పాటు వాలంటీర్లు అన్ని అటవీ ప్రాంత బీట్ల వారీగా సర్వే చేస్తారు. అడవుల్లోని జనావాసాల్లో నివసిస్తున్న వారి దగ్గరికి వెళ్లి వేసవిలో జంతువుల రక్షణకు పాటించాల్సిన చర్యలను వివరించనున్నారు. ప్లాస్టిక్, ఇతర వ్యర్థాల వల్ల నీరు, పర్యావరణం కలుషితం అవుతుంది. దీన్ని నివారించేందుకు ఈ బృందాలు అటవీ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు అవగాహన కల్పిస్తారు. అటవీ చట్టం, వన్యప్రాణి సంరక్షణ చట్టాలపై స్థానికులకు అవగాహన కల్పించడం ఈ సర్వేలో ప్రధాన భాగమని అటవీ సంరక్షణ అధికారి పీకే.ఝా, ప్రత్యేక అధికారి ఎ.శంకరన్ చెబుతున్నారు.

నీటి వసతి లేకనే ప్రమాదాలు: జోగు రామన్న

'వేసవిలో నీటి ఎద్దడి వల్ల జంతువులు అడవి నుంచి బయటకు వచ్చే అవకాశం ఉంది. ఫలితంగా ప్రమాదాల బారిన పడతాయి. ఈ క్రమంలో వేటగాళ్ల బారినపడే అవకాశం కూడా ఉంది. వన్యప్రాణులకు అవసరమైన నీటి వసతిని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం' అని అటవీ శాఖ మంత్రి జోగు రామన్న తెలిపారు.



ఏఐఎఫ్‌డివై సభలో ప్రజాయుద్ధనౌక గద్దర్

రాష్ట్రంలో నిశ్శబ్ద విప్లవం: గద్దర్

నర్సంపేట, ఫిబ్రవరి 18(మనం న్యూస్): అమరుల త్యాగాలపై నిర్మించుకున్న తెలంగాణ రాష్ట్రంలో 2019 లోనే నిశ్శబ్ద విప్లవం వస్తుందని ప్రజాయుద్ధనౌక గద్దర్ అన్నారు. వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేటలో వనం సుధాకర్ అధ్యక్షతన ఆదివారం సాయంత్రం జరిగిన ఏఐఎఫ్‌డివై రాష్ట్ర ప్రథమ మహాసభలో గద్దర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గద్దర్ మాట్లాడుతూ తెలంగాణలో నిశ్శబ్ద విప్లవం కోసం గ్రామీణ ప్రాంతాలలో ఉన్న మహిళల్లో చైతన్యం తీసుకురావాలని అన్నారు. పార్టీ జెండాలు, అజెండాలను పక్కన పెట్టి ఎర్రం జెండాలన్ని ఏకమయ్యే రోజు వస్తుందని మద్దికాల ఓంకార్ తనతో అన్న మాటలను ఆయన గుర్తు చేసుకున్నారు. దేశంలో యువతకు అన్యాయం జరుగుతుందన్నారు. దేశంలో వివిధ వర్గాలకు జరుగుతున్న అన్యాయాలు, ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను పాటల రూపంలో గద్దర్ వినిపించారు. మహిళలకు జరుగుతున్న అన్యాయంపై ఆవేదన వ్యక్తం చేశారు. పాత్రికేయులు నిరాదరణకు గురవుతున్నారని, వారికి నెలకు రూ.35 వేలు జీతం ఇవ్వాలని పోరాటం చేస్తున్నామన్నారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ ఎన్నికల హామీలు నెరవేర్చడంలో టీఆర్ఎస్ విఫలమయ్యిందన్నారు. అంతకుముందు ప్రథమ మహాసభ సందర్భంగా పట్టణంలో భారీ ర్యాలీ చేశారు. అమరవీరుల స్థూపం వద్ద మౌనం పాటించారు. వేదికపై వెంకన్న ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ ధూం ధాం ప్రజలను ఆకట్టుకుంది. ఈ సమావేశంలో ఏఐఎఫ్‌డివై జాతీయ నాయకుడు ఎండీ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రపంచ ఐటీ కాంగ్రెస్

- నగరంలో మరో ప్రతిష్ఠాత్మక సదస్సు
- మూడు రోజులు పాటు నిర్వహణ
- వీడియోకాన్ఫరెన్స్‌లో ప్రసంగించనున్న ప్రధాని
- 80 దేశాల నుంచి 5,000 మంది ప్రతినిధులు
- పాల్గొననున్న దిగ్గజ సంస్థల ప్రముఖులు
- భారత్‌లో నిర్వహించటం ఇదే తొలిసారి



హైదరాబాద్, ఫిబ్రవరి 18: అంతర్జాతీయ సదస్సులు, సమావేశాలకు వేదికగా నిలుస్తున్న హైదరాబాద్.. మరో ప్రతిష్ఠాత్మక సదస్సుకు ఆతిథ్యమివ్వనుంది. ఐదు కీలకాంశాలపై ప్రపంచ ఐటీ రంగ నిపుణుల మధ్య జరగనున్న మేధోమథనానికి వేదిక కానుంది. వరల్డ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ సర్వీసెస్ అలయెన్స్ (డబ్ల్యూసీఐటీ), నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్ కంపెనీస్ (నాస్కామ్), తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న 22వ ప్రపంచ ఐటీ కాంగ్రెస్ సదస్సు హెచ్ఐసీసీలో ప్రారంభంకానుంది. భారత్‌లో తొలిసారి నిర్వహిస్తున్న ఈ సదస్సులో ప్రధాని నరేంద్రమోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించనున్నారు. 'డిజిటల్ పరిజ్ఞానాన్ని విస్తృతం చేయడం' పేరుతో జరగనున్న ఈ కార్యక్రమానికి 80 దేశాల నుంచి 5,000 మంది ప్రతినిధులు హాజరవనున్నారు. వీరిలో అగ్రశ్రేణి ఐటీ కంపెనీలకు చెందిన 20 మంది సీఈవోలు ఉన్నారు. కేంద్ర ఐటీ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్, రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ తదితరులు సమావేశానికి హాజరుకానున్నారు. కాగా, ఈ కార్యక్రమంలో సౌదీ అరేబియాకు చెందిన సోఫియా రోబో ప్రత్యేక ఆకర్షణగా నిలువనుంది. గతం ఏడాది ఐఐటీ బాంబేలో జరిగిన టెక్ ఫెస్ట్‌లో సోఫియా పాల్గొన్నది. కెనడా మంత్రి నవదీప్ బియాన్స్, బీసీజీ చైర్మన్ హాన్స్ పాల్ బుర్కనర్, బ్యాడ్మింటన్ జాతీయ కోచ్ పుల్లెల గోపీచంద్, అడోబ్ చైర్మన్ షంతను నారాయణ్, బాలీవుడ్ నటి దీపికా పడుకుణ్, ఈషా ఫౌండేషన్ వ్యవస్థాపకులు తదితరులు సదస్సులో పాల్గొననున్నారు.

WCIT Hyderabad INDIA 2018 World Congress on Information Technology







ఎందుకీ సదస్సు?

టెక్నాలజీ రంగంలో 70%కు పైగా ప్రాథమిక ఆవిష్కరణల కాలం ముగిసిపోయిందని పరిశ్రమవర్గాలు భావిస్తున్నాయి. రాబోయే తరాన్ని నిర్దేశించే డిజిటల్ ఆవిష్కరణల కోసం ఐటీ, ఐటీ అనుబంధ, బ్యాంకింగ్, ఇతర ఆర్థికరంగ సేవలు, రిటైల్, ఆటోమొబైల్ రంగాల్లో అన్వేషణ మొదలైంది. ప్రపంచవ్యాప్తంగా వివిధ ప్రభుత్వాలు.. ప్రజలకు తమ సేవలు అందించేందుకు పాతకాలపు విధానాలను పక్కనపెట్టి సాంకేతికత ఆధారిత సేవలు అందించేందుకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఈ నేపథ్యంలో వేగం, ఖచ్చితత్వం, పారదర్శకత వంటివాటితో భౌతిక, వర్చ్యువల్ సమస్యలకు పరిష్కారం చూపించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో డిజిటల్ భవిష్యత్‌ను సాకారం చేసేందుకు ఈ వేదికగా కీలక చర్చలు జరగనున్నాయి.



భారత్‌లో ప్రథమం..

డబ్ల్యూసీఐటీ సదస్సును భారత్‌లో నిర్వహించటం ఇదే ప్రథమం. వరల్డ్ ఇనార్మేషన్ టెక్నాలజీ అండ్ సర్వీసెస్ అలయెన్స్ ఆధ్వర్యంలో 1978లో తొలిసారిగా డబ్ల్యూసీఐటీ సదస్సు జరిగింది. 2016లో బ్రెజిల్‌లో, 2017లో తైవాన్‌లో నిర్వహించారు. ఈ ఏడాది హైదరాబాద్ ఆతిథ్యమిస్తున్నది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కమ్యూనికేషన్స్ విభాగంలో ప్రాధాన్యం గల వేదికగా డబ్ల్యూసీఐటీ నిలుస్తున్నది. భారతదేశంలో నిర్వహిస్తున్న అత్యున్నత లీడర్‌షిప్ ప్రోగ్రాం అనే గుర్తింపును నాస్కాం పొందింది. వినూత్న ఆలోచనలు, ఆవిష్కరణలు, వ్యూహాలు, వ్యాపార ప్రణాళికలు, భవిష్యత్ సవాళ్లు– ఎదుర్కోవాల్సిన విధానాలు వంటివి ఈ వేదికగా చర్చిస్తారు. మూడురోజుల ఈ సదస్సులో వివరణాత్మకమైన ప్రసంగాలు, ప్రదర్శనలు, బృంద చర్చలు, నెట్‌వర్కింగ్ వంటివి ప్రధానంగా ఉంటాయి.

సేవలన్నీ అరచేతిలోనే



మొబైల్ యాప్స్ ద్వారా ప్రభుత్వ సేవలు .. ప్రతి పనికి ఓ యాప్

- కాలుకదపకుండా పనులు పూర్తి
- సమాచారం మొదలు.. దరఖాస్తు దాకా
- పథకాల నుంచి ఉద్యోగ ఖాళీల వరకు
- అన్ని వివరాలు చెప్పే 'యాప్'లు

హైదరాబాద్, ఫిబ్రవరి 18(మనం ప్రతినిధి): ప్రభుత్వ సేవలు పొందాలంటే పనులన్నీ మానుకొని కార్యాలయాలకు పదేపదే తిరగాల్సి రావడం ఏదో ఒక సందర్భంలో ప్రతీ వారికీ అనుభవమే! దీనికి కారణాల మాటెలా ఉన్నా.. సాంకేతికత దీనికి పరిష్కారం చూపిస్తోంది. బిల్లులు కట్టాలన్నా.. సమాచారం తెలుసుకోవాలన్నా.. ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలన్నా ఇంట్లోంచి కాలు బయటపెట్టకుండానే పూర్తిచేసే సౌలభ్యం కలిగిస్తోంది. కూర్చున్న చోటి నుంచి లేవాల్సిన అవసరమే లేకుండా ఎంచక్కా పనులన్నీ చక్కబెట్టుకునే అవకాశం తీసుకొచ్చింది. అరచేతిలో ఉండే స్మార్ట్‌ఫోన్‌లో ఒక యాప్ డౌన్‌లోడ్ చేసుకోవడం ద్వారా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే బాధను తప్పిస్తోంది. ప్రజా సేవకోసం టెక్నాలజీ వాడకంలో తెలంగాణ కూడా పరుగులు పెడుతోంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న కొన్ని ముఖ్యమైన యాప్‌ల వివరాలు మనం పాఠకుల కోసం..


టీ శాట్:

ప్రభుత్వ పథకాలకు సంబంధించిన వీడియోలు, ఉద్యోగాల ప్రకటనలు, భర్తీలు, ఖాళీల వివరాలు ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. ప్రభుత్వ కార్యక్రమాలు, నిరుద్యోగులకు అంశాల వారీగా యాప్‌లో తరగతులు కూడా చూడొచ్చు. వివిధ ఉద్యోగ పరీక్షలు రాసే అభ్యర్థులకు ఉపయోకరమైన సమాచారాన్ని అంశాల వారీగా యాప్‌లో అందుబాటులో ఉంటుంది.

కౌశల్ ఫంజియాప్:

యువతలో చదువుతో పాటు, నైపుణ్యం పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం దీన్‌దయాల్ ఉపాధ్యాయ కౌశల్ యోజన కింద ఈ యాప్‌ను రూపొందించింది. ఇందులో తమ పేర్లు, వివరాలు నమోదు చేసుకుని కాలానుగుణంగా మారుతూ యువత తమ నైపుణ్యాలను, భావవ్యక్తీకరణను పెంపొందించవచ్చు. పదో తరగతి నుంచి డిగ్రీ, పీజీ పూర్తి చేసిన వారికి వివిధ కోర్సులను అనుగుణంగా నెల నుంచి 3 నెలల పాటు శిక్షణ ఇస్తారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి వివిధ సంస్థల్లో ఉపాధి కల్పిస్తుంది.

టీ రేషన్:



టీ రేషన్ యాప్ ద్వారా మన రేషన్ కార్డుకు కేటాయించిన సరకులు, రేషన్ షాపునకు వచ్చిన సరకులు ప్రస్తుత నిల్వలు, కీ రిజిస్టర్ వివరాలు, జిల్లాల వారీగా రేషన్ కార్డుల వివరాలు, ఆధార్ కార్డుతో రేషన్‌కార్డు లింకు సంబంధిత వివరాలతో పాటు, రేషన్‌కార్డుల ద్వారా ప్రతి నెల జరిగిన లావాదేవీలు మొదలైన వివరాలు తెలుసుకోవచ్చు.

టీఎస్-ఎస్ఎస్‌ఏ యాప్:

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు పోషక విలువలు గల మధ్యాహ్న భోజనాన్ని అందిస్తూ విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీని కోసం నూతనంగా టీఎస్-ఎస్ఎస్ఏ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. పాఠశాలల పర్యవేక్షణ అధికారుల తనిఖీల సమాచారాన్ని ఈ యాప్ ద్వారా రాష్ట్ర స్థాయి అధికారులకు తెలుపవచ్చు. పాఠశాలల పరిశీలన నివేదికలను అందరూ చేసేందుకు వీలుగా యాప్‌లో అందుబాటులో ఉంటాయి.


జీఎస్‌టీ రేట్ ఫైండర్:

కేంద్రం తెచ్చిన వస్తు సేవల పన్ను విధానంలో వివిధ వస్తువులకు ప్రభుత్వం విధించే పన్నుల వివరాలు దీంతో తెలుసుకోవచ్చు. ఇందులో.. 0 నుంచి 28 వరకు గల వివిధ పన్ను శాతం, వస్తువు పన్నుల జాబితా ద్వారా ఏయే వస్తువుకు ఎంత శాతం పన్ను విధించారో తెలుసుకోవచ్చు.

టీ వాలెట్:



నగదు రహిత లావాదేవీల్లో భాగంగా తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన యాప్ టీ వాలెట్.. ఈ యాప్ ద్వారా ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలకు సంబంధించి బిల్లుల చెల్లింపులతో పాటు, నగదు బదిలీ ఇతర సేవలను వినియోగించుకోవచ్చు.



దివ్యాంగ సారథి:

దివ్యాంగులు తమ రవాణా, ఇతర సౌకర్యాలలో రాయితీ వివరాలు, ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు జాతీయ ఉపకార వేతనాలు విద్యాభ్యాసంకోసం రుణాలు, ప్రభుత్వ పథకాలు, వివిధ ప్రభుత్వ సంస్థలు అవి కల్పించే సౌకర్యాలు తదితర వివరాలను ఈ యాప్‌తో తెలుసుకోవచ్చు.

మరికొన్ని యాప్‌లు

- వాహన రిజిస్ట్రేషన్ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సు వంటి వివరాలకు– ఆర్‌టీఏ ఎం వాలెట్
- ధ్రువీకరణ పత్రాలు, ధ్రువపత్రాల నిక్షిప్తంకోసం 'డిజిలాకర్' యాప్ ఉపయోగపడుతుంది.

నగదు బదిలీకోసం 'భీమ్' యాప్

- జాతీయ ఉపాధి హామీ పథకం వివరాలను తెలిపే –జనమన్‌రేగా!
- ఇంటర్ విద్య వివరాల కోసం–డిస్కయాప్
- ఆధార్ కోసం– ఎమ్ ఆధార్ యాప్
- 1 నుంచి 10వ తరగతి వరకు పాఠ్యాంశాలకోసం– టీఎస్ ఎస్‌సీఈఆర్‌టీ బుక్స్
- రెవెన్యూ పహాణీకోసం– తెలంగాణ ల్యాండ్ రికార్డు ఇన్ఫో యాప్
- అధ్వాన రహదారుల స్థితులపై ఫిర్యాదు చేయవడానికి– మేరిసడాక్ యాప్
- పోస్టల్ చిరునామా, ప్రభుత్వ శాఖల చిరునామాకోసం– పోస్ట్ ఇన్ఫో
- వీటితో పాటు చాలా బ్యాంకులు వారి ఖాతాదారుల సౌలభ్యం కోసం యాప్‌లు రూపొందించాయి

- అవివాహితులకు శుభవార్త
- నేటితో ముగుస్తున్న మూఢం
- మార్చిలో శుభ ముహూర్తాలు
- మే 9 వరకు శుభకార్యాలు
- పురోహితులకు డిమాండ్
- కల్యాణమండపాలు ఫుల్



పెళ్లి కళ వచ్చేసిందే బాలా..



హైదరాబాద్, ఫిబ్రవరి 18 (మనం ప్రతినిధి): శుభముహూర్తాలు లేక ఢీలా పడ్డ అవివాహితులు చిందేసే సమయం వచ్చింది. సంబంధం కుదిరినా, లగ్గం ఎప్పుడో తెలియక వేచి ఉన్న జంటలు త్వరలోనే పెళ్లి పీటలు ఎక్కనున్నాయి. పెండ్లిండ్లకు అడ్డంకిగా మారిన మౌఢ్యమి కథ ప్రస్తుతానికి ముగిసింది. శుభముహూర్తాలు వస్తుండడంతో అబ్బాయిలు, అమ్మాయిలు పెళ్లిపీటలు ఎక్కేందుకు తహతహలాడుతున్నారు. గత నవంబరు 29వ తేదీన ప్రారంభమైన శుక్ర మౌఢ్యమి ఫిబ్రవరి 19న మూఢ త్యాగం జరుగుతుంది. దాదాపు మూడునెలలపాటు కొనసాగిన ఈ మౌఢ్యమి సోమవారంతో ముగియనుంది. మాఘమాసం వివాహాలకు అత్యంత అనుకూలమైనది. అలాంటి మాఘమాసంలో మూఢమి కొనసాగడంతో శుభకార్యాలన్నీ నిలిచిపోయాయి. పెళ్లి వేడుకలు లేక కల్యాణ మండపాలు బోసిపోయాయి. ఈ సీజన్‌లో తొలి ముహూర్తం ఫిబ్రవరి 19నే మొదలవుతుంది. మార్చి నెల 3, 4 తేదీలు కూడా మంచి ముహూర్తాలుగా పురోహితులు పేర్కొంటున్నారు. దీంతో ఆ రెండు రోజుల్లో పెళ్లిళ్లు, పెద్ద సంఖ్యలో శుభకార్యాలు జరుగుతున్నాయి.

మే 9 వరకు శుభ ముహుర్తాలు

బుధ, శుక్ర గ్రహాలు భూకక్ష్యకు లోపల ఉండి సూర్యుడి చుట్టూ భూమి కంటే వేగంగా తిరుగుతూ అవతలి వైపుకి మళ్లినప్పుడు ఇవి కనిపించవు. ఈ కాలాన్నే బుధ అస్తంగత్వం, శుక్ర అస్తంగత్వం అంటారు. శుక్రుడు అస్తంగత్వం అయినప్పుడు శుక్ర మౌఢ్యమి అంటారు. మౌఢ్య కాలంలో గ్రహ కిరణాలు భూమిపై ప్రసరించుటకు సూర్యుడు అడ్డంగా ఉంటాడు. అందువల్ల మౌఢ్య కాలంలో గ్రహాలు బలహీనంగా ఉంటాయి. శుభాలను కలుగజేసే శుక్రుడికి మౌఢ్యమి వచ్చినప్పుడు సమస్త శుభకార్యాలు నిషిద్ధం. మౌఢ్యమిని వాడుకభాషలో మూఢమిగా పిలుస్తారు. మూఢమి అంటే చీకటి. శుక్రుడు సూర్యునికి ముందూ, వెనుక 10 డిగ్రీల దూరంలోపు ఉంటే అస్తంగత్వానికి గురవుతాడు. అంటే శుక్రుడు తన తేజస్సును, ప్రభావాన్ని, శుభత్వాన్ని కోల్పోతాడు. కాబట్టి ఆ సమయంలో జరిగే శుభకార్యాలకు శుభగ్రహమైన శుక్రబలం ఉండదు. కాబట్టి దీన్ని శుభకార్యాలు నిషేధం కాలంగా పరిగణించారు. ఈ సమయంలో వివాహాది ప్రయత్నాలు, వాహన కొనుగోలు చేయరు. మూడు నెలల మూఢం ముగిసింది. దీంతో ప్రస్తుతం అధికంగా పెళ్లిళ్ల జరగనున్నాయి. ఈ నెల 21, 23, 24 తేదీల్లో పెళ్లిళ్లకు మంచి ముహూర్తాలున్నాయి. ఆ తర్వాత వారం రోజుల పాటు (చప్పట్లు, కామ దహనం) కారణంగా ముహూర్తాలు లేవు. తిరిగి మార్చి 2 నుంచి మే 9 వరకు శుభ ముహూర్తాలు ఉన్నాయి. మార్చి 4వ తేదీ ఆదివారం బ్రహ్మాండమైన ముహూర్తం ఉండటంతో ఆ ఒక్క రోజే వేలాది వివాహాలు జరిగే అవకాశం ఉంది.

కల్యాణ మండపాలు ఫుల్

వచ్చే జూలై 7 వరకు శుభకార్యాలకు ఎలాంటి ఆటంకాలు లేవు. ఫాల్గుణంతో పాటు చైత్ర, వైశాఖ మాసాల్లోనూ వివాహాలకు మంచి ముహూర్తాలున్నాయని పండితులు చెబుతున్నారు. మార్చి మొదటి వారంలో తెలుగురాష్ట్రాల్లో పెద్దసంఖ్యలో వివాహాలు జరగనున్నాయి. నగరాలు, పట్టణాల్లో ఉన్న కల్యాణమండపాలు, ఫంక్షన్ హాల్స్ ఆయా రోజులకు ఇప్పటికే ఫుల్ అయిపోయాయి.

చేనేతకు చేయూత

నేతన్నల సంక్షేమానికి ప్రత్యేక పథకాలు.. టెక్స్‌టైల్ పార్కుల కోసం భారీగా నిధులు

- ఉపాధి శిక్షణతో నిరుద్యోగ యువతకు అండ
- వలసెల్లిన వారు తిరిగి వచ్చేందుకు యత్నం
- ఐఐహెచ్‌టీ ఏర్పాటుకు కేంద్రానికి ప్రతిపాదన
- పేటెంట్ రైట్స్‌తో తెలంగాణ చేనతకు గుర్తింపు
- ప్రభుత్వ చొరవతో రాష్ట్రంలో మారిన పరిస్థితి



హైదరాబాద్, ఫిబ్రవరి 18(మనం ప్రతినిధి): వ్యవసాయం తర్వాత దేశంలో అత్యధిక శాతం మంది ప్రజలు ఆధారపడేది చేనేత, జౌళీ పరిశ్రమపైనే. భారతదేశ చేనేత వారసత్వ సంపదలో తెలంగాణ చేనేతల ప్రతిభ అనన్య సామాన్యం. గద్వాల కాటన్, సిల్క్ జరీ చీరలు, నారాయణపేట, కొత్తపేట కాటన్ సిల్క్ చీరలు, పోచంపల్లి టై, ఇక్కత్ చీరలు, డ్రెస్ మెటీరియల్, ఫర్నీషింగ్స్, సిద్దిపేట గొల్లభామ చీరలు, వరంగల్ దర్రీలతోపాటు రాజస్థాన్ రాజ్‌కోట్ చీరలు, మహారాష్ట్ర పైరాణీ చీరలు కూడా నేసిన ఘనత రాష్ట్ర చేనేత, జౌళీ పరిశ్రమలది. రాష్ట్రంలో అలాంటి పరిశ్రమల్లో పనిచేసే నేత కార్మికులతో పాటు యజమానులు కూడా 2014కు ముందు ఎన్నో ఇబ్బందుల ఎదుర్కొన్నారు. గత ప్రభుత్వాలు చేనేత, జౌళీ పరిశ్రమలను నిర్లక్ష్యం చేయడంతో అప్పుల బాధతో చాలా మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. నష్టాల ఊబిలో కూరుకుపోయిన యజమానులు ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోయి పరిశ్రమలు పెట్టుకున్నారు. అయితే ఆంధ్రప్రదేశ్ నుంచి విడిపోయి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత పరిస్థితి మారింది. ముఖ్యమంత్రి కేసీఆర్, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి చేనత, జౌళి పరిశ్రమ ప్రగతికి ఎంతో కృషి చేస్తున్నారు. మూతపడిన చేనేత పరిశ్రమలను తెరిపించేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు, వాటిపై ఆధారపడి జీవిస్తున్న వారికి ఉపాధి శిక్షణ ఇప్పిస్తున్నారు. ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తూ చేనేత పరిశ్రమకు అండగా ఉంటున్నారు.

ఐఐహెచ్‌టీ ఏర్పాటుకు ప్రతిపాదనలు...

రాష్ట్ర విభజనకు ముందు చేనేత, జౌళీ పరిశ్రమల్లో పనిచేసే వారికి శిక్షణ ఇచ్చేందుకు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ (ఐఐహెచ్‌టీ) నెల్లూరు జిల్లా వెంకటగిరిలో ఉండేది. రాష్ట్ర విభజన తర్వాత ఆ శిక్షణ కేంద్రంలో తెలంగాణకు కొన్ని సీట్లు కేటాయించారు. అయితే కేటాయించిన సీట్లు తెలంగాణకు చెందిన వారికి సరిపోకపోవడంతో పోచంపల్లిలో ఐఐహెచ్‌టీని ఏర్పాటు చేయాలని అధికారులు కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు. అయితే ఈ విషయంలో కేంద్రం నుంచి ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేదు.

యువతకు ఉపాధి శిక్షణ

జాతీయ చేనేత అభివృద్ధి ప్రాజెక్టు ద్వారా వీవింగ్, డిజైనింగ్, రంగుల అద్దకాల్లో యువతకు శిక్షణ ఇస్తున్నారు. ఆధునిక మగ్గాలను ఏర్పాటు చేయడం, యార్న్ బ్యాంకు ఏర్పాటు, డైహౌస్, కామన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటు వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇప్పటికే 19 క్లస్టర్‌లకు ప్రతిపాదనలు పంపామని, 8 బ్లాక్ లెవల్ క్లస్టర్లు అమలవుతున్నాయని అధికారులు చెబుతున్నారు. ఈ ప్రాజెక్టు విలువ మొత్తం రూ.1019.67 కోట్లు కాగా ఇప్పటికే రూ.285.28 కోట్లు మంజూరయ్యాయి. వీటి ద్వారా 2602 మంది లబ్ధి పొందుతున్నారని అధికారులంటున్నారు. దీంతోపాటు సమగ్ర అభివృద్ధి పథకం ద్వారా ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు నిరుద్యోగ యువతకు శిక్షణ ఇప్పిస్తున్నారు. శిక్షణ ఖర్చుల కింద ఒక్కొకరికీ రూ.10 వేలు కేటాయిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఇప్పటివరకు 1600 మందికి శిక్షణ ఇచ్చి ఉపాధిని కల్పించాయి.

ఫలిస్తున్న కేటీఆర్ కృషి...

చేనేత, జౌళి పరిశ్రమల అభివృద్ధి కోసం కేటీఆర్ చేస్తున్న కృషి ఫలిస్తున్నది. దీనికి కార్యరూపమే టెక్స్‌టైల్ పార్కుల ఏర్పాటుకు వేల కోట్లు పెట్టుబడులు పెట్టడం. వరంగల్‌లో 2000 ఎకరాలలో మెగా టైక్స్‌టైల్ పార్క్ ఏర్పాటుకు 2017-18లో రూ.41.32 కోట్లు కేటాయించారు. దీంతోపాటు ఈ రంగ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.1200 కోట్లు కేటాయించింది. ఇందులో భాగంగానే వరంగల్ టెక్స్‌టైల్ పార్కు, సిరిసిల్ల అప్పరెల్ పార్కు ఏర్పాటుకు కార్యచరణ రూపొందించింది. పోచంపల్లి చేనేత పార్కు పునరుద్ధరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రూ. 30 కోట్లతో ప్రత్యేక నిధిని ఏర్పాటు చేశాయి. మల్కాపూర్ టెక్స్‌టైల్ పార్కులో రూ.5 కోట్ల వ్యయంతో మౌలిక సదుపాయాలు కల్పించారు. 2016-17కు గానూ రూ.70 కోట్ల విలువైన రాజీవ్ విద్య మిషన్ యూనిఫారాల తయారీని సిరిసిల్ల మర మగ్గాల పరిశ్రమకు ప్రభుత్వం అప్పగించింది. సిరిసిల్లలో మెగా టెక్స్‌టైల్ క్లస్టర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేశారు.

కనీస వేతన చట్టం

వేతనాల పెంపునకు చర్యలు తీసుకోవాలని చేనేత కార్మికులు చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు స్టేట్ మినిమమ్ వేజ్ అడ్వయిజరీ బోర్డుకు అధికారులు ఓ నివేదిక కూడా సమర్పించారు. వేతన పెంపునకు సంబంధించి బోర్డు నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని, వచ్చిన వెంటనే ఆ ఆదేశాలను అమలు చేస్తామని పలువురు అధికారులు చెబుతున్నారు.

సంక్షేమ పథకాలు

చేనేత, జౌళీ పరిశ్రమల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. పెట్టుబడి సదుపాయం, ఉత్పత్తికి కావాల్సిన నూలు, రంగులు, రసాయనాలపై రాయితీలు ఇవ్వడం, మగ్గాల ఆధునీకరణ, మౌలిక సదుపాయాల కల్పనతో పాటు మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న వివిధ పథకాలు..

1. నగదు పరపతి
2. పావలా వడ్డీ పథకం
3. 20 శాతం నూలు రాయితీ పథకం
4. మగ్గాల ఆధునీకరణ, నూతన మగ్గాల పథకం
5. త్రిఫ్ట్ ఫండ్
6. చేనేత పొదుపు పథకం
7. శిక్షణ, మౌలిక సదుపాయాల కల్పన
8. వృద్ధాప్య పింఛన్
9. జాతీయ చేనేత అభివృద్ధి పథకం
10. మహాత్మాగాంధీ బునకర్ బీమా యోజన
11. ప్రధాన మంత్రి ముద్ర యోజన
12. సమగ్ర నైపుణ్య అభివృద్ధి పథకం

రుణమాఫీ..పేటెంట్ రైట్


చేనేత పరిశ్రమల కోసం వృత్తిపరంగా రూ.1 లక్ష రుణమాఫీని ప్రభుత్వం అమలు చేస్తోంది. దీంతో నేతన్నలకు కొంత ఊరట లభిస్తుంది. ఈ రుణమాఫీతో పాటు చేనేత ఉత్పత్తులకు పేటెంట్ హక్కుల కల్పించారు. జియోగ్రఫీకల్ ఇండికేషన్ యాక్ట్ (జీఐఏ) ద్వారా నారాయణపేట, గద్వాల్, పోచంపల్లి ఉత్పత్తులు పేటెంట్ హక్కులు పొందాయి. పేటెంట్ హక్కుల కల్పనతో తెలంగాణ చేనేత ప్రత్యేకతను దేశవ్యాప్తంగా చాటేందుకు ప్రభుత్వం కృషి చేసింది.

తిరిగొచ్చే వారికి సౌకర్యాలు..

చేనేత రంగంలో వస్తున్న నష్టాల వల్ల రాష్ట్రం వదిలి సూరత్, భీవండి, షోలాపూర్ ప్రాంతాలకు వలస వెళ్లిన పరిశ్రమల యజమానులను వెనుకకు రప్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం శతవిధాల ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా వలసవెళ్లి ఇతర ప్రాంతాల్లో పరిశ్రమలు నడుపుతున్న యజమానులతో టీఎస్ఐఐసీ(తెలంగాణ ఇండస్ట్రీయల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కమిటీ)చైర్మన్ గ్యాదరి బాలమల్లు ఇటీవల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. తెలంగాణకు తిరిగొస్తే వారికి కల్పించే సౌకర్యాలను ఈ సమావేశంలో వివరించారు. వరంగల్ టెక్స్‌టైల్ పార్కు, సిరిసిల్ల అప్పరెల్ పార్కుల ఏర్పాటు గురించి వివరించి, అందులో వారి కోసం ప్రత్యేకంగా క్లస్టర్ ఏర్పాటు చేస్తామని, పరిశ్రమ చుట్టూపక్కలే ఇండ్ల స్థలాలు కూడా ఇస్తామని హామీ ఇచ్చారు. షోలాపూర్‌లో 4 లక్షల మంది కార్మికులు రాష్ట్రానికి చెందిన వారున్నారని, వారందరూ తెలంగాణకు రావడానికి సమ్మతిస్తే వరంగల్ టెక్స్‌టైల్ పార్కులో 50-100 ఎకరాలను కేటాయిస్తామని హామీ ఇచ్చారు.

కేటీఆర్‌కు అరుదైన గౌరవం

- జర్మన్ ఏషియా పసిఫిక్ అసోసియేషన్ సమావేశానికి ఆహ్వానం
- తెలంగాణ ప్రభుత్వ విధానాలపై ప్రసంగించాలని విజ్ఞప్తి
- జర్మనీలోని హాంబర్గ్‌లో మార్చి 2వ తేదీన సమావేశం



హైదరాబాద్, ఫిబ్రవరి 18 (మనం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర మంత్రి కేటీ రామారావుకు మరో అరుదైన గౌరవం లభించింది. ఆదివారం నాడు మరో అంతర్జాతీయ సంస్థ నుంచి ఆయనకు ఆహ్వానం అందింది. జర్మన్ ఏషియా పసిఫిక్ బిజినెస్ అసోసియేషన్ 98వ సమావేశానికి హాజరుకావాలని ఆ సంస్థ కేటీఆర్‌ను విజ్ఞప్తి చేసింది. జర్మనీలోని హాంబర్గ్‌లో మార్చి 2వ తేదీన జరిగే సమావేశంలో తెలంగాణలో ఉన్న అపార వ్యాపార, వాణిజ్య అవకాశాలను వివరించాలని సదరు సంస్థ కేటీఆర్‌ని కోరింది. ఆసియా దేశాలతో జర్మనీ నిర్వహించే ఈ అంతర్జాతీయ సమావేశంలో 300 మంది వాణిజ్య వేత్తలు, రాజకీయ నాయకులు, దౌత్యవేత్తలు పాల్గొంటారు. తెలంగాణ ప్రభుత్వం మూడేళ్లుగా అమలు చేస్తున్న పలు సంక్షేమ, ఆర్థిక విధానాలపై జర్మన్ వ్యాపార వర్గాలకు ఆసక్తి ఉందని, అందుకే తమ దేశంలోని అగ్రస్థాయి వ్యాపారవేత్తలతో ప్రత్యేకంగా ఒక రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేశామని సంస్థ తెలిపింది. ఈ సమావేశం ద్వారా తెలంగాణ, జర్మనీ మధ్య వాణిజ్య బంధం మరింత బలపడుతుందని అసోసియేషన్ ఆశాభావం వ్యక్తం చేసింది. ఈ ఆహ్వానం పట్ల కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు.

మస్కట్‌లో తెలంగాణ కార్మికులపై దాడి!

- 200 మందికి తీవ్రగాయాలు

కోరుట్ల, ఫిబ్రవరి 18 (మనం న్యూస్): ఉన్న ఊరిలో ఉపాధి కరువై.. పొట్టకూటికోసం గల్ఫ్ దేశాలకు వెళ్తే అక్కడ నరకం అనుభవిస్తున్నారు తెలంగాణ వాసులు. అనారోగ్యం కారణంగా మూడు రోజులు పని మానేసినందుకు ఓ తెలంగాణ కార్మికుడిని విచక్షణా రహితంగా చితకబాదారు. ఇలా చేయొద్దని అడిగినందుకు తెలంగాణకు చెందిన మరో 200 మందిపైనా దాడికి దిగారు. కోరుట్ల వాసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనారోగ్యంతో మహేశ్ అనే కార్మికుడు పనికి వెళ్లలేదు. దాంతో అతనిని కంపెనీ మేనేజర్ మజీద్ అనే వ్యక్తి చితకబాదాడు. అడ్డుకున్న మరో ఇద్దరు లక్ష్మణ్, మణికంఠలపైనా దాడి చేశారు. మహేశ్ బయటకు వెళ్తుంటే కింద పడేసి అతని కాళ్లపై నుంచి కారును పోనిచ్చారు. విషయం తెలిసిన తెలంగాణకు చెందిన మరో 200 మంది వారిని నిలదీయగా వారిపైనా దాడికి దిగినటుల తెలిసింది.



ప్రకృతి ఆహారమే.. ఆరోగ్యానికి రక్ష

- కేంద్ర మంత్రి శ్రీపాద్ నాయక్

హైదరాబాద్, ఫిబ్రవరి 18(మనం ప్రతినిధి): ప్రకృతి సిద్ధమైన కూరగాయలను, మొలకెత్తిన ధాన్యాలను తినాలని, వేపుళ్లు, అతిగా ఉడికించకుండా సాత్విక ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి శ్రీపద్ నాయక్ ప్రజలకు సూచించారు. నగరంలోని పీపుల్స్ ప్లాజాలో జరుగుతున్న జాతీయ సహజ ఆహార పండుగ ముంగిపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి సిద్ధ ఆహారం తినడం వల్ల కలిగే లాభాల గురించి, ఎటువంటి ఆహార నియమాలు పాటించాలో రామాయణ, మహాభారత,భగవద్గీత గ్రంథాల్లోనూ, వేదాల్లోనూ ఉందని ఆయన తెలిపారు. ఉపవాసం కూడా ఓ థెరపీ అని ఆయన తెలిపారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేచురోపతి(ఎన్ఐఎన్) ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని, ఇలాంటి కార్యక్రమాలను దేశవ్యాప్తంగా చేపట్టాలని ఆయన సూచించారు. జాతీయ సహజ ఆహార పండుగ కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని, యోగా, ప్రకృతి వైద్యం ప్రజలను ఆరోగ్యవంతులుగా చేయడంలో దోహదపడుతుందన్నారు. సహసిద్ధమైన ఆహార వంటలను పండించడంపై, వండుకునే విధానంపై షార్ట్ టర్మ్ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని, తద్వారా నిరుద్యోగ యువతీయువకులకు ఉద్యోగాలు వస్తాయని, ప్రజల్లోనూ సహజ ఆహారంపై అవగాహన ఏర్పడుతుందని ఎన్ఐఎన్ డైరెక్టర్‌ను సూచించారు.ఇక్కడికి రావడం ఎంతో సంతోషంగా ఉందని, భాగ్యనగరం సంస్కృతికి పెట్టింది పేరని తెలిపారు. రోగం వచ్చాక మందులు వాడటం కాదు, ఎలాంటి జాగ్రత్తలు, ఆహారం తీసుకుంటే రోగం రాకుండా ఉంటోందో నేషనల్ ఫుడ్ ఫెస్టివల్ ద్వారా ప్రజలకు అవగాహన కలిగిందని ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి అన్నారు. సహజ సిద్ధ ఆహారంపై ప్రజలకు అవగాహన పెరుగుతోందని, వాటిని తినాలనే ఆతృత కూడా వారిలో కలుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో వికారాబాద్‌లోని అనంతగిరి కొండపైన ఆయుష్ ఆసుపత్రి నిర్మాణం జరుగుతుందని, అది త్వరలోనే ప్రారంభమవుతుంని తెలిపారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 33వేల మంది

హైదరాబాద్, ఫిబ్రవరి 18(మనం ప్రతినిధి): ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో భాగంగా నిర్వహిస్తున్న ప్రాక్టికల్ పరీక్షలకు 17వ రోజైన గురువారం 33,075 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆయా జిల్లాల్లో ప్రాక్టికల్ పరీక్షలను ఫ్లైయింగ్ స్క్వాడ్స్, అబ్జర్వర్స్ తదితరులు పర్యవేక్షించారు.

ఫ్లవర్ అరేంజ్‌మెంట్‌పై 3 రోజుల శిక్షణ

హైదరాబాద్, ఫిబ్రవరి 18(మనం ప్రతినిధి): ఫ్లవర్ అరేంజ్‌మెంట్‌పై మూడు రోజుల శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు అగ్రి-హార్టికల్చరల్ సొసైటీ కార్యదర్శి తెలిపారు. సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి పబ్లిక్ గార్డెన్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఉదయం 11 గంటల నుంచి 2 గంటల వరకు లలిత కళాతోరణంలో జరుగుతాయని, ఆసక్తి గల వారు 8885641700 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.



అంబేద్కర్ విగ్రహాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న కడియం శ్రీహరి


అంబేద్కర్ చూపిన బాటలో కేసీఆర్ పాలన

- ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి

వరంగల్, ఫిబ్రవరి 18 (మనం న్యూస్): చిన్న రాష్ట్రాలతోనే అభివృద్ధి సాధ్యమని అంబేద్కర్ చెప్పారని, ఆయన చూపిన బాటలో నేడు ముఖ్యమంత్రి కేసీఆర్ పని చేస్తున్నారని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి అన్నారు. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం ఇబ్రహీంపురం గ్రామంలో ఏర్పాటుచేసిన బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే టి.రాజయ్యతో కలిసి డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కడియం శ్రీహరి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ వెనుకబాటుకు గురైందని, దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందలేదన్నారు. రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మార్చేందుకు కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేసిందని, అందులో భాగంగా 470 గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసిందన్నారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, 24గంటల విద్యుత్, ఎకరాకు రూ.4 వేలు పెట్టుబడి వంటి పథకాలతో ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలిచిందన్నారు. రైతే రాజు అన్న నినాదంతో పని చేస్తున్న సీఎం కేసీఆర్, నేడు నెంబర్ వన్ సీఎంగా పేరు సంపాదించారని కొనియాడారు. అనంతరం అంబేద్కర్ యువజన సంఘం నాయకులు డిప్యూటీ సీఎం కడియం శ్రీహరిని సత్కరించారు.

బీజేపీ హయాంలోనే బ్యాంకుల లూటీలు

- 'రాఫెల్'లోనూ అనుమానాలు
- లౌకిక శక్తులు ఏకం కావాలి: సురవరం



హైదరాబాద్, ఫిబ్రవరి 18(మనం ప్రతినిధి): అవినీతికి అతీతులమని చెప్పుకునే బీజేపీ నేతృత్వంలోనే బ్యాంకు కుంభకోణాలు జరుగుతున్నాయని, రాఫెల్ విమానాల కొనుగోలు వ్యవహారంలో కూడా అనుమానాలు ఉన్నాయని సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి ఆరోపించారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. నీరవ్ మోదీ పంజాబ్ 15,604 కోట్ల కుంభకోణానికి పాల్పడి దేశం విడిచి పారిపోతే ఇది తమ హయాంలో జరగలేదని పేర్కొంటూ బీజేపీ దీన్నించి తప్పించుకోవడానికి ప్రయత్నిస్తోందని అన్నారు. హరిప్రసాద్ అనే వ్యక్తి 2016లోనే నీరవ్‌మోదీ అవినీతి గురించి ప్రధానమంత్రి కార్యాలయానికి వివరంగా లేఖ రాశారని, ఆయన దేశం దాటి పారిపోకుండా అరెస్టు చేయాలని అందులో పేర్కొన్నారన్నారు. ఈ ఏడాది జనవరి ఒకటిన నీరవ్ మోదీ విదేశాలకు పారిపోయారని, లేఖ రాసి రెండేళ్లు గడిచినా, ఆ అంశంపై విచారణ ఎందుకు జరగలేదని ఆయన ప్రశ్నించారు. ఇటీవలే దావోస్‌లో జరిగిన వేడుకలో ప్రధాని మోదీ, నీరవ్‌తో కలిసి ఫొటో ఎలా తీసుకున్నారని ఆయన ప్రశ్నించారు. ఈ కుంభకోణానికి ఎవరెవరో బాధ్యులో వారిని శిక్షించాలని, వీటిపై ప్రజలందరికీ సమాధానం కావాలన్నారు. నీరవ్ మోదీని స్వదేశానికి రప్పించి శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. బీజేపీ మద్దతుతో రాజ్యసభ సభ్యుడైన విజయ్ మాల్యా వేల కోట్ల ధనం బ్యాంకులకు ఎగవేసి విదేశాలకు ఎలా పారిపోయాడని ఆయన ప్రశ్నించారు. లలిత్ మోదీ కూడా మోసాలకు పాల్పడ్డారని, ఆయన విదేశాలకు పారిపోవడంలో బీజేపీ నాయకులు సుష్మస్వరాజ్, వసుంధర రాజేల మద్ధతు ఉందని ఆరోపించారు. వారిని తిరిగి దేశానికి రప్పించడంలో ఎన్‌డీఏ ప్రభుత్వం తాత్సారం చేస్తుందని, ప్రభుత్వ అధినేతల అండతో బ్యాంకుల లూటీలు జరగటం పట్ల సీపీఐ తీవ్ర అగ్రహాన్ని వ్యక్తం చేస్తుందన్నారు. జైషాతో సహా తమపై వచ్చిన ఆరోపణలపై విచారణ లేకుండా తొక్కిపెట్టారని, తాము అవినీతి కళంకం అంటని సచ్ఛీలురుగా బీజేపీ బొంకుతున్నదని విమర్శించారు. రాఫెల్ విమానాల కోనుగోలు వ్యవహారంపై పారదర్శకతను సీపీఐ డిమాండ్ చేస్తుందని, అధికారం రహస్యం పేరుతో అవినీతిని కప్పిపుచ్చడం మహాపరాధమన్నారు. రాఫెల్ డీల్‌పై దేశంలో చర్చ జరగాలని, ఆ వ్యవహారం ఎలా జరుగుతుందో తెలుసుకునే హక్కు ప్రజలకు ఉందన్నారు. డీల్‌కు సంబంధించి పూర్తి సమాచారాన్ని ప్రజలకు వివరించాలని ఆయన డిమాండ్ చేశారు. మత, కుల పరమైన అంశాలతో పాటు, ప్రాంతీయతత్వం, భావోద్వేగాలు వామపక్షాన్ని బలహీనపరుస్తున్నాయని, బాధ్యతయుతమైన ప్రతిపక్షంగా తమ పాత్ర కొనసాగుతోందని ఆయన ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

సెక్యులర్ శక్తులు ఏకం కావాలి

నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్పొరేట్ పెట్టుబడులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నదని, వాళ్లకు లాభం చేకూర్చేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దేశంలో నిరుద్యోగం, పేదరికం పెరిగిందని, దాని ఫలితంగా ప్రజల్లో అసంతృప్తి వచ్చిందన్నారు. మేధావులు, రచయితలు,కవులపైన వేధింపులు కొనసాగుతున్నాయన్నారు. వామపక్షాలు ఐక్యతను పటిష్ట చేసుకోవాలని, సెక్యులర్ శక్తులన్నీ కలవాలని తెలిపారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం ఫాసిజానికి వ్యతిరేకంగా ప్రతిఘటన పోరాటం చేయాల్సి ఉందని, ఇది ఎన్నికల ఎత్తుగడ కాదని ఆయన తెలిపారు. పార్టీల ఐక్యత, ప్రతిఘటన పోరాటం వేరు వేరని పార్టీ భావిస్తుందన్నారు.

మన సాహితి


తరగతి గది



నిన్నటి కలలోంచి
పుట్టిందే నేటి కళ
అది రేపటికి
ఓ కథగానో, చరిత్ర
గానో జీవిస్తుంది
నడిచి వెళ్తున్న దారంతా
అక్షరాల వాసనే
మట్టి పొత్తిళ్లలో మొలిచిన
విత్తనాల గింజల్లోని పచ్చని ఆకాశంలా
ఎంతో కష్టమైన కవిత్వాన్ని
మరెంతో ఇష్టంగా చదివినం
గొట్టు లెక్కల ఆల్జెబ్రాని
పట్టుదలతో సాధించినం
మెట్లెక్కడం నేర్చుకుంటే
గమ్యంలో సులభమే సుఖమే...
మనిషి ఎదుగుదలకు
విద్య, విజ్ఞానం జోడెద్దులు
విజయతీరాల్ని చేర్చే ప్రయాణంలో
అనుభవం, ఆలోచనల జంటకవులు
గురువులు తిరుగాడిన నేలలో
ఎంత సౌందరనందమో అక్షరం
విద్యార్థి ఎదిగిన తరగతి గది
మరెంతో సౌందర్య ఆనందాల జ్ఞాన బోధి
చీకటిని చీల్చేది ఓనమాలు
కష్టాలనూ, కన్నీళ్లనూ జ్వలించే
తరగతి గదే / నా కవితా జ్వాల
అదే జీవిత విలువలు నేర్పే ప్రయోగశాల

- డాక్టర్ టి. రాధాకృష్ణమాచార్యులు
9849305871





శతరాగాల 'ఫిడేలు'

తెలుగు కవితారంగాన్ని సుమారు మూడు దశాబ్దాలుగా, ఏకఛత్రాధిపత్యంగా ఏలిన భావకవిత్వం గతానుగతికమై, క్రమంగా ప్రవాహగతిని కోల్పోయి, నిలువ నీటికాసారంగా మిగిలిపోయిన రోజుల్లో, కవిత్వంలో కొత్తదారులు అన్వేషించిన వారిలో పతాభి ముఖ్యులు. జీవితంలోనూ, కవిత్వంలోనూ, తిరుగుబాటును ప్రదర్శించిన కవి పతాభి. సమకాలంలోనూ, కాలంకంటె ముందువున్న కవి, తెలుగు కవిత్వం ఆధునికత దశలోకి ప్రవేశించక మునుపే ఆత్యాధునికతను ప్రదర్శించిన కవి. ''నా వచన పద్యాలనే దుడ్డు కర్రలతో పద్యాల నడుములు విరుగదంతాను'' అని భీషణ ప్రతిజ్ఞ చేసిన కవి. అచ్చయిన తన తొలికావ్యం ''ఫిడేలు రాగాల డజన్''తో అంతకు ముందు కవితారంగంలో వేళ్లనికొని వున్న సమస్త సంప్రదా యాలను ధ్వంసం చేసింది. తర్వాతి కాలంలో వచన కవితా ప్రక్రియ వ్యాప్తికి దారులు సుగమం చేసింది. ఫిడేలు రాగాల డజన్(1939). కవిత్వంలో ప్రయోగ ప్రియత్వానికే నీలగిరి నీలిమలు. (1950) కయత నా దయత(1978) భాష మీద ప్రభుతకు, ఛందో వైవిధ్యానికి, పతాభి పంచాగం(1980) అధిక్షాపానికీ, చమత్కార ప్రియత్వానికి నిదర్శనాలు.

తెలుగులో భారీ బడ్జెట్ సినిమాలు తీసి నష్టపోయిన పతాభి, కన్నడంలో సంస్కార, చండమారుత, శృంగారమీస వంటి విజయవంతమైన చిత్రాల దర్శకుడు. గణితంలో ఆసక్తివున్న పతాభి, ప్రపంచ ప్రసిద్ధిగాంచిన గణిత సమస్య 'ఫెర్మాట్ నంబర్ థియరీ'లో కొంత కృషి చేశారు. ఫ్రాయిడ్‌మన్ విశ్లేషణ, ఐన్‌స్టీన్ సాపేక్ష సిద్ధాంతాలతో పాటు, షెల్లీ, కేట్సు, విట్మన్, వైట్ట్, ఠాగురు, చలం, శ్రీశ్రీ రచనలు పతాభిని ప్రభావితం చేసిన అంశాలు. తొలినాళ్లలో భావకవిత్వం ప్రభావంతో యవ్వన స్వప్నము, ఆవేదన, వంటి ఖండకావ్య సంపుటాలు రాసినా, అముద్రితంగానే వుండిపోయాయి. దానికి కారణం శ్రీశ్రీ తన అనంతంలో ఇలా నమోదు చేసాడు''. పతాభి తాను పాతబాణీలో రాసిన వంద పేజీలకు పైగా సాగిన ఖండకావ్య సంపుటి ఒకటి, ''ఫిడేలు రాగాల డజన్'' ఒకటీ నాకిచ్చి, ''ఇందులో ఏది ముందుగా అచ్చేస్తే బాగుంటుందని'' నన్ను అడిగాడు రెండాఅపూ తిరిగేసి అక్కడక్కడ చదివి పద్యాల పుస్తకం అతనికిచ్చేసి, 'దాని సంగతి మర్చిపో' అన్నాను. ''ఆ రకంగా పతాభి ప్రణయ కవిత్వం వెనకపడి ఫిడేలు రాగాల డజన్ ముందుకొచ్చింది. దానికి శ్రీశ్రీ ఇంట్రీ కూడా రాయడం జరిగింది. అందాల హరివిల్లు లాంటి శాంతినికేతనం జీవితం నుండి, యునివర్సిటీ చదువు కోసం చిత్‌పూర్ రోడ్డులోని ఇరుకు గదుల నివాసం, అకుడి నగర జీవితం ఉక్కిరి బిక్కిరి చేసింది. కలకత్తాలో తాను అనుభవిం చిన యాంత్రిక జీవనాన్ని తర్వాత మద్రాసు నగరానికి అన్వయించి 'రాగాల డజన్' రాసారు. తెలుగులో వచ్చిన మొట్టమొదటి వచన కవితా సంపుటిగా, నగర కావ్యంగా, ఫిడేలు రాగాల డజన్ చరిత్రలో నిలిచిపోయింది. అయితే సమకాలంలో చలం, శ్రీశ్రీ, ఆరుద్ర, వంటి ఒకరిద్దరు తప్ప ఆ కావ్యాన్ని ఆహ్వానించలేకపోయారు, ఆస్వాదించలేకపోయారు. దిగంబరులకంటె ముందు, అంతకంటె ఎక్కువ స్థాయిలో దాడిని ఎదుర్కొన్న కావ్య సంపుటి, ఫిడేలు రాగాల డజన్. వెల్చేరు నారాయణరావు 'తన తెలుగులో కవితా విప్లవాల స్వరూపం' గ్రంథంలో పతాభి అలా ఎందుకు రాయల్సి వచ్చిందో విశ్లేషణ చేసేవరకు దాని మీది నీలినీడలు తొలగిపోలేదు. దీనిలోని 'ఆత్మకథ' ఖండిక మొత్తం పతాభి కవిత్వానికి మేనొఫెస్టో వంటిది. తన కవితాతత్వం గురించి, భావజాలం గురించి, భాషాప్రయోగం, సంవిధానం గురించిన అంశాలను పతాభి ప్రసావించారు. భోగంచాన, కామాక్షికోక, పోలిసు, నగరంలో జాబిల్లి, వంటి ఖండికలు పతాభి కవితా పారమ్యాన్ని పంచే కవితలు.

శ్రీశ్రీ సూచనలతో తన ప్రణయ కవిత్వం అచ్చువేయడం మానుకున్నాడు. కానీ, వచన పద్యాల దుడ్డుకర్రలతో పద్యాల నడుములు విరగదంతాను' అన్నాడు కానీ, చిన్నప్పటి నుంచి తాను అభిమానించి, గొప్ప అభినివేశం సంపాదించుకున్న సంప్రదాయ మాత్రాఛందుసులపై మోజును మాత్రం ఒదులుకోలేకపోయాడు. నిజానికి 1939లోనే ఫిడేలు రాగాల డజన్ వంటి అత్యాధునిక ప్రయోగశాల వంటి వచన కవితా సంపుటి వెలువరించాక, 1977లో ప్రాచీనభాష, వస్తువు, ఛందస్సులను ఆశ్రయించి కొనసాగిన 'కయత నాదయత'ను మరొక కవి అయితే వెలువరించి వుండక పోవును. ఈ పీఠికాకర్త పతాభిని చేసిన ఇంటర్వ్యూతో వచనకవితలు, మాత్రాఛందస్సు, పన్‌చాంగం ఈ మూడు ప్రక్రియలను తాను ఏకకాలంలో ప్రారంభించి, వివిధ దశలలో కొనసాగించానని స్వయంగా చెప్పుకున్నాడు. ఇది ఒకరకంగా భావజాల పరంగా వైరుధ్యం అనే చెప్పుకోవాలి. ''చివరి ప్రాసలనాభి/ చిత్రమైన పతాభి/కావ్య సుధల పతాభి/ ఓ కూనలమ్మ అని ఆరుద్ర కితాబు యిచ్చినా, కయత నాదయతకు రాసిన ముందు మాటలో ఆ కావ్యానికున్న పరిమితులను ''సత్కవులందరిలో కనిపించే సద్భావనలన్నీ ఈ సంపుటిలో అక్కడక్కడా కనబడతాయి. సంవిధాన పులతాగుల్మాలలో ఆకుసుమాలు మరుగున పడతాయి'' ఆరుద్ర సరిగ్గానే అంచనా వేసారు.

ఇక పతాభి మూడో గ్రంథం, పతాభి పన్‌చాంగం. వ్యంగపు వజ్రపుతునకలు ఫిడేలు రాగాల పజన్ వంటి అధిక్షాప వచనకవితా సంపుటి, ఛందస్సును మైనపు ముద్దలా మలచిన కయత నాదయత 'గేయసంపుటి వంటి రచనలు చేసిన పతాభి తనలో సహజ సిద్ధంగా వున్న హాస్యచతురత, సెన్స్ ఆఫ్ హ్యూమర్‌ను, వ్యంగ్య వైభవాన్ని మేళవించి 'పన్‌చాంగం' రచించారు. ఇంగ్లీషులో వున్న ఫన్ ను, తెలుగు పంచాంగం' ను మేళవించి, 'పంన్‌చాంగం' అనే కొత్త పదబంధాన్ని సృష్టించి పన్‌లను రాసారు. 1947 లో ఆనంద వాణి పత్రికలో కొన్ని, 1964లో జ్యోతి మాసపత్రికలో పూర్తిగాను, ఆంగ్లంలో ఆస్కార్ వైల్డ్, తెలుగులో సి.ఆర్.రెడ్డి ఒక సందర్భంలో, విద్యాధికారి అంటే 'విద్యకు అరి' అని చెప్పిన పన్‌ల ప్రేరణలో 365 పన్‌లను రాశారు. ఒకరకంగా సమకాలీన సామాజిక వ్యవస్థకు వ్యాఖ్యానం ఈ పన్‌లు. ఇందులో రాజకీయాలు, మతం, భాష, పెళ్లిళ్లు, సినిమా, మద్యపానం, శృంగారం వంటి అనేక అంశాలు స్పృశించబడ్డాయి. తనదైన లోచూపుతో కొత్త పదాలను అన్వేషించి, పతాభి ఈ పన్‌లకు సాహిత్య గౌరవం కల్పించాడు.

''మన జాతిలో సవర్ణ వివాహాలు/ సవర్ణ వివాహాలు పోవాలి; దంతి కన్న వదంతి పెద్దది. కారుకన్న పుకారు స్పీటు; పొగాకు పగాకు' వంటి పన్‌లు అటు చమత్కారంతో పాటు సామాజిక ప్రయోజనం కలివున్నవి. వేసినా, తీసినా బాధకలిగించేవి పన్నులు అని 'పన్ను' మీద పతాభి చెప్పిన పన్ విని నవ్వనివారుండరు. అందుకే ఆరు పన్నులలో సంపన్నుజువర్మా' అని చమత్కరించాడు'' పతాభి. పన్ చంగంలోని పసిడి పలుకుల విటమిన్‌బి గుళికలను రోజుకొకటి చొప్పున సేవిస్తే మనస్సుకి ఆరోగ్యం, ఉల్లాసం సిద్ధిస్తాయని నేను గ్యారంటీగా చెప్పగలను, అని శ్రీశ్రీ అన్నాడంటే ఈ పన్‌లో ఎంత శక్తిమంతమైనవో అర్థంచేసుకొవచ్చు. వచన కవితను చేపట్టినా, మాత్రాఛందస్సులలో గేయాలు నడిపించినా, చిన్నిచిన్ని మాటల విడుపులో పెద్ద అర్థాలు స్ఫురింపజేసినా అన్నిటా పతాభి ప్రయోగాలకు పట్టంకట్టిన కవి. ఆధునికులలో అత్యాధునిక కవి. అయితే ఈ త్రిపుటిలో 'ఫిడేలురాగాల డజన్' పతాభి మాగ్నమ్ ఓపస్ అని చెప్పక తప్పదు.

> దాదాపు ఎనిమిది దశాబ్ధాల క్రితం వెలువడ్డ 'ఫిడేలు రాగాల డజన్' తనను చాలా ప్రభావితం చేసిందని ఆరుద్ర స్వయంగా ప్రకటించుకున్నారు. ఈనాడు ఆరుద్ర ముద్ర అనేదంతా నిస్సందేహంగా పతాభిముద్రే. దానిని దాటి ఆరుద్ర బయటపడలేదని శ్రీశ్రీ ఒకచోట ప్రకటించారు. పాతను తోసిపుచ్చి కొత్త ప్రక్రియ పురుడుపోసుకున్న ఆ సమయంలో సంప్రదాయ కవులు విరుచుకుపడ్డారు, మండిపడ్డారు, ఛందోజ్ఞానం లేదు, ఈ కొత్త కవులు అన్నీ సంకరం చేశారనే విమర్శలు వెల్లువెత్తాయి. కొత్త ప్రక్రియ విమర్శలకు గురికావటం తెలుగు కవిత్వంలో కొత్త ఏమీ కాదు.

◆ శిఖామణి
9848202526

'కయిత'కు 'పతాభి'షేకం

నమ్మిన సిద్ధాంతం కోసం, చేరదలచిన లక్ష్యం కోసం, అడ్డంకులనూ, అవరోధాలనూ లక్ష్యపెట్టని సాత్విక సాహసి. నూతనత్వం కోసం అన్వేషించే సుప్రతిష్ఠితుడు. అంతరాంతరాల్లో అచ్చయిన విప్లవకవి ''పతాభి''. భావకవిత్వం మీద పనిగట్టుకొని దండయాత్ర చేసినవాడు. అనుసరిస్తాను నవీనపంథా... నేనహంభావ కవిని అని ప్రకటించుకొని కవిత్వపరంగా ఆనాటి కవిత్వానికి విద్యుత్ చికిత్స చేశారు. భావ కవిత్వంలో ఏవి సున్నితంగా చెప్పుకుంటారో వాటినన్నింటినీ హేళనచేస్తూ సాగిన కవిత్వం. తెలుగు కవిత్వంలో చిరకాలంగా కవితా వస్తువులుగా అలవాటయిన ప్రతి వస్తువునూ, భావాన్నీ, శైలినీ అకవిత్వాంశాలుగా ప్రదర్శించిన అక్షర సాహసి పతాభి. దాదాపు ఎనిమిది దశాబ్ధాల క్రితం వెలువడ్డ 'ఫిడేలు రాగాల డజన్' తనను చాలా ప్రభావితం చేసిందని ఆరుద్ర స్వయంగా ప్రకటించుకున్నారు. ఈనాడు ఆరుద్ర ముద్ర అనేదంతా నిస్సందేహంగా పతాభిముద్రే. దానిని దాటి ఆరుద్ర బయటపడలేదని శ్రీశ్రీ ఒకచోట ప్రకటించారు. పాతను తోసిపుచ్చి కొత్త ప్రక్రియ పురుడుపోసుకున్న ఆ సమయంలో సంప్రదాయ కవులు విరుచుకుపడ్డారు, మండిపడ్డారు, ఛందోజ్ఞానం లేదు, ఈ కొత్త కవులు అన్నీ సంకరం చేశారనే విమర్శలు వెల్లువెత్తాయి. కొత్త ప్రక్రియ విమర్శలకు గురికావటం తెలుగు కవిత్వంలో కొత్త ఏమీ కాదు. నండూరి సుందరమైన భావాలను సరళమైన భాషలో పాటగా మలిచినప్పుడూ, 1917లో వారు వెలుగులోనికి తీసుకువచ్చినప్పుడు అప్పటి పండితులు, చాదస్తులూ విరుచుకుపడ్డారు. శ్రీరంగం నారాయణబాబు, శిష్ట్లా ఉమామహేశ్వరరావు, శ్రీశ్రీ వీరంతా ఇలాంటి విమర్శలు ముందు - వెనుక ఎదుర్కొన్న వారే. కానీ 'పతాభి' ఎనిమిది దశాబ్దాల కిందట తెలుగు సాహితీవనంలో అడుగుమోపిన పతాభి ఫిడే లు రాగాల డజన్ ఆ క్షేత్రాన్ని కుదిపివేసింది. అల్లకల్లోలం చేసింది. అత్యధికంగా పతాభిని దుమ్మెత్తిపోయగా, కొద్దిమంది ఆయన పక్షాన నిలిచారు. ఆయన కవిత్వంలోని కొత్త కవిత్వంలోని సరికొత్త అందాలను తెలుగుభాషకు, సాహిత్యానికి అందచేసిన ఆయనను ఆదర్శంగా అనుసరించినవారూ, ఆదర్శంగా తీసుకున్న వారూ ఉన్నారు. వీరి కవిత్వంపై అనేక విమర్శలు, సమీక్షలు పుంఖానుపుంఖాలుగా వెలువడ్డాయి. వీరి కవిత్వం తెలుగు విమర్శకులను రెండుగా చీల్చింది. వీరి కావ్యాల ముందుమాటలు, మంచిమాటలపై కూడా చర్చలు, వాదోపవాదాలు జరగటం, అధ్యయనపు వస్తువులుగా ఉపకరించటం వరకు వెళ్లాయి. చలం, దువ్వూరు రామిరెడ్డి, శ్రీపాద గోపాల కృష్ణమూర్తి, కె.వి.రమణారెడ్డి, సి.నారాయణరెడ్డి, ఆరుద్ర, త్రిపురనేని, విశ్వనాథ, విశ్వం, శ్రీశ్రీ, వేల్చేరు లాంటి ప్రముఖుల మధ్య జరగటం విశేషం. శ్రీశ్రీ ఇంట్రోను రామిరెడ్డి సుదీర్ఘమైన వ్యాసమే రాశారు. త్రివేణి లాంటి ఆంగ్ల పత్రికల్లో సైతం పతాభిపై సమీక్షా వ్యాసాలు వెలువడ్డాయి. తెలుగు కవిత్వంలో ప్రకంపనాలు సృష్టించి, నేటికీ సరికొత్త కవిత్వానికి వేదికైన పతాభి ఎవరు?

'పతాభి'గా పరిచయమైన తిక్కవరపు పట్టాభిరెడ్డిది అధికార ఐశ్వర్య కుటుంబం. స్వాతంత్ర్య సమరయోధుడు, బాపూజీకి మిత్రుడు, సాహిత్య పోషకుడు, వందేళ్ల క్రితం తిక్కన జయంతులు ప్రవేశపెట్టిన తిక్కవరపు రామిరెడ్డి కుమారుడు.. బెజవాడ గోపాల రెడ్డి మేనల్లుడు. 1919 ఫిబ్రవరి 19న నెల్లూరులో జననం. మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాల శాంతినికేతన్, కొలంబియా విశ్వవిద్యాలయంలో విద్యాభ్యాసం. స్నేహలతా పావెల్‌తో జీవితం పంచుకున్న సంస్కారి. పుచ్చలపల్లి సుందరయ్య ఆయన బంధువు. ఎమర్జన్సీ రోజుల్లో ఇందిరాగాంధీ విధానాలను వ్యతిరేకించి, భార్య స్నేహలతారెడ్డితో కలసి అత్యవసర పరిస్థితికి వ్యతిరేకంగా విస్తృతంగా ప్రచాయం చేశారు. ఆ సందర్భంగా అరెస్టు అయిన స్నేహలతారెడ్డి జైలులోనే చిత్రహింసలకు గురై కొద్దిరోజులకే మరణించారు. పద్నాలుగేళ్ల వయస్సులోనే స్థానిక పత్రికలో వీరి పద్యాలు అచ్చయినాయి. నిర్మాత, దర్శకుడు కె.వి.రెడ్డికి అసోసియేట్ ప్రొడ్యూసరుగా జయంతి పిక్చరుపై తెలుగు, కన్నడ చిత్రాలు పొంది ప్రాంతీయ, జాతీయ అవార్డులను, 'సంస్కార' కన్నడ చిత్రం ద్వారా జాతీయ ఉత్తమ చిత్రంగా స్వర్ణకమలం అందుకున్నారు. అంతర్జాతీయ రష్యా, చైనాల కమ్యూనిజం పాత్ర నచ్చలేదని చెప్పే పతాభి లోహియా ప్రభావితుడై సోషలిజం వైపు మళ్లానని చెబుతారు. 'నాకు కవిత్వాభిక్ష పెట్టింది శ్రీశ్రీ అని లోకులు అనుకుంటారు. నిజానికి కవితాదీపం నాలో వెలిగించింది పతాభి' - అని స్వయంగా ఆరుద్ర ప్రకటించుకున్నారు. నారాయణబాబుకు స్పష్టమైన మార్గం లేదు, కానీ పతాభి ఒక నిర్దిష్టమైన మార్గాన్ని నిరాఘాటంగా యెన్నుకున్నారని త్రిపురనేని ప్రకటించారు. తెలుగులో రాసిన కవిత్వమే అయినా, తెలుగు ప్రాంతానికి దూరంగా ఉండి ఫిడేలు రాగాల డజన్, కయిత నా దయిత, పతాభి పన్‌చాన్‌గమ్‌తో తెలుగు కవిత్వానికే పారిజాతాలు అందించిన తొలి తెలుగు కవిగా నిలిచిపోయారు.

◆ ఈతకోట సుబ్బారావు
8008562742

నేడు పతాభి జయంతి

మాతృభాషపై జాతీయ సదస్సు

ఫిబ్రవరి 22, 23తేదీలలో ఐసీఎస్ఎస్ఆర్ సౌజన్యంతో చిత్తూరులోని పి.వి.కె.ఎన్. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'ఆధునిక వ్యవస్థలో మాతృభాష ప్రాధాన్యత' అనే అంశంపై జాతీయ సదస్సు జరుగుతుంది. సదస్సులో 1. మాతృభాష ప్రాధాన్యత, 2. ప్రస్తుత సమాజంలో మాతృభాష స్థానం, 3. ప్రాథమిక విద్యావిధానంలో - మాతృభాష అమలు-తీరుతెన్నులు, 6. నేటి విద్యావిధానంలో - మాతృభాష ప్రాధాన్యత, 7. మాతృభాష - ప్రస్తుత సమస్యలు, 8. మాతృభాష అభివృద్ధి - చేపట్టవలసిన చర్యలు అనే అంశాలపై చర్చ జరుగుతుంది. డాక్టర్ జి. ఆనందరెడ్డి సభాధ్యక్షతన ముఖ్య అతిథి ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, విశిష్ట అతిథిగా ఆచార్య పేట శ్రీనివాసులరెడ్డి, ఉపన్యాసకులుగా ఆచార్య మేడిపల్లి రవికుమార్, ఆచార్య జె.వి. సత్యవాణి, ప్రత్యేక అతిథిగా కేంద్ర సాహిత్య అకాడమి యువ పురస్కార గ్రహీత డాక్టర్ అప్పిరెడ్డి హరనాథ రెడ్డి తదితర ప్రముఖులు ఈ సదస్సులో పాల్గొంటున్నారు.

- డాక్టర్ పి. వాసు,
తెలుగు శాఖ, పి.వి.కె.ఎన్. ప్రభుత్వ కళాశాల, చిత్తూరు

పెన్నా సాహిత్య పురస్కారం

పెన్నా రచయిత సంఘం వార్షికోత్సవం సందర్భంగా 'పెన్నా సాహిత్య పురస్కారం -2016, 2017ల్లో ప్రచురితమైన కవితా సంపుటాలు పంపించాలి. నాలుగు ప్రతులను మార్చి 15లోగా గుండాల నరేంద్రబాబు, 25-1-890, నేతాజీనగర్, 3వ వీధి, ఏకే నగర్ పోస్టు, నెల్లూరు -524004కు పంపించాలి.

-అవ్వారు శ్రీధర్‌బాబు
9493235992

నేడు పతాభి శతజయంతి ఉత్సవం

కవిసంధ్య నిర్వహణలో ఈ నెల 19న యానాంలో పతాభి జయంతి ఉత్సవం జరుగుతుంది. 'పతాభి సాహిత్యం - ప్రాసంగికత' అనే అంశంపై జరిగే సదస్సులో శిఖామణి, అత్తలూరి నరసింహారావు, సీతారాం, అదృష్టదీపక్, వంశీకృష్ణ, వాడ్రేవు వీరలక్ష్మీదేవి, జోస్యుల కృష్ణబాబు, దాట్ల దేవదానం రాజు పాల్గొంటారు.

- కవిసంధ్య

22న వుప్పల లక్ష్మణరావు వర్ధంతి

ఈనెల 22న వుప్పల లక్ష్మణరావు వర్ధంతి. ఈ సందర్భంగా 'వుప్పల లక్ష్మణరావు స్మారక జీవన సాఫల్య పురస్కారసభ' విశాఖపట్నంలో జరుగుతుంది. ఈ స్మారక పురస్కారాన్ని దేవరకొండ కొండలరావుకు అందజేస్తారు. విశాఖ పౌరగ్రంథాలయం, మినీహాల్‌లో జరిగే ఈ సభలో అడపా రామకృష్ణ, డీఎస్ఎన్‌రాజు , పి.అనంతరావు పాల్గొంటారు.


-అంగర కృష్ణారావు

సందర్భం

ఇది బుద్ధ వచన ప్రామాణికతకు దర్పణం

పుస్తక సమీక్ష





ఇది శ్రీ దేవన చంద్రశేఖర్ చేసిన పరిశోధన గ్రంథం ''బుద్ధవచన ప్రామాణికత''. దీనిని పీకాక్ బుక్స్ హైదరాబాద్ వారు ప్రచురించారు. మొన్న జనవరిలో విజయవాడ 29వ పుస్తక మహోత్సవంలో కొద్దిమంది మిత్రుల మధ్య ఆవిష్కరించటం జరిగింది. బుద్ధుని జీవితం గురించి, ఆయన బోధనల గురించి విస్తృత చర్చ జరుగుతోంది. చిన్న పత్రికల నుంచి పెద్ద పత్రికల దాకా బౌద్ధం పట్ల, దాని సాహిత్యం, తాత్విక చింతన పట్ల ఒక చర్చ నడుస్తోంది. ఈ నేపథ్యంలో వస్తున్న అనేక రచనల్లో అనేక భిన్నాభిప్రాయాలు బయలుదేరాయి. కొంత కాలంగా ఈ భిన్నాభిప్రాయాల్లోని వాటిలో ఏది నిజం? ఏది వైరల్? అనే దిశగా ఆలోచనలు సాగుతున్నాయి. చంద్రశేఖర్‌కు బౌద్ధంపై మంచి అధ్యయనం ఉంది. అందుకు గతంలో ఆయన చేసిన ఎన్నో విలువైన అనువాదాలు రచనలు మంచి ఉదాహరణలు. బౌద్ధ ధర్మసారం, గౌతమ బుద్ధుడు, బుద్ధుని జ్ఞాన సిద్ధాంత సూచిక కాలామసుత్తం, ధర్మావరణం, బుద్ధుని సొంతమాటల్లో సమ్మావాచ, అశేష నిరోధం మరియు ధ్యాన ఫలితం, ఇప్పుడు ఈ బుద్ధ వచన ప్రామాణికతను కాలానుసారం వల్లనే విడుదలచేశారు.

ఈ పరిశోధనా గ్రంథానికి మంచి ముందుమాట కూడా రచయితే రాసుకున్నారు. మొత్తంగా పది అధ్యాయాలున్నాయి. తొలి అధ్యాయంలో బుద్ధవచన ప్రామాణికతను అధ్యయనం చేయటం ఎందుకు? అనే ప్రశ్నతో మొదలౌతుంది. ఇందులోనే అయిదు ముఖ్యమైన ప్రశ్నలను ముందుంచుకొని వాటికి సమాధానాలు పొందుపరిచారు. అవి కాలానికీ, ఆనాటి హిందూ మతానికి, బౌద్ధానికీ ఉన్న వ్యత్యాసాన్ని చాలా స్పష్టంగా చెప్పటం ఉంది. రెండో అధ్యాయంలో బుద్ధ వచనాన్ని నిక్షిప్తం చేశాయని చెప్పబడిన ప్రాచీన బౌద్ధగ్రంథాలు మనకు (లోకానికి) ఎప్పుడు ఎలా అందుబాటులోకి వచ్చాయో తెలియపరిచే వివరా లున్నాయి. మూడోది, బుద్ధవచన ప్రామాణికతకు ఒక నిర్దిష్ట నిర్వ చనాన్ని ప్రతిపాదిస్తూ, దానిని చర్చించిన పద్ధతిని, పరిధిని స్థూలంగా వివరిస్తుంది.

ఇక నాలుగు నుంచి ఎనిమిది దాకా ప్రాచీన బౌద్ధ గ్రంథాలు, మరికొన్ని అనుబంధ వనరుల ద్వారా భారతదేశ చరిత్రలో బుద్ధుని కాలం నాటి భౌగోళిక, రాజకీయ, ఆర్థిక, తాత్విక, సామాజిక పరిణామాలను విశ్లేషిస్తూ, బుద్ధ వచన ప్రామాణికతను చర్చించటం చేశారు. మరి తొమ్మిదవది మూలగ్రంథాల్లో చోటు చేసుకున్న భిన్నమైన, పరస్పర విరుద్ధమైన కొన్ని అసంగత సత్యాలను చర్చించారు. చిట్ట చివరిదైన పదో అధ్యాయంలో గత 25 శతాబ్దాలకు పైబడి బౌద్ధ అనుయాయులు బౌద్ధాన్ని ఒక జీవన మార్గంగా అవలంభించదలచిన వారు బుద్ధ వచన ప్రామాణికత అనే విషయాన్ని ఎలా పరిగణించారనే విషయాలను ఉటంకిస్తూ వాటి ఆధారంగా ప్రామాణికతను మరో భిన్నమైన కోణంలో వివరించారు. ఇలా ఈ గ్రంథాన్ని పాఠకులకు ఏది ఎక్కడ ఏ ప్రధాన అంశాలతో కూర్చటం జరిగిందో రచయితే ముందుమాట ద్వారా చెప్పి చదూవరులను మరింతగా తన మార్గంవైపు ఆకర్షించటం కనిపిస్తుంది. అలాగే ఈ గ్రంథ రచనలో భాగమైన ప్రధాన వనరులు ఏఏ గ్రంథాల లోంచి తీసుకున్నారో కూడా చక్కటి సమాచారం చివర్లో చూపించారు. అవి చూశాక రచయితగా చంద్రశేఖర్ పడిన కష్టం మరింతగా గుండెలకద్దుకుంటుంది.

అసలు బుద్ధవచనమేదో, కానిదేదో తేల్చుకోవటానికి పాఠకులు పడుతున్న గందరగోళాల్ని సులభమార్గంలో తొలగించేందుకు, తాను లోతైన పరిశీలన చేసి అందించిన గ్రంథంగా నిలుస్తుంది. పాలుకు పాలూ, నీళ్ళకు నీళ్ళూగా బౌద్ధాన్ని ఒక కాపుకాచే మెరుగై పరిశోధనగానూ ఉంటుంది. ఈ గ్రంథం చదవటం పూర్తిచేసిన వాళ్ళు, తామే స్వయంగా బుద్ధవచనంలో ఉన్న సత్యశోధనల రూపాల్ని పసిగట్టగలరు.

మయన్మార్‌లో జరిగిన ఒక జాతి నిర్మూలనలో కీలక భూమిక పోషించిన బౌద్ధ రూపం షిలాని కిరాయితనాన్ని ఎండగట్టాలన్నా ఈ గ్రంథం కరదీపికలా ఉంటుంది. ఇవాళ ఆధునిక భావాలు గల వారు ఆకర్షించినా, విమర్శకులు బుద్ధుడు చాలడు అని వ్యాఖ్యానించినా, తమకు అనువైన రీతిలో మలచుకొని ఇదే బౌద్ధం అని బుకాయించే వారికి, అనేక కుతర్కాలకూ ఈ ప్రామాణిక గ్రంథం ధీటుగానే సమాధానం ఇస్తుంది.

క్రీ.పూ. 563లో జన్మించి, 483లో మరణించిన బుద్ధుడు తన 80 ఏళ్ల జీవితాన్ని అన్ని కోణాల్లో కాలాన్ని పట్టికొని చేసిన ఈ బోధనలు ఇవాళ్టికీ మన సమాజంలో నిలుస్తూన్నాయంటే రాహుల్ సాంకృత్యాయన్ అన్నట్టుగా మహా మానవుడు బుద్ధుడు.

మరో ముఖ్యభూమిక ఏమంటే ఇవాళ తెలుగువారి రాజధాని ''అమరావతి'' కావటంతో బౌద్ధ ధర్మసారాంశం విశ్వసృష్టిలో తిరిగి ద్విగుణీకృతమైనట్టుంది. ఈ ప్రభావంలోంచి మొన్న స్వరాజ్య మైదానంలో రాష్ట్ర ప్రభుత్వమే పూనుకొని గ్లోబల్ పీస్ ఏర్పడాలంటూ రెండు వేలమంది బౌద్ధ బిక్షువులను ఆహ్వానించి రెండు రోజుల పాటు సెమినార్ నిర్వహించింది. విజయవాడ నగరాన్ని బిక్షువులు సందర్శించినందుకు వారి బోధనల నుంచి ప్రజలు ప్రేరణపొందాలని టూరిజం శాఖ మంత్రి తమ సందేశంలో ఆశించారు.

ఉపసంహారం: బుద్ధుని చుట్టూ తిరుగుతున్న కాలాన్ని అర్థం చేసుకోవటానికి చంద్రశేఖర్ అందించిన ఈ బుద్ధవచన ప్రామాణికత గ్రంథం తప్పక సాయం అందిస్తుందని గట్టి నమ్మకం.

◆ సజ్జా వెంకటేశ్వర్లు
9951169967

'మన సాహితి'కి వ్యాసాలు, లేఖలు పీడీఎఫ్, ఓపెన్ ఫైల్ ఫార్మాట్‌లలో పంపాలి.
e-mail: manamsahiti@gmail.com

భీమవరం దగ్గరలో ఎలూరుపాడు గ్రామంలో జన్మించిన ఎంవి సూర్యనారాయణ రాజు స్వాతంత్ర్య సమరయోధులు. ఆజాద్ హింద్ వ్యవస్థాపకుడు సుభాష్ చంద్ర బోస్‌తో కలసి పోరాడారు. కొంతకాలం జైలు జీవితం గడిపారు. ప్రస్తుతం రాజమండ్రి వాస్తవ్యులు. స్వాతంత్ర్యానంతరం కాంగ్రెస్ పార్టీలో చురుకుగా పని చేశారు. ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అభివృద్ధి నమూనా కారణంగా కుంగుతున్న డెల్టా ప్రాంత భూముల పరిరక్షణ కోసం ఆయన రైతాంగాన్ని కూడగట్టి ఉద్యమించారు. మనం ప్రతినిధికి ఎం.వి.సూర్యనారాణరాజు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూ...



డెల్టాను పరిరక్షించుకుందాం!



డెల్టాలో భూమి పొరలలో ఇసుక, రాళ్ళతో ఉన్నందువలన ఇక్కడ ఆయిల్ నిక్షేపాలు, సహజ వాయువు వెలికి తీయటంతో భూమి కుంగిపోయే ప్రమాదం ఉందని డెల్టా పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు ఎం.వి. సూర్యనారాయణరాజు తెలిపారు. ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ విశేషాలు...

ప్ర: డెల్టా పరిరక్షణ సమితి ప్రయోజనాలు ఏమిటి? ఎంతవరకు సాధించారు?

జ: ముందుగా మనం తెలుసుకోవలసిన విష యమేమంటే.. డెల్టాలో భూమి పొరలలో ఇసుక, రాళ్ళతో ఉండడంతో ఇక్కడ ఆయిల్ నిక్షేపాలు, సహజ వాయువు వెలికితీయటంతో భూమి కుంగిపోయే ప్రమాదం ఉందని గ్రహించి కొంతమందితో కలిసి డెల్టా పరిరక్షణ సమితిని స్థాపించాం. 2008లో రిజిష్టరు చేశాం. దానిలో భాగంగా గల్ఫ్ ప్రాంతంలో భూమి కింద సున్నపురాయి నిక్షేపాలు ఉండడంతో ఎటువంటి ప్రమాదం లేదని తెలుసుకుని మన ప్రాంతంలో భూమి అడుగున నుంచి వెలికి తీయటం వలన కుంగిపోయే ప్రమాదం పొంచి ఉందని రాష్ట్ర, దేశ నాయకులకు విన్నవించుకోవటం మొదలుపెట్టాం.అందరూ పెడచెవిన పెట్టారు. అప్పుడు పోరు ఉధృతం చేయడంతో కోర్టు ద్వారా కేంద్ర ప్రభుత్వంతో కమిటీ వేయించాం. ఆ కమిటీ తూర్పులో 10 మండలాలు, పశ్చిమ గోదావరి జిల్లాలో కాళ్ళ, భీమవరం రూరల్, నర్సాపురం మండలాల్లో భూమి కుంగిపోయిందని నివేదక ఇచ్చింది. కాని కేంద్ర ప్రభుత్వం ఐదేళ్ల నుంచి ఆ నివేదిక ప్రతిని కోర్టుకు సమర్పించకుండా కాలయాపన చేస్తూ వచ్చింది.

ప్ర: ఇందుకు కారణం ఏమిటి?

జ: ఓఎన్‌జీసీ, ముఖేష్ అంబానీ వెలికి తీసే సహజ వాయువు నిక్షేపాలను న్యాయస్థానం ఎక్కడ నిలిపేస్తుందో అనేదే ఈ కాలయాపనకు కారణం.


ప్ర:భూమి కుంగుబాటును ఎలాగుర్తించారు?

జ: 1986లో వరదలు వచ్చినప్పుడు కాటన్ డ్యామ్ 23.6 అడుగులు వచ్చింది. 2013లో వరదలు వచ్చినప్పుడు 19.0 అడుగులు వచ్చింది. ధవళేశ్వరం బ్యారేజ్ కిందనున్న గన్నవరం ఆక్విడెట్‌పై నుంచి నీళ్ళు పారాయి. అంటే 1986లో 23 అడుగులు వచ్చినప్పుడు గన్నవరం ఆక్విడెట్‌పై నుంచి నీళ్ళు పారలేదు. 2013లో వచ్చిన 19.0 అడుగులకే నీళ్ళు పారాయి. అప్పుడు ప్రమాదాన్ని గుర్తించి మా పోరాటాన్ని ఇంకా ముందుకు తీసుకెళ్ళాం. ధవళేశ్వరం బ్యారేజీగాని, ఇప్పుడు కట్టబోయే పోలవరం ప్రాజెక్టుగానీ కుంగిపోయే అవకాశం లేదు. సముద్ర తీరప్రాంతానికి ఇవి చాలా ఎగువన ఉన్నాయి. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలు సగం సముద్రంలో మునిగిపోయే పరిస్థితి ఉంది. ఇది నగ్నసత్యం.

ప్ర : కొల్లేరు అంశం....?

జ: అసలు కొల్లేరు 10 కాంటూరులు. కాంటూరు అంటే సముద్ర మట్టానికి ఒక్కొక్క అడుగు ఎత్తు అన్నమాట. అసలు కొల్లేరులో ప్రజలు కొన్ని వందల సంవత్సరాల క్రితం ఒరిస్సా నుంచి వలస వచ్చి, కొల్లేరు గర్భంలో నివసిస్తున్నారు. అక్కడ దొరికే మత్స్య సంపదతో జీవనం సాగించేవారు. దేశంలోని 25 సరస్సులను పరిరక్షిస్తామని ఇరాన్ లోని రామ్‌సార్ సదస్సు తీర్మానించింది. దీన్ని తప్పని సరిగా కాపాడవలసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దాగుడుమూతలు ఆడుతున్నాయి. సహజ సిద్దంగా కొల్లేరును కాపాడవలసిందే.

సాయిరామరాజు,
మనం ప్రతినిధి, భీమవరం



ఆయిల్, గ్యాస్ కార్పొరేట్ దిగ్గజాలు (ట్రంప్ లాబీ) లాభాపేక్షతో 'వాతావరణ మార్పు' లేనేలేదని, అది కమ్యూనిస్టుల కుట్ర అని కోట్ల డాలర్లు ఖర్చుపెట్టి దుష్ప్రచారం చేస్తున్నాయి.

బయో ఏషియా-2018 సదస్సు



బయో ఏషియా ఇంటర్నేషనల్ వార్షిక సమావేశాన్ని ఫిబ్రవరి 22-24 తేదీలలో హైదరాబాద్‌లోని హెచ్‌ఐసీసీ (హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెషన్ సెంటర్)లో తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఈ ఏడాది జెనోమ్ వాలీ ఎక్స్‌లెన్సీ అవార్డును ఆ సమావేశంలో స్విట్జర్లాండ్, బసెల్‌లోని బయోజెట్రం యూనివర్సిటీ ప్రొఫెసర్ మైఖేల్ ఎన్. హాల్‌కు బహూకరిస్తున్నారు. న్యూట్రియంట్ ప్రేరేపిత టీఓఆర్ (రపామైసిన్ లక్ష్యం) ప్రోటీన్లు, జీవ కణ అభివృద్ధి క్రమంలో వాటి పాత్రగాను ఈ పురస్కారాన్ని ప్రదానం చేస్తున్నారు. ఆరోగ్య సంరక్షణ, ఫార్మా, జీవ వైజ్ఞానిక శాస్త్ర రంగాలలోని వాణిజ్య సంస్థలకు ఒక సమన్వయ వేదికగా పనిచేస్తుంది. 15వ బయో ఏషియా ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లో అమెరికా, యూరోపియన్ మందుల అభివృద్ధి కంపెనీలను, ఏషియన్ బయోటెక్, ఫార్మా కంపెనీలను ఒక వేదికపై చేరుతాయి. పరిశోధన రంగంలో పరస్పర సహకారం, లైసెన్స్ ఒప్పందాలు చేసుకునేందుకు ఈ కాన్ఫరెన్స్ ఉపకరిస్తుంది. 55 దేశాల నుంచి 1,500 మంది ప్రతినిధులు హాజరవుతున్నారు. 500 కార్పొరేట్ సంస్థలు, వంద మంది ఉన్నత స్థాయి ఉపన్యాసకులు ఇందులో పాల్గొంటున్నారు.

మహిడెస్క్

మథనం

ఫార్మా వ్యర్థాల్లో ప్రాణాంతక క్రిములు

ఫార్మా పరిశ్రమల కాలుష్యం పచ్చని పంట పొలాలను మసిచేస్తోంది. ఈ కాలుష్యం ప్రజల శారీరక, మానసిక వ్యాధులకు గురిచేయడమే కాకుండా, వారి ప్రాణాలతో చెలగాటమాడుతోంది. చెరువులు విషతుల్యం అవుతున్నాయి. మత్స్య, పశుసంపద దెబ్బతింటోంది. తాటివనాలు వాడిపోయి గీత కార్మికుల ఉపాధి పోతోంది. ఇదంతా రసాయనిక వ్యర్థాల రూపంలోని కాలుష్యం వల్ల సంభవించే బీభత్సం మాత్రమే. ప్రజా ఉద్యమాల నేపథ్యంలో ప్రభుత్వం పారిశ్రామిక వ్యర్థాలను శుద్ధిచేసే ప్లాంట్లను ఏర్పాటు చేసినా ఫలితం లేకపోయింది. 1970ల నుంచి పర్యావరణ కాలుష్యం వల్ల వ్యవసాయం, హైదరాబాద్ చుట్టపక్కల గ్రామీణ ప్రాంతాల ప్రజారోగ్యం మాత్రమే దెబ్బతినడం చూశాం. అయితే ఫార్మా కంపెనీల నుంచి వస్తున్న వ్యర్థజలాల్లో పెద్ద ఎత్తున యాంటీ బయోటిక్ రసాయనాలు కలుస్తున్నట్లు వెల్లడైంది. ఈ యాంటీ బయోటిక్ పదార్థాలు రోగకార క్రిములతో కలవడం వల్ల, ఆ క్రిములు మందులకు లొంగని శక్తిమంతమైన రోగ కారక బ్యాక్టీరియాగా ఉత్పరివర్తన (మ్యుటేషన్) చెందుతున్నాయి. దాంతో మానవులను పీడించే అనేక సూక్ష్మజీవులు మందులకు లొంగని సూపర్‌బగ్స్‌గా మారుతున్నట్లు ఆ అధ్యయనంలో బయటపడింది. పటాన్‌చెరు, కాజీపల్లి, పాషామైలారం పారిశ్రామిక ప్రాంతాలలోని కాలుష్య వ్యర్థ జలాలను స్వీడన్, జర్మనీకి చెందిన శాస్త్రవేత్తల అధ్యయనంలో సూపర్ బగ్స్ ఉన్నట్లు గుర్తించారు. ఈ సూపర్‌బగ్స్ కారణంగా భూమి మీద నుంచి మాయమై పోయాయనుకున్న అనేక ప్లేగు వంటి ప్రాణాంతక క్రిములు తిరిగి మందులకు లొంగని కొత్త క్రిముల రూపంలో మానవాళిపై విరుచుకుపడే ప్రమాదం పొంచి ఉంది.

గతంలో సరూర్‌నగర్, నాచారం, పటాన్‌చెరు ప్రాంతాలలో రసాయనిక, ఫార్మా కంపెనీల కాలుష్యంతో ప్రజారోగ్య విధ్వంసం, దానికి వ్యతిరేకంగా ప్రజలు ఏళ్ళ తరబడి చేసిన కాలుష్య వ్యతిరేక ఉద్యమాలు, కోర్టు తీర్పులు, ఆంక్షలు, ఆదేశాలు ఇన్ని జరిగినా రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణను ఫార్మా హబ్‌గా మార్చేందుకు సకల సన్నాహాలు చేస్తోంది. యాదాద్రి జిల్లాలో ఫార్మా పరిశ్రమలకు నిలయమైన చౌటుప్పల్, భూదాన్ పోచంపల్లి, బీబీనగర్, బొమ్మలరామారం, భువనగిరి మండలాల్లోని ఆయా ఫార్మా కంపెనీలు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ వాతావరణాన్ని కలుషితం చేస్తున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్ మహానగరాన్ని ఆనుకొని శ్రీశైలం హైవేలోని ముచ్చర్ల కేంద్రంగా భారీ ఫార్మా పారిశ్రామిక నగరాన్ని ఆవిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం శరవేగంతో ఏర్పాట్లు చేస్తున్నది. బయో ఏషియా 2018 సమావేశం అందుకు వేదిక కానుంది. ఈ నేపథ్యంలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని సంబరపడాలో, నయంకాని సూక్ష్మజీవుల కారణంగా మృత్యువాత పడుతామని భయపడాలో తెలియని రీతిలో నేటి ప్రభుత్వాల పారిశ్రామిక విధానాలు ఉంటున్నాయి. ఆధునిక ప్రభుత్వాలు, పారిశ్రామిక కేంద్రాలు పర్యావరణాన్ని ప్రత్యక్షంగా పరోక్షంగా ధ్వంసం చేస్తున్నాయి. పర్యావరణంలోని నిర్జీవ, జీవవ్యవస్థల, ప్ర క్రియల సమతుల్యతను దెబ్బతీస్తున్నాయి. దాంతో జీవుల మనుగడను ప్రశ్నార్థకంగా మార్చడం ద్వారా ప్రకృతి తిరిగి పగతీర్చుకుంటుంది. తాత్కాలిక ప్రయోజనాలను తాయిలాలుగా చూపించి దీర్ఘకాలికంగా మానవ మనుగడనే ప్రశ్నార్థకంగా మార్చే తీరులో పాలకుల విధానాలు ఉన్నాయి. నీళ్ళు, నిధులు, నియామకాలే కాదు స్వచ్ఛమైన గాలి, నీరు, నేల అందే కాలుష్యరహిత జీవన విధానం అందించే బాధ్యత కూడా తెలంగాణ పాలకుల మీద ఉంది. సరూర్‌నగర్, నాచారం, పటాన్ చెరువు పర్యావరణ ఉద్యమాలను దృష్టిలో పెట్టుకోకుండా సుప్రీంకోర్టు ఆదేశాలను పరిగణనలోకి తీసుకోకుండా ఏర్పాటు చేసే పారిశ్రామిక ప్రాంతాల కారణంగా భవిష్యత్‌లో భారీ మూల్యం చెల్లించక తప్పదు. కోటానుకోట్ల డాలర్ల కోసం ప్రజారోగ్యాన్ని, పర్యావరణాన్ని వెరసి మానవజాతి మనుగడను సంక్షోభంలోకి నెట్టివేసే ఫార్మా హబ్ ఏర్పాటు కోసం కాలుష్య నివారణ జాగ్రత్తలు నూటికి నూరుశాతం తీసుకుంటామని పాలకులు హామీ ఇచ్చినా గత అనుభవాలరీత్యా అలాంటివి అమలు కాలేదని తేలిపోయింది. స్థానిక ప్రజలు, పర్యావరణ వేత్తలు, నిపుణులు, ప్రజాస్వామికవాదులు, అఖిలపక్షాలు తదితర పౌర సంఘాలు, ప్రభుత్వ కాలుష్య నివారణ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో రూపొందిన అర్ధ రాజ్యాంగ సంస్థ ఆధ్వర్యంలో ప్రయోగాత్మకంగా కాలుష్య నియంత్రణ జరిపి, అది ఆచరణ సాధ్యమని తేల్చుకున్న అనంతరమే ప్రభుత్వం ఫార్మ హబ్ నిర్మాణాన్ని చేపట్టాలి. కాలుష్య వ్యర్థాలను శుద్ధి చేసేందుకు అయ్యే ఖర్చును మిగుల్చుకొని, ప్రజారోగ్యాన్ని, మానవ మనుగడను సంక్షోభంలోకి నెడుతున్న కార్పొరేట్ టెర్రరిజంకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలి.

శ్వేత ఎలుగుకు 'కార్బన్' విషం!

శ్వేత ఎలుగులను ఐస్ ఎలుగులని కూడా వ్యవహరిస్తారు. వీటి చర్మం పారదర్శకంగా ఉండడంతో వాటి వెంట్రుకలపై పడిన కాంతి పరావర్తనం చెందడం వల్ల సాధారణంగా అవి తెలుపురంగులో కనిపిస్తాయి. అందుకే వీటిని శ్వేత ఎలుగు (తెల్ల ఎలుగు -పోలార్ బేర్) అని పిలుస్తారు. దాదాపు 70,000- 1,50,000 సంవత్సరాల క్రితం ఇవి బూడిదరంగులో కూడా దర్శనమిచ్చేవని భావిస్తున్నారు. ఇవి ఎక్కువకాలం మంచుపైనే గడుపుతాయి. జుట్టుతో కూడివున్న ముక్కు, చిన్నచిన్న చెవులు కలిగివుంటాయి. మంచుమీద, మంచుముక్కలమీద తేలిగ్గా ఈదగలవు. వీటికున్న జుట్టుతో కూడిన పెద్దపెద్ద పంజాలతో సులభంగా మంచును తవ్వగలవు. పెద్ద ఎలుగలైతే 1,400 ఎల్‌బిఎస్ బరువు కలిగివుంటాయి. ముక్కునుంచి తోక వరకు 9 అడుగుల పొడవుంటుంది. వాతావరణ మార్పులపై సరైన చర్యలు తీసుకోకపోతే 2100 నాటికి శ్వేత ఎలుగుల మనుగడ ప్రశ్నార్థకమే.



సముద్రప్రాంతంలోని మంచుపైసంచరించే ఈ ఎలుగులకు ప్రాణాపాయం వేటతో పాటు వాతావరణంలో కార్బన్ డై ఆక్సైడ్ ఎక్కువ కావడంతో సముద్రప్రాంతాల్లోని మంచు కరిగిపోతోంది. మంచు ప్రాంతంలో తప్ప మరోచోట ఇవి జీవించలేవు. దీనికి తోడు 1973లో కెనడా, డెన్మార్క్ (గ్రీన్‌లాండ్), నార్వే, అమెరికా, రష్యాలు ఒక మైలు రాయి వంటి ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. పోలార్ బేర్ పరిరక్షణకు విధానాలను నియంత్రించాలని ఈ ఒప్పందంలోని ప్రధాన అంశం. పోలార్ బేర్ నివశించే ఈ ఐదుదేశాలు ఒప్పందానికి రావడం ఇదే మొదటిసారి. అత్యంత శక్తిమంతమైన బహుళ పాక్షిక పర్యావరణ ఒప్పందంగా ఇది నిలిచిపోయింది. సముద్ర ప్రాంతాల్లోని మంచుప్రాంతాలను పోలార్ బేర్ నివాసయోగ్యంగా రక్షించాలని, ఆ ప్రాంతాన్ని వ్యవసాయప్రాంతంగా మార్చకుండాచర్యలు తీసుకోవడం ద్వారా పోలార్ బేర్ మనుగడకు వాటిల్లుతున్న ప్రమాదాలను నివారించాలని ఒప్పందంలో ఉంది. అంతర్జాతీయ ప్రకృతి పరిరక్షణ యూనియన్ (ఐయూసీఎన్) అంచనా ప్రకారం దాదాపు 26వేల పోలార్ బేర్లు ఉన్నాయి. ఇందులో 60 శాతం శ్వేత ఎలుగులు కెనడాలో ఉన్నాయి. అలాగే ఆమెరికాలోని అలస్కా, రష్యా, గ్రీన్‌లాండ్, నార్వేల్లో కూడా ఈ ఎలుగులున్నాయి. అలస్కా ఉత్తరప్రాంతంలో, పశ్చిమ కెనాడా ప్రాంతంలో ఈ జాతి సంఖ్య 2001-10 సవంత్సరాల మధ్య అధ్యయనంలో 40 శాతం తగ్గిపోయిందని తేలింది. అంటే వీటిసంఖ్య 1500 నుంచి 900కు తరిగిపోయింది. మంచుప్రదేశం తగ్గిపోవడంతో పాటు ఈ ప్రాంతంలో వ్యవసాయసాగు పెరగడం కూడా పోలార్‌బేర్ మనుగడకు అడ్డుగా నిలుస్తోందని చెబుతున్నారు. పెరుగుతున్న భూతాపంతో వాతావరణ మార్పు కారణంగా నశించిపోతున్న ఈ జాతి పరిరక్షణపై అంతర్జాతీయ సమాజం చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం ఫిబ్రవరి 27ను 'అంతర్జాతీయ పోలార్ డే'గా జరుపుతున్నారు. కాలుష్యాన్ని, భూతాపాన్ని పెంచుతూ అత్యాశ పునదిగా, పర్యావరణ ప్రమాదకంగా పారిశ్రామిక విధానంలో మౌలిక మార్పు రానిదే ధ్రువాల్లోని మంచు కరగడాన్ని నిరోధించ లేము. అప్పటిదాక శ్వేత ఎలుగుల మనుగడ ప్రశ్నార్థకంగానే కొనసాగక తప్పదు!

(ఫిబ్రవరి 27 పోలార్ బేర్ డే)

మహి పేజీకి వ్యాసాలు పీడీఎఫ్, ఓపెన్ ఫైల్ ఫార్మాట్‌లలో పంపవలసిందిగా సూచన.
e-mail: manammahimahi@gmail.com

పర్యావరణ పరిరక్షణకూ
మాతృభాషలే మార్గం!


మితిమీరిన సంపద కేంద్రీకరణ, మితిమీరిన జనాభా కేంద్రీకరణ మితి మీరిన పర్యావరణ విధ్వంసానికి దారితీస్తాయి. దాంతో స్థానిక జీవ వైవిధ్యపు జ్ఞానాన్ని తవ్వితీస్తున్న, నిక్షిప్తం చేస్తున్న స్థానిక/మాతృభాషలు అంతరించిపోతున్నాయి. ప్రపంచ మార్కెట్ అవసరాల నేపథ్యంలో స్థానిక పర్యావరణ విధ్వంసంతో స్థానిక/మాతృభాషలు అంతరించిపోవడానికి, భాషలు అంతరించిపోవడం తిరిగి పర్యావరణ పరిరక్షణ కొనసాగకపోవడానికి దారితీస్తోంది.

భాష, పర్యావరణం అనేవి రెండు విభిన్న అంశాలుగా పైకి కనిపించినప్పటికీ, వాస్తవంలో అవి రెండు పరస్పర ఆధారితాలుగా ఉంటాయి. సంప్రదాయక జనావాసాల సాంస్కృతిక, భాషా వైవిధ్యం అంతరిస్తే పరిసరాల సహజ వాతావరణం క్షీణిస్తుందని అనేక అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. భాష అంతరిస్తే జీవవైవిధ్య పరిరక్షణ ప్రమాదంలో పడుతుందని ఐక్యరాజ్య సమితి 'విద్య వైజ్ఞానిక, సాంస్కృతిక సంస్థ' (యునిసెఫ్) అధ్యయనం స్పష్టంచేసింది. పర్యావరణంతో ముడిపడి భాషకు సంప్రదాయక విజ్ఞానానికి (టీకే) మధ్య ఒక ప్రాథమిక లింకు ఉంటుంది. ప్రాకృతిక ప్రపంచంతో స్థానిక, ప్రాంతీయ మానవ సమూహాలకు తమ చుట్టూ ఆవరించిన స్థానిక వాతావరణాన్ని ప్రతిఫలించే క్రమంలో విస్తృతమైన వర్గీకరణతో కూడిన అవగాహన ఉంటుంది. స్థానిక ప్రాకృతిక విజ్ఞానం స్థానిక పేర్లలోను, మౌఖికంగాను, ప్రత్యేకమైన వర్గీకరణల్లోనూ నిక్షిప్తమై ఉంటుంది. ఒకానొక ప్రాంతంలోని మానవ సమూహం తమ మాతృ భాషను వదిలి, వేరొక భాషను చేపట్టినట్లయితే, శతాబ్దాల తరబడి, తరాల తరబడి సాధించిన స్థానిక విజ్ఞానమంతా ఆ భాషతో పాటు అంతరించిపోతుంది. స్థానిక విజ్ఞాన భాండాగారంగా మాతృభాషలు పనిచేస్తాయన్న సత్యాన్ని గ్రహించకపోతే మానవజాతి విశ్వ విజ్ఞాన సంచయనానికి గండి పడి నష్టవుతుంది.

పెరూలోని ఎగువ అమెజాన్ ప్రాంతంలో నివసిస్తున్న అమ్యూషా తెగ మాట్లాడే భాష అంతరించిపోగానే బహుళ పంటలు ఏకకాలంలో పండిస్తున్న వారి స్థానిక విజ్ఞానమంతా అంతరించిపోయి, దేశవాళి వ్యవసాయం పూర్తిగా దెబ్బతిన్నట్లు శాస్త్రవేత్తలు కనుగొన్నారు. మొక్కల పెరుగుదల, వివిధ రకాల నేలలు, భూసార పోషకాలు, విభిన్న పర్యావరణ అంతరాలు, పర్యావరణ సమూహాలు, ప్రకృతి దృశ్యాలు వగైరాల గురించి మవోరి తెగ పెద్దల మౌఖిక సంప్రదాయాల్లో నిక్షిప్తమైన విజ్ఞానశాస్త్రానికి తెలియని కొత్త సమాచారాన్ని కొందరు శాస్త్రవేత్తలు సేకరించి ప్రపంచాన్ని ఆశ్చర్యంలో ముంచెత్తారు. జీవవైవిధ్యాన్ని, పర్యావరణ పరిరక్షణకు స్థానిక/ప్రాంతీయ భాషలు (మాతృభాషలు) అద్భుతమైన సాధనాలుగా ఉపకరిస్తాయని యునెస్కో కార్యచ రణ పత్రం వివరణాత్మంగా చెప్పింది. ఇండో పసిఫిక్ ఉష్ణమండల సముద్రాల్లో జీవించే 'దుగాంగ్' (సముద్రపు చిన్నది) ఒక అంతరిస్తున్న భారీ శాకాహార సముద్ర క్షీరదం. దుగాంగ్ మాంసం, నూనెల్లో కీళ్ళవాతం, నడుంనొప్పి తదితర దేహబాధల నివారణ, కామోద్దీపన కలిగించే ఔషధ లక్షణాలున్నట్లు స్థానిక వైద్య విధానాలు పరిగణిస్తున్నందున దుగాంగ్‌ల వేట శతాబ్దాలుగా కొనసాగింది. దాంతో ప్రకృతి పరిరక్షణ అంతర్జాతీయ సమితి (ఐయూసీఎన్) రూపొందించిన 'రెడ్‌లిస్ట్'లో అంటే అంతరించిపోతున్న ప్రాణుల జాబితాలో దుగాంగ్‌లు కూడా చేరాయి. మనదేశంలో గుజరాత్, తమిళనాడుకు చెందిన మన్నార్ గల్ఫ్, అండమాన్ నికోబార్ ద్వీపాల సమీపంలోని సముద్రగర్భంలో దుగాంగ్‌ల పరిరక్షణ కోసం స్థానికులను చైతన్యపరచే కార్యక్రమాలు ప్రభుత్వం చేపట్టింది. దుగాంగ్ అనడానికి బదులుగా వాటిని ఇంగ్లీష్ భాషలో పిలిచే 'సీకా' అన్న పదానికి తమిళంలో 'కడల్ పశు' అని అనువదించి ప్రజల్లో ప్రచారం చేశారు. అయితే ఆ ప్రచారాన్ని 'పశువులు సముద్రంలోకి వెళ్ళి చనిపోవడం' అని స్థానికులు అర్థం చేసుకోవడంతో దుగాంగ్‌ల పరిరక్షణ కార్యక్రమం కుంటుపడింది. ప్రజలకు అర్థంకాని స్థానికేతర పదాలను వినియోగించడం వల్ల ప్రజలు దుగాంగ్‌లను యథేచ్ఛగా చంపివేశారు. స్థానిక భాషను నిర్లక్ష్యం చేయడంతో ఒక అరుదైన జలచరం అంతరించడాన్ని నిరోధించలేకపోవడం విచారకరం. జీవ వైవిధ్య పరిరక్షణకు స్థానిక ప్రజల సహకారం ప్రాథమిక షరతుగా గుర్తించాలి. స్థానిక భాషావ్యవహర్తలు, పరిణామ శాస్త్రవేత్తలు, భాషావేత్తలు పరస్పర సహకారంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని యునెస్కో పత్రం తేల్చిచెప్పింది. స్థానిక ప్రజలు తమ మాతృభాషలో నిక్షిప్తమై ఉన్న విశిష్ట సంప్రదాయ జ్ఞానాన్ని అందిస్తే, శాస్త్రవేత్తలు ఆధునిక పర్యావరణ విజ్ఞానాన్ని సంప్రదాయక విజ్ఞానంతో సంశ్లేషిస్తారు. తరతరాలుగా మానవ కార్యకలాపంలో నుంచి ఉద్భవించిన సంప్రదాయ విజ్ఞానాన్ని (టీకే), దాన్ని నిక్షిప్తం చేసిన స్థానిక (మాతృ) భాషలను సంరక్షించుకొని విశ్వ విజ్ఞానాన్ని మరింత పరిపుష్టం చేయడమే కాదు పర్యావరణ పరిరక్షణకు దోహదపడడం ద్వారా మానవడ మనుగడ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు కీలక సాధనంగా ఉపకరిస్తుంది. సంప్రదాయక విజ్ఞానం, దాన్ని నిక్షిప్తం చేసుకున్న స్థానిక (మాతృ) భాషలు జీవవైవిధ్య పరిరక్షణకు, సుస్థిర నిర్వహణకు నమ్మదగిన సాధనంగా నిలుస్తుందని యునెస్కో పత్రం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో భాష అనేది కేవలం పదజాలం కాదు. భాష అనేది వైవిధ్యభరిత మానవ అనుభూతి, ఆచరణాత్మక జ్ఞాన సంచయన భాండాగారం. అది స్థానిక విజ్ఞానం, పర్యావరణంతో మమేమకమైన నాగరికతా సంపద.

పర్యావరణం, సామాజిక శ్రమల ప్రేరణతోనే భాష, చైతన్యాలు అభివృద్ధి చెందాయి. భిన్నప్రాంతాల పర్యావరణాల వైవిధ్యతలను బట్టి భిన్నభాషలు అవతరించాయి. ప్రపంచంలోని 6,900 భాషల్లో ఎక్కడైతే జీవ వైవిధ్యం ఎక్కువగా ఉంటుందో, మహా జీవవైవిధ్య ప్రాంతాల్లోనే ఎక్కువ జీవజాతులు, ఎక్కువ భాషలు ఉనికిలో ఉన్నాయి. ప్రపంచభాషల్లో 60 శాతం జీవవైవిధ్యం మెండుగా ఉన్న దక్షిణార్ధ గోళ ఉష్ణమండల ప్రాంతాలలోనే ఎక్కువగా ఉన్నాయి. ప్రపంచభాషల్లో 25 శాతం పపువాన్యూగినియా, ఇండోనేషియా దేశాల్లోనే ఉన్నాయి. అతి చిన్నమహా జీవ వైవిధ్య నిలయమైన న్యూగినియాలో 976 భాషలున్నాయంటే ఆశ్చర్యమే. ఇంతవరకు నమోదైన చరిత్రలో మునుపెన్నడూ లేనివిధంగా భూగోళంపై జీవజాలం వెయ్యిరెట్లు అధికంగా అంతరించిపోతుంటే, అదే సమయంలో 1970ల మధ్య నుంచి 60 శాతం ప్రపంచ భాషలు అంతర్ధానమయ్యాయంటే ఆశ్చర్యమే. 2099లో 90 శాతం భాషలు అంతరించిపోగలవని అధ్యయనాలు చెబుతున్నాయి. ఐక్యరాజ్య సమితి రూపొందించిన అంతరించిపోతున్న భాషల జాబితాలో తెలుగు కూడా ఉందని ప్రకటించి చాలారోజులైనా, మన తెలుగు సోదరులకు చీమకుట్టినట్లైనా ఉండక పోవడం సిగ్గుచేటు. అదేవిధంగా మహా జీవ వైవిధ్య ప్రాంతాలున్న భారతదేశంలోనూ 380 భాషలు వాడుకలోకి వచ్చాయి.

చరిత్రలో వివిధ సామాజిక వ్యవస్థల అభివృద్ధి స్థాయిని బట్టి, ఆయా సమాజాల భాషా సంపద అభివృద్ధి చెందుతుంది. భాషల మధ్య గొప్పదనాలలో తేడాల్లేవు. ప్రతి భాషదాన్ని మాట్లాడే జాతికి అంతరాత్మ అవుతుంది. ప్రతిభాష తాను పరిస్థితుల రీత్యా ప్రామాణికమైనదిగాను, ప్రపంచభాషా సంపదలో తనదైన ముద్రతోను ఉంటుంది. సమాజ భౌతిక జీవితానికి అనుమేయంగా భాషా సంపద అభివృద్ధి చెందుతుంది. ప్రపంచీకరణ కైపులో, కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలకు పరిమితమైన అభివృద్ధి వ్యూహంతో సాగే దక్షిణార్థగోళ వ్యవసాయ దేశాల ప్రభుత్వాలు, పాలకవర్గాలు పర్యావరణాన్ని ధ్వంసం చేయడమే కాకుండా మాతృభాషల అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తున్నాయి. దాంతో విశ్వమానవ జ్ఞానభాండాగారం



లో స్థానిక విజ్ఞానం అంతర్భాగమయ్యే పరిస్థితికి గండి పడుతోంది. జ్ఞానం ఎప్పుడూ స్థానికం నుంచి ప్రారంభమై విశ్వజనీనమైతుంది. ప్రపంచ పెట్టుబడి దారీ విధానం అడుగుపెట్టిన చోటల్లా స్థానిక జీవ వైవిధ్యం, స్థానిక సాంస్కృతిక వారసత్వం, స్థానిక ప్రజల జీవన ప్రమాణాలను ధ్వంసం చేసింది. మితిమీరిన పారిశ్రామికీకరణ, మితిమీరిన సంపద కేంద్రీకరణ, మితిమీరిన జనాభా కేంద్రీ కరణ మితిమీరిన పర్యావరణ విధ్వంసానికి దారితీస్తాయి. దాంతో స్థానిక జీవ వైవిధ్యపు జ్ఞానాన్ని తవ్వితీస్తున్న, నిక్షిప్తం చేస్తున్న స్థానిక/మాతృభాషలు అంతరించిపోతున్నాయి. ప్రపంచ మార్కెట్ అవసరాల నేపథ్యంలో స్థానిక పర్యావరణ విధ్వంసంతో స్థానిక/మాతృభాషలు అంతరించిపోవడానికి, భాషలు అంతరించిపోవడం తిరిగి పర్యావరణ పరిరక్షణ కొనసాగకపోవడానికి దారితీస్తోంది. ఈ నేపథ్యంలో మాతృభాషా పరిరక్షణ ఉద్యమం, పర్యావరణ పరిరక్షణ ఉద్యమాలు రెండూ పరస్పర పూరకాలుగా సాగాలి.

వెన్నెలకంటి రామారావు
(ఫిబ్రవరి 21 మాతృభాష దినోత్సవం సందర్భంగా)

మహాకూటమి.. తూచ్!

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తమవుతోంది. ఇప్పటికే వివిధ పక్షాలతో కలిసి బీఎల్ఎఫ్‌ను ఏర్పాటు చేసిన సీపీఎం.. ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్‌తో జతకట్టబోమని ప్రకటిం చడం అనిశ్చితికి కారణంగా నిలుస్తోంది. కాంగ్రెస్, టీఆర్ఎస్ దొందూ దొందే అని, ఆయా పార్టీలతో తాము పొత్తు పెట్టుకోమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రకటించటం పట్ల రాష్ట్రంలో సర్వత్రా చర్చానీయాంశంగా మారింది. రాష్ట్రంలో ఎదురేలేకుండా ఉన్న టీఆర్ఎస్‌ను ఎదుర్కొనేందుకు అందరం ఏకం కావాలని అడపాదడపా ప్రతిపక్ష పార్టీల నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ మేరకు కాంగ్రెస్ కూడా అంతర్గతంగా చర్చలు ప్రారంభించినట్లుగా వార్తలు కూడా వచ్చాయి. కానీ.. తమ్మినేని ప్రకటన 'మహాకూటమి' ఏర్పాటుకు అశనిపాతంగా మారిందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. తద్వారా ప్రతిపక్షాల ఐక్యతకు గండి పడినట్లేనని రాజకీ య విశ్లేషకులు పేర్కొంటున్నారు. మరోవైపు, మరోసారి అధికారం లోకి వచ్చేందుకు టీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ఇప్పటి నుంచే పావులు కదుపుతున్నారు. 'ఆకర్ష్' పథకం ద్వారా ఇప్పటికే పలు పార్టీలకు చెందిన ముఖ్య నేతలను టీఆర్ఎస్‌లోకి చేర్చుకున్నారు. మరికొందరు పార్టీలో చేరే అవకాశం ఉందని ఆ పార్టీ నాయకులు ప్రకటిస్తున్నారు. టీఆర్ఎస్ అంతమే తమ పంతమని పేర్కొంటూ రాజకీయాలు చేస్తున్న ప్రతిపక్ష పార్టీలకు సీపీఎం ప్రకటన కొంత ఇబ్బందికరంగా మారే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. మరోవైపు, సీపీఐ నేతలతోనూ, టీజేఏసీ చైర్మన్ కోదండరామ్, బీసీ సంక్షేమ సంఘం నేత ఆర్ కృష్ణయ్యలతో చాపకింద నీరులా కాంగ్రెస్ నేతలు చర్చలు జరుపుతున్నారనే ప్రచారం వుంది. టీఆర్ఎస్‌ను ఓడించేందుకు సీపీఎం కలిసి రావాలని కాంగ్రెస్ పేర్కొంటుంది. ఇందులో భాగంగానే కాంగ్రెస్ పార్టీ నేతలు ఐక్య కూటమి దిశగా ప్రకటనలిస్తున్నారనే ప్రచారం ఉంది. సీపీఐ, కోదండరామ్‌తో కలిసి తాము ఒక కూటమిని ఏర్పాటు చేస్తామని గతంలో సీపీఐ నేతలు పేర్కొన్న దాఖలాలున్నాయి. ఓ వైపు ముందస్తు ఎన్నికలు వచ్చే అవకాశం ఉందనే ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలోనే టీఆర్ఎస్, కాంగ్రెస్‌తో పాటు అన్ని పార్టీలు అధికారమే లక్ష్యంగా రాజకీయ సమీకరణాలపై దృష్టి కేంద్రీకరించాయి. సీపీఎం ప్రకటన టీఆర్ఎస్‌కే లాభదాయకంగా మారే అవకాశం ఉందని పలువురు రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఓవైపు తామంటే తామే అధికారంలోకి వస్తామని టీఆర్ఎస్, కాంగ్రెస్ ముఖ్యనేతలు సవాళ్లు విసురుకుంటున్నారు. ఈ సమయంలో సీపీఎం ప్రకటన రాజకీయంగా ప్రాధాన్యతను సంతరించుకుంది.



అగర్తలాలో ఓ పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు

త్రిపురలో 76% ఓటింగ్

59 నియోజకవర్గాల్లో ప్రశాంతంగా పోలింగ్

అగర్తల, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18:

త్రిపుర అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఆదివారం జరిగిన ఓటింగ్‌లో సాయంత్రం నాలుగు గంటల వరకు 76 శాతం మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. అప్పటికి ఓటర్లు బారులు తీరి ఉండడంతో ఓటింగ్ శాతం పెరుగుతుందని పేర్కొంది.

మొత్తం 60 స్థానాలకు గాను 59 స్థానాల్లో ఎన్నికలు జరిగాయి. సీపీఐ(ఎం) అభ్యర్థి రామేంద్ర నారాయణ్ మృతితో చారిలాం నియోజకవర్గంలో ఎన్నికలను వాయిదా వేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ స్థానానికి వచ్చే నెల 12న ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

మార్చి 3న ఓట్ల లెక్కింపు జరుగుతుంది. ఈ ఎన్నికల్లో 297 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఆదివారం ఉదయం నుంచే ఓటర్లు బారులు తీరారని, సాయంత్రం నాలుగు తర్వాత కూడా క్యూలో ఉన్న వారిని ఓటింగ్‌కు అనుమతించనున్నట్లు డిప్యూటి ఎలక్షన్ కమిషనర్ సుదీప్ జైన్ వెల్లడించారు. రాష్ట్రంలో అక్కడక్కడా ఈవిఎంలు మొరాయించా యి. అధికారులు వెంటనే స్పందించి ప్రత్యామ్నాయం ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ రాంనగర్ నియోజకవర్గంలో తన ఓటు హక్కును వినియోగించుకోగా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బిప్లాబ్ ఆర్‌కే పూర్‌లో ఓటు వేశారు. కాంగ్రెస్ పార్టీ త్రిపుర అధ్యక్షుడు బిరజిత్ సిన్హా కైలాషహర్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. త్రిపురలో ప్రధాన పోటీ బీజేపీ, సీపీఎంల మధ్యేఉంటుందని, కాంగ్రెస్ నామమాత్ర పోటీనిస్తోందని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేశారు. కాగా, ఈ ఎన్నికల ఫలితాలు తమకే అనుకూలంగా ఉంటాయని బీజేపీ శ్రేణులు పేర్కొన్నారు.

రైతు సదస్సులు





(మొదటి పేజీ తరువాయి)

చర్యలను రైతులకు అందేలా రైతు సమన్వయ సమితిలు నిర్వహించా ల్సిన పాత్రకు సంబంధించిన ఈ సదస్సుల్లో సభ్యులకు వివరించనున్నట్లు వెల్లడించారు. 25న హైదరాబాద్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో, 26న కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో ప్రాంతీయ సదస్సులు నిర్వహిస్తా మని వెల్లడించారు. ఈసారి వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ ప్రవేశపెట్టాలని నిర్ణయించినందున దీనికి సంబంధించిన ముసాయిదా తయారు చేయాలని అధికారులను ఆదేశించా రు. పంట పెట్టుబడి మద్దతు పథకానికి సంబంధించిన ఆర్థిక సాయాన్ని చెక్కు రూపంలో రెండు విడతలుగా అందించనున్నట్లు వెల్లడించారు. వ్యవసాయంలో యాంత్రీ కరణను ప్రోత్సహించేందుకు సబ్సిడీపై నాట్లేసే యంత్రాలు అందివ్వాలని యోచి స్తున్నట్లు సీఎం తెలిపారు. అన్ని జిల్లాలకు ప్రాతినిధ్యం కల్పిస్తూ, వ్యవసాయ రంగాభివృద్ధికోసం కృషి చేస్తున్న నిపుణులు, శాస్త్రవేత్తలతో కూడిన రాష్ట్ర స్థాయి రైతు సమన్వయ సమితిని త్వరలోనే నియమిస్తామని సీఎం ప్రకటించారు. ఆదివారం ప్రగతి భవన్‌లో వ్యవసాయ శాఖపై సీఎం కేసీఆర్ సమీక్ష నిర్వహించారు. ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషి, ఎంపీలు గుత్తా సుఖేందర్ రెడ్డి, బాల్క సుమన్, ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, మిషన్ భగీరథ వైస్ చైర్మన్ వేముల ప్రశాంత్ రెడ్డి, కార్పొరేషన్ల చైర్మన్లు గ్యాదరి బాలమల్లు, శేరి సుభాష్ రెడ్డి, ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు ఎస్.నర్సిం గ్ రావు, రామకృష్ణారావు, పార్థసారథి, వ్యవసాయ శాఖ కమిషనర్ జగన్మో హన్‌రావు, వ్యవసాయ యూనివర్సిటీ వీసీ ప్రవీణ్ రావు, ఆర్థిక సలహాదారు జీఆర్ రెడ్డి, సీఎంవో కార్యదర్శులు స్మితా సభర్వాల్, రాజశేఖర్ రెడ్డి, భూపాల్ రెడ్డి తదితరులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఈ నెల 25న హైదరాబాద్ వ్యవసాయ వర్సిటీలో నిర్వహించే ప్రాంతీయ సదస్సుకు జనగామ, మెదక్, సంగారెడ్డి, మహబూబ్ నగర్, వనపర్తి, నాగర్ కర్నూ ల్, జోగులాంబ గద్వాల, నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, వికారా బాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలకు చెంది న మండల రైతు సమన్వయ సమితి సభ్యు లను ఆహ్వానించాలని ఆదేశించారు. ఈ నెల 26న కరీంనగర్ లో జరిగే ప్రాంతీయ సదస్సుకు ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, కొమురంభీమ్ ఆసిఫాబాద్, కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సిద్దిపేట జిల్లాలకు చెందిన సభ్యులను ఆహ్వానించాలని చెప్పారు. ఉదయం 10.30 నుంచి సాయం త్రం 5 గంటల వరకు జరిగే సద్సులో ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రుల సందేశాలతో పాటు రైతులతో ముఖ్య మంత్రి నేరుగా సంభాషించే కార్యక్రమా లుంటాయి. రైతు సంక్షేమం కోసం, వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వ చేపట్టిన అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని, ఈ కార్యక్రమాల్లో రైతు సమన్వయ సమితిల సభ్యులు ఎలాంటి పాత్ర పోషించాలనే విషయంపై ఈ సదస్సుల్లో కూలంకశంగా చర్చించనున్నట్లు సీఎం చెప్పారు. వ్యవసాయ, ఉద్యానవన, మార్కె టింగ్ శాఖల అధికారులు కూడా ఈ సదస్సుల్లో పాల్గొంటారని వెల్లడించారు. సదస్సులకు హాజరయ్యే మండల రైతు సమన్వయ సమితుల సభ్యుల ప్రయాణ, భోజన సదుపాయాలన్నీ వ్యవసాయశాఖ సమకూర్చాలని సీఎం చెప్పారు. రైతులను సంఘటితం చేయడం, రైతు వేదికల నిర్మాణం-నిర్వహణ, రైతులకు నిరంతర శిక్షణ, పంట పెట్టుబడి మద్దతు పథకం, పంటలకు కనీస మద్దతు ధర అందేలా చూడడం, మార్కెట్లకు ఉత్పత్తులు తీసుకువచ్చే విషయంలో నియంత్రణ పాటించడం, మేలైన సాగు పద్ధతులు, శాస్త్రీయ వ్యవసాయ విధానం, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, కోల్డ్ స్టోరేజి చైన్, క్రాప్ కాలనీలు తదితర అంశాల్లో రైతు సమన్వయ సమితిలు నిర్వహించాల్సిన పాత్రపై కరదీపిక అందించడంతో పాటు, సదస్సుల్లో ఈ అంశాలపై విస్త తంగా చర్చించాలని సీఎం చెప్పారు.

త్వరలో రాష్ట్ర సమన్వయ సమితి..

42 మంది సభ్యులతో త్వరలోనే రాష్ట్ర రైతు సమన్వయ సమితిని ఏర్పాటు చేయనున్నట్లు ఈ సందర్భంగా సీఎం వెల్లడించారు. 30 జిల్లాలకు చెందిన ప్రతినిధులతో పాటు వ్యవసాయ శాఖాధి కారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ రంగ నిపుణులను కూడా కమిటీలో సభ్యులుగా నియమిం చనున్నట్లు వెల్లడించారు.వ్యవసాయ రంగాభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తున్న వారిని సభ్యులుగా నియమించాలని, దీనికోసం పేర్లు సూచించాలని అధికారులను సీఎం కోరారు. పంటకు పెట్టుబడి మద్దతు పథకం ద్వారా అందించే ఆర్థిక సహాయాన్ని చెక్కుల రూపంలో అందించనున్నట్లు కేసీఆర్ చెప్పారు. వర్షాకాలం పంట వేసుకోవడానికి ఎకరానికి 4వేల చొప్పున అందించే కార్యక్రమాన్ని ఏప్రిల్ 20న ప్రారంభించాలని చెప్పారు. యాసంగి పంట కోసం ఇచ్చే పెట్టుబడి పంపిణీ కార్యక్రమాన్ని నవంబర్ 18 నుంచి నిర్వహించాలని చెప్పారు. దీనికి సంబంధించిన నిధులను బడ్జెట్ లోనే కేటాయించనున్నట్లు ప్రకటించారు.

కూలీల సమస్యకు విరుగుడుగా యాంత్రీకరణ..

ప్రస్తుతం వ్యవసాయదారులు కూలీల కొరతను ఎదుర్కొంటున్నారని, భవిష్యత్తులో ఈ సమస్య మరింత ఎక్కువవుతుందని సీఎం కేసీఆర్ అభిప్రాయపడ్డారు. ఈ పరిస్థితిని ద ష్టిలో ఉంచుకుని వ్యవసాయంలో యాంత్రీకరణను ప్రోత్సహించనున్నట్లు చెప్పారు. వరినాట్లు వేసే యంత్రాలను సబ్సిడీపై అందించాలని సీఎం నిర్ణయించారు.దీనికి సంబంధించిన కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. దేశంలో మరే రాష్ట్రంలో అమలు చేయనన్ని కార్యక్రమాలు వ్యవసాయ రంగంలో తెలంగాణ రాష్ట్రం అవలంభిస్తున్నదని చెప్పారు. ఈ ఏడాది నుంచి మరిన్ని కార్యక్రమాలు కూడా రూపొందిస్తున్నందున ఎక్కడా నిధుల సమస్య రాకుండా ఉండేందుకు వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ ప్రవేశ పెట్టాలని నిర్ణయించినట్లు వివరించారు. వ్యవసాయ బడ్జెట్ ప్రవేశ పెట్టడానికి అనుగుణంగా ముసాయిదా తయారు చేయాలని చెప్పారు.

వ్యవ'సాయం' కావాలి

(మొదటి పేజీ తరువాయి)





ప్రభుత్వాలు పంటకు గిట్టుబాటు ధరను కల్పించడంలేదు. దీంతో రైతుల పరిస్థితి దారుణంగా తయారయ్యింది. భూమిని చదును చేసింది మొదలు మార్కెట్‌లో హమాలీ ఖర్చు వరకు రైతులు నిలువు దోపిడికి గురవుతున్నారు. ఇటీవల రాష్ట్ర వ్యవసాయ శాఖ పంటల సాగు వ్యయం వివరాలను సేకరించి కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని వ్యవసాయ వ్యయ, ధరల కమిషన్‌కు సమర్పించింది. ఈ నేపథ్యంలో వ్యవసాయ సాగు పరిస్థితిపై 'మనం' ప్రత్యేక కథనం.

రాష్ట్రంలోని రైతులు పత్తి, వరి, సోయాబీన్, కంది, పెసర, మొక్కజొన్న, జొన్న, ఆముదం తదితర పంటలను ఎక్కువగా సాగు చేస్తున్నారు. వీటిలో పత్తి, వరి, సోయాబీన్, మొక్కజొన్న సాగు విస్తీర్ణం ఎక్కువ. సాధారణ రకం వరి సాగుకు ఈ ఏడాది ఎకరాకు రూ.32,103 ఖర్చు అవుతోంది. గత ఏడాది ఈ ఖర్చు రూ.28,066గా ఉంది. వచ్చే రాబడితో పోల్చుకుంటే ఒక్కోసారి చాలా లోటు ఉంటోంది. ఈ లోటుకు అనేక కారణాలు ఉన్నాయి. భూమి దున్నకం ఖర్చులు, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, మద్దతు ధర అనే అంశాలు ఇందులో ముడిపడి ఉన్నాయి. దీనికి తోడు ఏటికేడు దిగుబడి తగ్గుతూ వస్తోంది. వరి, పత్తి, సోయాబీన్ పంటల దిగుబడులు సగానికి పైగా పడిపోయాయి.

పెరిగిన సాగు ఖర్చు

వ్యవసాయ ఖర్చులు ఇటీవల ఇబ్బడి ముబ్బడిగా పెరిగాయి. విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల ధరలు, కూలీ రేట్లు, ట్రాక్టర్, వరికోత యంత్రాల అద్దెలు విపరీతంగా పెరిగాయి. గతంలో పత్తి సేకరించడం, కలుపు తీయడం వంటి పనులకు కూలీ ధర రూ.200 ఉండేది. ఈ ఏడాది అది రూ.250కు పెరిగే అవకాశం ఉందని పలువురు రైతులు అంటున్నారు. ఈ సంవత్సరం కాంప్లెక్స్ ఎరువుల ధరలు కూడా ఆకాశాన్నంటుతున్నాయి. 2020 నాటికి సాగు ఖర్చులు తగ్గిస్తామంటున్న కేంద్ర ప్రభుత్వం, ఎరువుల ధరలను అమాంతం పెంచి వ్యవసాయాన్ని భారంగా చేస్తోంది. ఫిబ్రవరి 1 నుంచి డీఏపీ బస్తా ఒక్క దానిపై రూ.134 పెంచారు. అసలే వ్యయ భారంతో వ్యవసాయమంటేనే రైతు జంకుతున్న నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరు కారణంగా మరింత మంది వ్యవసాయం నుంచి తప్పుకుంటున్నారు. కాంప్లెక్స్ ఎరువుల్లో ఎకరా వరికి సరిపడా ఫాస్పరస్ రేటు 2017లో రూ.1287 ఉండగా, 2018లో అది దాదాపు మూడు రెట్ల(రూ.3352)కు పెరగడం గమనార్హం. ఇటీవల పెరిగిన ఎరువుల ధరలతో ఈ భారం మరింత ఎక్కువవుతుంది.

ఎకరా పత్తి పంట సాగుకు అయ్యే ఖర్చు

(గతేడాది ఓ రైతు చేసిన ఖర్చు ప్రకారం)

భూమి చదును చేసేందుకు	రూ.1000
విత్తనాలు పెట్టేందుకు	రూ.500
గొర్రు, గుంటుక(రెండు సార్లు)	రూ.4000
విత్తనాలు(సగటున ఎకరానికి 3 సంచులు)	రూ.3000
కలుపు తీసేందుకు	రూ.8000
పత్తి సేకరించేందుకు	రూ.10,000
ఎరువులు	రూ.3000
పురుగు మందులు	రూ.3500
మొత్తం	రూ.33,000

విత్తన కొరత.. నకిలీలు

రైతులకు నాణ్యమైన విత్తనాలను సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమవుతోంది. గత ఏడాది బీజీ-2 పత్తివిత్తనాల కారణంగా లక్షలాది మంది రైతులు పెద్దఎత్తున దిగుబడి కోల్పోయారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా విత్తనాల తయారీ లేకపోవడంతో పాటు కొంతమంది అధికారుల కక్కుర్తి కారణంగా రాష్ట్రంలోకి విచ్చలవిడిగా నకిలీ విత్తనాలు సరఫరా అయ్యాయి. విత్తన కంపెనీల నుంచి టెండర్లు స్వీకరించే ప్రక్రియలోనూ.. విత్తనాల సరఫరాకు సంబంధించి అనుమతుల పట్ల ఉన్నతాధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో రైతులు నష్టపోతున్నారు. నకిలీ విత్తనాల కారణంగా దిగుబడి తగ్గుతోంది. రెండేళ్ల క్రితం వరకు ఎకరా పత్తి పంటకు సగటున 10 నుంచి 15 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చేది. ప్రస్తుతం ఎకరాకు ఎనిమిది క్వింటాళ్లు మించడంలేదు. వరి పంట విషయానికొస్తే.. గతంలో సగటున ఎకరానికి 30 క్వింటాళ్లు దిగుబడి ఉండేది. ప్రస్తుతం 18 క్వింటాళ్లకు మించడం లేదు. ఒకవేళ దిగుబడి 20 క్వింటాళ్లకు పైగా వచ్చిందంటే.. పెట్టుబడి పెరిగినట్టే. ఎకరా వరిలో ఆరు క్వింటాళ్లు, పత్తి నాలుగు క్వింటాళ్లు, సోయాబీన్ రెండు క్వింటాళ్ల దిగుబడి తగ్గింది. కందులు, పెసర, మొక్కజొన్నల్లో దిగుబడి స్వల్పంగా పెరిగింది. సంస్థాగత రుణాలు పెరుగుతున్నా సాగు ఖర్చుకు అనుగుణంగా డబ్బు లభించకపోవడంతో రైతులు ప్రైవేట్ వ్యక్తుల నుంచి అధిక వడ్డీకి రుణాలు తీసుకుంటున్నారు. దీంతో సాగు వ్యయం చుక్కలనంటుతోంది. ప్రభుత్వ నివేదికల ప్రకారం 2002-2014 మధ్య కాలంలో సంప్రదాయ పంటల సాగు వ్యయం రెట్టింపుయ్యింది.

ప్రభుత్వ నివేదిక ప్రకారం సాగు వ్యయం

పంట	2017-18 (ఎకరాకు, రూ.ల్లో)	2018-19 (ఎకరాకు, రూ.ల్లో)
వరి సాధారణ రకం	28066	32103
జొన్నలు	8113	9624
మొక్కజొన్న	17228	19770
కందులు	10864	13090
పెసర	9298	11354
మినుములు	9654	11747
వేరుశనగ	16283	17965
సోయాబీన్	13364	15764
పత్తి	29107	32020

గిట్టుబాటు ధర కల్పించని ప్రభుత్వాలు

సాగు వ్యయం రైతుల పాలిట గుదిబండలా మారుతుంది. పండించిన పంటకు గిట్టుబాటు ధర దక్కకపోవడంతో రైతులు నష్టాలు చవిచూడాల్సి వస్తుంది. పోనీ గిట్టుబాటు ధర వచ్చేవరకు పంటను దాచుకుందామనుకుంటే రైతులకు అధికారుల నుంచి సహకారం కొరవడింది. రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున గిడ్డంగులను నిర్మించినా.. అవి సన్నకారు రైతులకు ఉపయోగపడడంలేదు. దీంతో ఆరుగాలం శ్రమించిన రైతుకు ఫలితం దక్కడంలేదు. అడ్డికి పావుసేరు చొప్పున దళారులకు పంటలను అమ్ముకోవాల్సిన పరిస్థితి దాపురించింది. నష్టాన్ని భరించలేక రైతులు వ్యవసాయాన్ని పక్కనబెట్టి ఇతర ఉపాధి మార్గాలను వెతుక్కుంటున్నారు. పంటకు సరైన గిట్టుబాటు ధరను కల్పించడంతో పాటు రైతులు పండించిన మొత్తం ధాన్యాన్ని బేషరతుగా ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతు సంఘాలు వాపోతున్నాయి.

కుప్పకూలిన విమానం

(మొదటి పేజీ తరువాయి)

ఈ విషయాన్ని ఇరాన్ ఇంకా అధికారికంగా ఖరారు చేయ లేదు. ఏస్‌మ్యాన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఏటీఆర్-72 అనే విమానాన్ని తక్కువ దూరాలు వెళ్లడానికి ఉపయోగి స్తుంటారు. అది ఇరాన్ రాజధాని టెహ్రాన్ నుంచి 780 కిలోమీటర్ల దూరంలో దక్షిణ దిశగా ఉన్న యసుజ్ నగరానికి బయల్దేరింది. విమానంలో ఒక పిల్లవాడితో సహా 60 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది ఉన్నారు. ప్రమాదం సంభవించిన ప్రాంతానికి చేరుకోవడం సాధ్యం కావడం లేదని, అందువల్ల ప్రయాణికులంతా మరణించారా.. లేదా అనే విషయాన్ని ఖరారు చేయలేమని ఏస్‌మ్యాన్ ఎయిర్‌లైన్స్ అధికార ప్రతినిధి మహ్మద్ తాఫి తబతబాయ్ తెలిపారు. జాగ్రోస్ పర్వత శ్రేణి సమీపంలో ఈ ప్రమాదం జరగడం, అక్కడ మంచు ఎక్కువగా ఉండటంతో రక్షణ హెలికాప్టర్లు కూడా అక్కడకు వెళ్లలేకపోయాయి. దాదాపు 440 మీటర్ల ఎత్తుండే మౌంట్ దేనా అనే పర్వతంలోకి విమానం కూలిపోయిందని తబతబాయ్ చెప్పారు. దేశంలోని మారుమూల ప్రాంతాలకు విమాన సర్వీసులు నడిపించడానికి ఎక్కువగా ఏస్‌మ్యాన్ ఎయిర్‌లైన్స్ విమానాలను ఉపయోగిస్తుంటారు. దాంతోపాటు అంతర్జాతీయ విమాన సర్వీసులు కూడా నడుస్తాయి. అంతర్జాతీయంగా ఆంక్షలు ఉండటంతో ఇరాన్‌కు కొత్త విమానాలు ఏవీ కొనుగోలు చేసే అవకాశం ఉండటం లేదు. దాంతో బాగా పాతవిమానాలనే అది నడిపిస్తోంది. దాంతో ఇటీవలి కాలంలో తరచు విమాన ప్రమాదాలు సంభవిస్తున్నాయి. 2015లో అణు ఒప్పందం కుదిరిన తర్వాత.. ఎయిర్‌బస్, బోయింగ్ సంస్థలతో విమానాల కొనుగోలు కోసం ఇరాన్ కొన్ని ఒప్పందాలు కుదుర్చుకున్నా ఇంకా విమానాలేవీ అందలేదు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్ మీద ఇంకా కోపంగానే ఉన్నారని, అందువల్లే ఆ ఒప్పందం ప్రశ్నార్థకంగా మారిందని అంటున్నారు.

వాతావరణమే కారణం

విమానం కూలిపోయిన ప్రాంతంలో వాతావరణం చాలా దారుణంగా ఉందని ప్రముఖ విమానయాన రంగ భద్రతా నిపుణుడు, మాజీ పైలట్ డేవిడ్ లియర్‌మౌంట్ తెలిపారు. విమానం బయల్దేరడం బాగానే ఉందని, అయితే దాని నేవిగేషన్ తప్పుగా ఉండటంతో వెళ్లి కొండలను ఢీకొని ఉంటుందని ఆయన అన్నారు. మబ్బుల కారణంగా కొండలు కనిపించక ఢీకొట్టడం అంటే.. నౌకలు పెద్దపెద్ద రాళ్లను కొట్టినట్లే ఉంటుందని ఆయన వివరించారు. ఏస్‌మ్యాన్ ఎయిర్‌లైన్స్ సంస్థ వద్ద మొత్తం 29 విమానాలున్నాయి. వాటిలో ఆరు ఏటీఆర్ ఎయిర్‌క్రాఫ్టులు కూడా ఉన్నాయి. ఇరాన్‌లో ఎక్కువ విమానాలున్నవాటిలో ఇది మూడో అతిపెద్ద సంస్థ. మొదటి రెండు స్థానాల్లో ఇరాన్ ఎయిర్, మహన్ ఎయిర్ ఉన్నాయి.

గల్ఫ్ బాధితులను ఆదుకోండి

ఎంబసీ అధికారికి కాంగ్రెస్ నేతల విన్నపం

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (మనం ప్రతినిధి): గల్ఫ్ క్షమాభిక్ష పథకం అమలు చేస్తున్నందున తెలంగాణవారు రాష్ట్రానికి వచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని కాంగ్రెస్ నేతలు కోరారు. ఈ మేరకు ఆదివారం నేతలు వినోద్ కుమార్, పార్టీ గల్ఫ్ కన్వీనర్ నంగి దేవేందర్‌రెడ్డి, కార్యదర్శి జేఎన్ వెంకట్ రెడ్డి తదితరులు ఎంబసీ అధికారులు నారాయణను కలిశారు. కువైట్ అమలు చేస్తున్న క్షమాభిక్ష పథకం ఈ నెల 22న ముగుస్తుందని, ఈ నేపథ్యంలో స్వరాష్ట్రానికి రానున్న తెలంగాణ కార్మికులకు అన్నివిధాలా ఆదుకోవాలని కోరారు. ఈ పథకం ద్వారా దాదాపు 14 వేల మంది కార్మికులు స్వదేశానికి వచ్చే అవకాశం ఉంటుందని అన్నారు.


మరో.. పరారీ!

(మొదటి పేజీ తరువాయి)

వలలో పంజాబ్ నేషనల్ బ్యాంకు పడితే.. విక్రమ్ కొఠారీ వలలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ), అలహాబాద్ బ్యాంకు పడ్డాయి. వీటిలో యూబీఐ రూ. 485 కోట్ల రుణం ఇస్తే.. అలహాబాద్ బ్యాంకు రూ. 352 కోట్ల రుణం ఇచ్చింది. వీటితో పాటు బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు కూడా యథాశక్తి ఆయనకు రుణాలు సమర్పించుకున్నాయి. ఇలా ఇవ్వడంలో నిబంధనలకు ఈ బ్యాంకులు నీళ్లొదిలేశాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.


మొత్తం 800 కోట్ల రూపాయలకు పైగా అప్పులు తీసుకున్న ఆయన.. దాదాపు ఏడాది నుంచి అసలు మాట దేవుడెరుగు కనీసం వడ్డీ కూడా కట్టడం లేదు. ఇంత కాలం నుంచి మరి బ్యాంకులు ఏం చేశాయో తెలియదు గానీ.. ఇప్పుడు మాత్రం ఎంచక్కా విక్రమ్ కొఠారీ ఎవరికీ కనిపించకుండా పలయానం చిత్తగించారు. ఇప్పుడు కొఠారీ ఆస్తులను అమ్ముకోవడం ద్వారా కొంతవరకు రుణాన్ని రికవరీ చేయచ్చని అలహాబాద్ బ్యాంకు మేనేజర్ రాజేష్ గుప్తా చెబుతున్నారు. మరి ఇన్నాళ్లూ అప్పు తిరిగి చెల్లించనపుడు ఏం చేశారన్న ప్రశ్నకు మాత్రం సమాధానం లేదు. కొన్నాళ్ల వరకు అంతా బాగానే ఉన్నా.. తర్వాత ఉన్నట్టుండి ఆయనను అదృష్టం వెక్కిరించింది. ఏం జరిగిందో తెలియదు గానీ, కొఠారీ ఇచ్చిన రూ. 600 కోట్ల చెక్ బౌన్స్ కావడంతో ఆయనపై కేసు కూడా నమోదైంది. గత సంవత్సరం సెప్టెంబరు నెలలో విక్రమ్ కొఠారీకి చెందిన మూడు ఇళ్ల వేలానికి అలహాబాద్ బ్యాంకు నోటీసులు ఇచ్చింది. కానీ, కాన్పూర్‌లో కొఠారీకి ఉన్న పరపతి కారణంగా ఆ వేలంలో ఎవరూ పాల్గొనలేదు. ఇప్పుడు.. బహుశా దేశం వదిలి పెట్టి ఎక్కడికో పరారైపోయి ఉంటారని అంతా అనుకుంటున్నారు.

ఎవరీ కొఠారీ?



(మొదటి పేజీ తరువాయి)

స్మూత్‌గ్రిప్‌తో మార్కెట్లను ముంచెత్తాయి. చేత్తో పట్టుకునేచోట రబ్బరు తొడుగు పెట్టడంతో పాటు రాత కూడా బాగా మృదువుగా వెళ్తుండటంతో పరీక్షలలో వేగంగా రాయడానికి బాగుందని ఎక్కువమంది విద్యార్థులు వీటివైపు మొగ్గుచూపారు. దాంతో ఒక్కసారిగా విక్రమ్ కొఠారీ దశ తిరిగింది. భారీ స్థాయిలో టీవీ ప్రకటనలు గుప్పించారు. 'లిఖ్‌తే లిఖ్‌తే లవ్ హోజాయే' అనే కేప్షన్‌తో టీవీలను హోరెత్తించారు. తొలుత సల్మాన్ ఖాన్, ఆ తర్వాత రవీనా టాండన్ లాంటి నాటి సూపర్‌స్టార్లు దీనికి ప్రచారకర్తలుగా మారారు. కొఠారీని ఉత్తమ ఎగుమతి దారుడి అవార్డుతో నాటి ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి సత్కరించారు. రోటోమాక్ ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, కొఠారీ ఫుడ్స్ అండ్ ఫ్రాగ్రెన్సెస్, మోహన్ స్టీల్స్ లిమిటెడ్, క్రౌన్ ఆల్ఫా రైటింగ్ ఇన్‌స్ట్రుమెంట్స్, రేవ్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ లాంటి కంపెనీలతో పాటు లఖనవూ, కాన్పూర్, అహ్మదాబాద్, డెహ్రాడూన్ లాంటి ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా మొదలుపెట్టాడు.




తాజ్‌మహల్ వద్ద కెనడా ప్రధాని ట్రూడో కుటుంబం సందడి

తాజ్ సందర్శనలో ట్రూడో

- ఈ నెల 23న మోదీతో భేటీ
- వారంపాటు భారత్‌లో పర్యటన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: భారత్‌లో పర్యటిస్తున్న కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ఆదివారం తాజ్ మహల్‌ను సందర్శించారు. ఉదయాన్నే కుటుంబంతో సహా ఆగ్రా చేరుకున్న ట్రూడో తాజ్‌మహల్‌ను వీక్షించారు. 2012 తర్వాత భారత్‌లో పర్యటిస్తున్న కెనడా ప్రధాని ట్రూడోనే.. ప్రధాని మోదీ 2015 ఏప్రిల్‌లో కెనడా పర్యటనకు వెళ్లినప్పుడు ట్రూడోను దేశానికి ఆహ్వానించారు. ఇరుదేశాల ప్రధానుల భేటీలో రక్షణ, ఉగ్రవాదం సహా పలు కీలకాంశాలపై చర్చ జరగనుంది. ఈ నెల 25 వరకు దేశంలో పర్యటించనున్న ట్రూడో.. 23న ప్రధాని మోదీతో సమావేశమవుతారు. ఈ సందర్భంగా ఇరు దేశల మధ్య వాణిజ్య, రక్షణ, పెట్టుబడులు, వాతావరణం వంటి అంశాలపై దృష్టి సారించనున్నారు. ఈ పర్యటనతో సివిల్ న్యూక్లియర్ రంగానికి సంబంధించి ఒప్పందాలు బలపడతాయని విశ్లేషకులు పేర్కొన్నారు. కాగా, సోమవారం గుజరాత్‌లోని సబర్మతీ ఆశ్రమాన్ని, గాంధీనగర్‌లోని అక్షర్‌ధామ్ ఆలయాన్ని ట్రూడో సందర్శిస్తారని సమాచారం. అనంతరం 20న ప్రముఖ వ్యాపారవేత్తలు, సినీ నిర్మాతలతో ముంబైలో సమావేశమవుతారు. ఈ నెల 21న కెనడా ప్రధాని ట్రూడో స్వర్ణ దేవాలయాన్ని సందర్శించనున్నారు. ట్రూడోతో పాటు కెనడా విదేశాంగ మంత్రి క్రిస్టియా ఫ్రీలాండ్, సైన్స్, ఆర్థిక శాఖ మంత్రి నవ్‌దీప్ బైన్స్, రక్షణ శాఖమంత్రి హర్‌జిత్ సింగ్ సజ్జన్, క్రీడా శాఖ మంత్రి క్రిస్టి డంకన్, నిర్మాణ రంగ శాఖ మంత్రి అమర్జీత్ జోషి తదితరులు భారత్ పర్యటనకు వచ్చారు. కెనడాలో ప్రవాస భారతీయులు సుమారు 1.4 మిలియన్ల మంది ఉంటారని అంచనా.

తన కుమారుడిని గాలిలో ఎగరేస్తున్న ట్రూడో



ప్రజాస్వామ్యమే బీజేపీ మూలం

- ఆ స్ఫూర్తితోనే పొత్తులు విజయవంతం
- జాతి ప్రయోజనాలే ముఖ్యం: మోదీ
- పార్టీ కేంద్ర కార్యాలయం ప్రారంభం
- నవీ ముంబై విమానాశ్రయానికి శంకుస్థాపన



బీజేపీ కార్యాలయం ప్రారంభోత్సవంలో జోషితో ముచ్చటిస్తున్న మోదీ

న్యూఢిల్లీ/ముంబై, ఫిబ్రవరి 18: బీజేపీ మూల సిద్ధాంతం ప్రజాస్వా మ్యమేనని, తమ రక్తంలో ప్రతి చుక్కలోనూ అదే స్ఫూర్తి నిండి ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. జన సంఘ్, భారతీయ జనతా పార్టీ తొలి నాటి నుంచి జాతి ప్రయోజనాల కోసమే పోరాడుతున్నట్లు ఆయన చెప్పారు. ఢిల్లీలోని దీన్‌దయాళ్ మార్గ్‌లో నూతనంగా నిర్మించిన బీజేపీ కేంద్ర ప్రధాన కార్యాలయాన్ని పార్టీ అధ్యక్షుడు అమిత్ షా, సీనియర్ నేత అద్వానీతో కలిసి మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ 1951లో జన సంఘ్ ఆవిర్భావం నాటి నుంచి నేడు బీజేపీ సాధించిన విజయాల వరకు వివరించారు. బీజేపీ ఎప్పుడూ మూల సిద్ధాంతాలను దాటి పక్కకు పోలేదని, దేశ భక్తితో ముందుకు సాగిందని ఆయన చెప్పారు. స్వాతంత్ర్య పోరాటంలో ఎందరో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారని, కానీ స్వరాజ్యం వచ్చాక తమ సొంత రాజకీయ ఎజెండాలతో చీలిపోయారని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశ ప్రయోజనాల దృ ష్ట్యా మరో బలమైన జాతీయ పార్టీ ఉండాలన్న లక్ష్యంతో జనసంఘ్ స్థాపన జరిగిందన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి ప్రతి పోరాటం జాతి ప్రయోజనాల కోసమే సాగించామని, ఇది తమకు గర్వకారణమని చెప్పారు. ప్రజాస్వామ్యమే మూల సిద్ధాంతంగా పార్టీ ఎదుగుతూ వచ్చిందని, ఆ స్ఫూర్తితోనే పొత్తులను విజయవంతంగా కొనసాగించగలిగా మని మోదీ పేర్కొన్నారు. అటల్ బిహారీ వాజపేయి నేతృత్వంలో పలు ప్రాం తీయ పార్టీలను సమన్వయం చేసుకుంటూ ఆయా రాష్ట్రాల ఆకాంక్షలను నెర వేరుస్తూ విజయవంతంగా ఎన్డీఏ ప్రభుత్వాన్ని నడిపించారని గుర్తు చేశారు. దేశంలోని అనేక రాజకీయ పార్టీలతో మన ప్రజాస్వామ్యం పరి మళిస్తోందని అన్నారు. అనంతరం అమిత్ షా మాట్లాడుతూ దీర్ఘకాలం నుంచి ఉన్న సువిశాల కేంద్ర కార్యాలయం ఏర్పాటు కలను 14 నెలల్లోనే సాకారం చేశామ న్నారు. లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యాధునిక సౌకర్యాలతో దీన్ని నిర్మించామని, అన్ని రాష్ట్రాల కార్యాలయాలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించే సౌకర్యం అందుబాటులో ఉందని తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద కార్యాలయం బీజేపీదేనని చెప్పారు. కార్యకర్తల త్యాగాల వల్లే బీజేపీ విజయాలు సాధించ గలిగిందని అన్నారు.

ప్రస్తుతం ప్రపంచీకరణ అవసరంగా మారిన కాలంతో మనం ఉన్నామని, ఈ సమయంలో ప్రపంచంతో పోటీ పడాలంటే మౌలిక సదుపాయాలను మెరుగుపరుచుకోవాలని ప్రధాని మోదీ అన్నారు. ఆదివారం మహారాష్ట్రలో నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయానికి ఆయన శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం ముంబైలో ఉన్న ఛత్రపతి శివాజీ అంతర్జాతీయ విమానాశ్రయంపై భారాన్ని తగ్గించేందుకు దీన్ని నిర్మిస్తున్నట్లు మోదీ చెప్పారు. ఈ ప్రాజెక్టు ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉందని, తాను అధికారంలోకి వచ్చేసరికి ఎన్నో ప్రాజెక్టులు ఇలా మూలన పడేసి ఉన్నాయని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చాక వాటి ఆవశ్యకతను గుర్తించి పనులు ప్రారంభిస్తున్నామన్నారు. దేశంలో విమానయాన రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందని, ప్రపంచీకరణలో భారత్ ముందుండేందుకు ఈ రంగంలో మౌలిక సదుపాయాల వృద్ధి ముఖ్యమని ఆయన అన్నారు. అనంతరం ముంబైలో ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సును మోదీ ప్రారంభించారు.

ప్రపంచీకరణ అవసరంగా మారింది



బీజేపీ కార్యాలయం

జైట్లీ దాక్కుంటారు.. మోదీ మాట్లాడరు..

- ప్రధాని అపరాధిలా వ్యవహరించొద్దు
- విద్యార్థుల పరీక్షలపై రెండు గంటలు మాట్లాడారు
- 22 వేల కోట్ల కుంభకోణంపై

2 నిమిషాలు మాట్లాడలేరా?: రాహుల్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: పంజాబ్ నేషనల్ బ్యాంక్- వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ కుంభకోణం ప్రధాని నరేంద్రమోదీ పెదవి విప్పాలని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు. ''పీఎన్‌బీ కుంభకోణంపై ప్రధాని మాట్లాడరు. ఆర్థిక శాఖ మంత్రి అరుణ్‌జైట్లీ మీడియా ముందుకు రాకుండా దాక్కుంటారు. పీఎం మోదీ పరీక్షలు ఎలా పాసవ్వాలో పిల్లలకు రెండు గంటలపాటు చెప్పారు, కానీ 22 వేల కోట్ల బ్యాంకింగ్ స్కామ్ గురించి ఆయన 2 నిమిషాలు కూడా మాట్లాడలేదు. ప్రధాని మోదీ.. మీరు అపరాధులైనట్లుగా ప్రవర్తించడం ఆపండి! మాట్లాడండి'' అని ఆదివారం ట్విట్టర్‌లో రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. ''ఈ పెద్ద బ్యాంకు లూటీ కుంభకోణానికి సంబంధించి ప్రధాని, అరుణ్ జైట్లీ మాట్లాడరు. కానీ ఇతర మంత్రులు మాత్రం మీడియా ముందుకు వస్తారు. ఇదెక్కడి తీరు'' అని పేర్కొన్నారు. ప్రభుత్వంలో ఉన్నతస్థాయి పదవుల్లో ఉన్నవారికి తెలియకుండా ఇంత పెద్ద కుంభకోణం జరిగే అవకాశమే లేదని రాహుల్ అన్నారు.

నీరవ్ మోదీ మోసగించినట్లు కేసు నమోదైన సంగతి తెలిసిందే. రూ.11,300 కోట్లకు పైగా రుణాలు తీసుకుని ఆయన ఎగ్గొట్టినట్లు సీబీఐ అధికారులు దాఖలు చేశారు. ప్రస్తుతం, సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తు చేస్తున్నాయి. నీరవ్ మోదీ, ఆయన భార్య, వ్యాపార భాగస్వామి దేశం విడిచి వెళ్ళిపోయిన సంగతి తెలిసిందే. వారిని పట్టుకునేందుకు సీబీఐ ఇంటర్‌పోల్ సహాయం కోరింది.

ఇది 'పెద్ద నోట్ల రద్దు' కుంభకోణం: మమత

వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ కుంభకోణంపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ స్పందించారు. నిజం నిగ్గు తేలాలని ట్విట్టర్‌లో ఆమె ద్వారా డిమాండ్ చేశారు. ఈ కుంభకోణం కేవలం ఓ మచ్చు తునక మాత్రమేనన్నారు. పెద్ద నోట్ల రద్దు సమయంలోనే ఈ అతిపెద్ద బ్యాంకింగ్ మోసం ఉద్ధతమైందని తెలిపారు. పెద్ద నోట్లను రద్దు చేసిన తర్వాత పెద్ద ఎత్తున మనీలాండరింగ్ జరిగిందని చెప్పారు. కీలకమైన బ్యాంకు అధికారుల మార్పు కూడా అదే సమయంలో జరిగిందన్నారు. ఈ మార్పులు చేసినది ఎవరు? దీనిలో చాలా బ్యాంకుల ప్రమేయం ఉందన్నారు.

నిజాలన్నీ నిగ్గు తేలాలని డిమాండ్ చేశారు. పంజాబ్ నేషనల్ బ్యాంకును వజ్రాల వ్యాపారి



కోల్‌కతాలో లలిత్‌మోదీ, నీరవ్‌మోదీ, విజయ్‌మాల్యా దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

టెక్సాస్‌లో ఫ్లూ విజృంభణ

- 4 వేలు దాటిన మరణాలు.. ఇంకా తగ్గని వ్యాధి తీవ్రత
- వ్యాక్సిన్ తప్పనిసరి.. నిపుణుల సూచన



హ్యూస్టన్, ఫిబ్రవరి 18: టెక్సాస్‌లో విజృంభించిన ఫ్లూ మహమ్మారి కారణంగా మొత్తం నాలుగు వేల మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని అక్కడి ఆరోగ్య శాఖ వెల్లడించింది. వ్యాధి తీవ్రత ఇప్పటికీ ఉన్న నేపథ్యంలో మరణాల సంఖ్య మరింత పెరిగే ప్రమాదం ఉందని పేర్కొంది. ఈమేరకు టెక్సాస్ స్టేట్ హెల్త్ సర్వీసెస్ డిపార్ట్‌మెంట్(డీఎస్‌హెచ్‌ఎస్) ప్రతినిధి మృతుల వివరాలను మీడియాకు వెల్లడించారు. ఇటీవల జరిపిన పరిశీలనలో ఫ్లూ కారణంగా ఎంతమంది మరణించారనే లెక్కలు తీయగా.. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 4,153 మంది మరణించారని తేలిందన్నారు. ఈ పరిశీలనకు డెత్ సర్టిఫికెట్‌ను ప్రామాణికంగా తీసుకోవడం వల్ల కొన్ని వారాల క్రితం సమాచారం లభ్యమైందని.. ఈ సమయంలో మరికొంతమంది ప్రాణాలు కోల్పోయి ఉండొచ్చని డీఎస్‌హెచ్‌ఎస్ ప్రతినిధి లారా అంటోన్ తెలిపారు. కాగా, ఇటీవలి కాలంలో ఫ్లూ లక్షణాలతో వైద్యులను ఆశ్రయించేవారి సంఖ్య తగ్గడం శుభసూచకమని ఆయన పేర్కొన్నారు. అయితే, ఇంతటితో ఫ్లూ సమస్య ముగిసిందనే నిర్ణయానికి రావడం వీలుకాదని చెప్పారు. ఇంకా కొన్ని ప్రాంతాల్లో వ్యాధి ప్రభావం ఎక్కువగానే ఉందని వివరించారు. ఈ క్రమంలో ఫ్లూ వ్యాక్సిన్ వేయించుకోవడంలో నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని ప్రజలకు లారా సూచించారు. ఈ వ్యాక్సిన్ ఫ్లూలోని కొత్త వైరస్ (హెచ్1ఎన్2) సహా అన్ని రకాల వైరస్‌లను కొంతమేర అడ్డుకుం టోందని చెప్పారు. ఆరు నెలల నుంచి ఎనిమిదేళ్ల చిన్నారుల విషయంలో వ్యాక్సిన్ ప్రభావం దాదాపు సగానికి పైనే ఉంటోందని లారా వివరించారు.


200 డొల్ల కంపెనీలపై నిఘా

బినామీ ఆస్తులపై నజర్.. పీఎన్‌బీ కుంభకోణంలో ఈడీ, ఐటీ దర్యాప్తు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)లో రూ.11,400 కోట్ల కుంభకోణానికి సంబంధించి.. 200 డొల్ల కంపెనీలు, బినామీ ఆస్తులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), ఆదాయపన్ను శాఖ దృష్టి సారించాయి. కుంభకోణంలో కీలక సూత్రధారి, పాత్రధారి నీరవ్ మోదీ, ఆయన మామ మెహుల్ చోక్సీ, ఇతర బంధువులకు చెందిన వ్యాపార సంస్థలు, కంపెనీలపై నిఘా పెట్టామని అధికారులు వెల్లడించారు. కుంభకోణానికి సంబంధించి ఆదివారం.. నాలుగోరోజు కూడా ఈడీ అధికారులు దేశవ్యాప్తంగా 45 చోట్ల సోదాలు, తనిఖీలు నిర్వహించారు. వీటిలో బంగారు ఆభరణాల షోరూంలు, వర్క్‌షాపులు తదితర ప్రాంతాలు ఉన్నాయి. దాదాపు రెండు డజన్లకు పైగా ఆస్తులను మానిలాండరింగ్ చట్టం కింద అటాచ్ చేశారు. ''నీరవ్ మోదీ, ఆయన కుటుంబ సభ్యులకు చెందిన 29 ఆస్తులను ఆదాయపన్నుశాఖ జప్తు చేసింది. వాటిపై ఆదాయపన్నుశాఖతో కలిసి మనీలాండరింగ్ చట్టం కింద దర్యాప్తు చేస్తాం'' అని ఈడీ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. డబ్బు సరఫరాకు సంబంధించి ఇప్పటి వరకు 200 డొల్ల కంపెనీలను గుర్తించామని తెలిపారు. ఈ కేసులో ఇప్పటి వరకు రూ.5,674 కోట్ల విలువైన వజ్రాలు, బంగారు ఆభరణాలు, ఇతర విలువైన వస్తులను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

పీఎస్‌బీల్లో ప్రభుత్వ వాటా తగ్గాలి: అసోచామ్

పీఎన్‌బీ కుంభకోణం నేపథ్యంలో ప్రభుత్వ రంగ బ్యాంకు(పీఎస్‌బీ)ల్లో ప్రభుత్వ వాటా 50 శాతం కంటే తక్కువ ఉండేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి అసోచామ్ విజ్ఞప్తి చేసింది. పీఎస్‌బీలు కూడా ప్రైవేటు రంగ బ్యాంకుల తరహా నిబంధనలు పాటిస్తూ నడిపిస్తే ఇలాంటి కుంభకోణాలకు తావుండదని అభిప్రాయపడింది. దాంతో అందులోని భాగస్వాములకు సమాన భాగస్వామ్యం, బాధ్యత ఉంటుందని, వినియోగదారులు ప్రయోజనాలు పరిరక్షణకు అవకాశం ఏర్పడుతుందని అసోచామ్ పేర్కొంది. ''పీఎస్‌బీలు ఒక సమస్య నుంచి ఇంకో సమస్యలోకి కూరుకుపోతున్నాయి. వాటిని రక్షించేందుకు ప్రజా ధనం కేటాయించాల్సి వస్తోంది. ఈ దుస్థితి పోవాలి. పన్నుల ద్వారా వచ్చిన డబ్బు సత్ప్రయోజనాలకు వినియోగించాలి'' అని అభిప్రాయపడింది.



చీపురు పట్టి.. మరుగుదొడ్డి కడిగి..


- టాయిలెట్‌ను శుభ్రం చేసిన ఎంపీ



రివా(మధ్యప్రదేశ్), ఫిబ్రవరి 18: క్షేత్ర స్థాయి పర్యటనలలో ప్రజా ప్రతినిధుల తీరే వేరు.. ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరిస్తూ, హామీలు ఇస్తూ అధికారులకు సూచనలిస్తూ, కొండొకచో వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ మీడియాలో కనిపిస్తుంటారు. అయితే, మధ్యప్రదేశ్‌లో ఓ ప్రజాప్రతినిధి మాత్రం దీనికి పూర్తిగా భిన్నంగా ప్రవర్తించారు. మాటలు కాదు చేతలు ముఖ్యమని చేసి చూపించారు. పాఠశాల లో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్డిని స్వయంగా చేత్తో శుభ్రపరిచారు. మధ్యప్రదేశ్‌లోని రివా నియోజకవర్గంలో ఈ అరుదైన ఘటన చోటుచేసుకుంది. నియోజకవర్గానికి చెందిన ఎంపీ జనార్ధన్ మిశ్రా(బీజేపీ) శనివారం ఓ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా స్కూలు విద్యార్థులతో మాట్లాడుతూ.. వారి సమస్యలను తెలుసుకున్నారు. పాఠశాల మరుగుదొడ్లు సక్రమంగా లేకపోవడంతో వాటిని ఉపయోగించడంలేదని విద్యార్థులు చెప్పారు. దీంతో మిశ్రా స్వయంగా చీపురు చేత పట్టి టాయిలెట్స్‌ను శుభ్రపరిచారు. లోపల కూరుకుపోయిన చెత్తను ఎడమ చేతితో తీశారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో ఫొటోలకు ఫోజులివ్వడం కాదు.. చేసి చూపించాలని చాటాడు. దీనికి సంబంధించిన వీడియోను మిశ్రా ట్వీట్ చేయడంతో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వీడియో చూసిన నెటిజన్లు మిశ్రాపై ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.

స్మార్ట్ సిటీలకు ఫ్రాన్స్ నిధులు?

- 800 కోట్లు ఇవ్వనున్న ఏఎఫ్‌డీ




న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్మార్ట్ సిటీస్ మిషన్‌పై ఫ్రాన్స్ డెవలప్‌మెంట్ బ్యాంకు ఆసక్తి ప్రదర్శిస్తోందని ఆర్థిక మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ మిషన్ అమలుకు నిధులు ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేసిందని శాఖ అధికారి ఒకరు తెలిపారు. స్మార్ట్ సిటీ పథకం కింద వివిధ రాష్ట్రాల్లోని పలు నగరాలను ఎంపికచేసి కేంద్రం వాటిని మరింత అభివృద్ధి చేస్తున్న విషయం తెలిసిందే! ఇప్పటి వరకు 99 నగరాలను ఈ పథకం కింద ప్రభుత్వం ఎంపిక చేసింది. వీటి అభివృద్ధికి రూ.2.03 లక్షల కోట్ల అవసరం ఉంది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఈ తరహా ప్రాజెక్టులకు ఫ్రాన్స్‌కు చెందిన ఏజెన్సీ ఫ్రాంచైజీ డీ డెవలప్‌మెంట్(ఏఎఫ్‌డీ) బ్యాంక్ ఆర్థిక సహాయం చేస్తుంది. భారత్‌లోనూ 2008 నుంచి ఈ బ్యాంక్ సేవలందిస్తోంది. తాజాగా స్మార్ట్ సిటీ మిషన్‌కు 100 మిలియన్ల యూరోలు(సుమారు రూ.800కోట్లు) ఇచ్చేందుకు ఏఎఫ్‌డీ ఆసక్తి కనబరుస్తోంది. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మానుయేల్ మేక్రాన్ భారత్ పర్యటనకు ముందే దీనిపై తుది నిర్ణయం వెలువడుతుందని ఆర్థికశాఖ అధికారి వెల్లడించారు. జర్మనీ, జపాన్ దేశాలు కూడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు ఆసక్తి చూపిస్తున్నాయని చెప్పారు.



మెక్సికోలో శాంటియాగోలో జిమిటెపెక్‌లో సైనిక హెలికాప్టర్ కూలింది. ఈ ఘటనలో 13 మంది దుర్మరణం పాలయ్యారు. అయితే.. చాపర్‌లో ప్రయాణిస్తున్న అధికారులు మాత్రం సురక్షితంగా బయటపడ్డారు. కొద్ది రోజుల క్రితం సంభవించిన భూకంప ప్రభావాన్ని అంచనా వేసేందుకు అధికారులు హెలికాప్టర్‌లో వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది

బియ్యంలో కేన్సర్ నిరోధకత

- మూడు రకాల వంగడాల గుర్తింపు
- ఐజీకేవీ, బార్క్ పరిశోధకుల వెల్లడి
- లంగ్, బ్రెస్ట్ కేన్సర్లపై ప్రభావం



రాయ్‌పూర్, ఫిబ్రవరి 18: ఛత్తీస్‌గఢ్‌లో లభించే కొన్ని రకాల బియ్యంలో పలు కేన్సర్లను నిరోధించే శక్తి ఉందని తాజా అధ్యయనంలో తేలింది. ఇక్కడ సంప్రదాయ పంటల నుంచి సేకరించే గత్వాన్, మహారాజి, లైచా రకాలలో ఈ గుణాలను గుర్తించినట్లు ఇందిరాగాంధీ కృషి విశ్వవిద్యాలయం (ఐజీకేవీ), బాబా అణుపరిశోధనా సంస్థ(బార్క్) పరిశోధకులు పేర్కొన్నారు. ఈ మూడు రకాలకు ఊపిరి తిత్తులు, రొమ్ము కేన్సర్లను నయం చేసే ప్రత్యేక లక్షణం ఉందని, అది కూడా ఆరోగ్యకరమైన కణాలకు ఎలాంటి ఇబ్బంది కలగనివ్వకుండా తమ పని పూర్తిచేసే శక్తి ఉందని చెప్పారు. ఈమేరకు ఐజీకేవీకి చెందిన ప్రిన్సిపల్ సైంటిస్ట్ దీపక్ శర్మ తమ ఆవిష్కరణ ఫలితాలను మీడియాకు విడుదల చేశారు. ఈ మూడింటిలోనూ లైచా రకం బియ్యం మరింత శక్తిమంతమైనవని పేర్కొన్నారు. కేన్సర్ కారక కణాలను గుర్తించడంతో పాటు వాటిని మట్టుబెట్టడంలోనూ ఈ బియ్యం ముందుంటాయని శర్మ వివరించారు.

కాగా, వివిధ రకాల పంట ఉత్పత్తులపై సంయుక్త పరిశోధనల కోసం యూని వర్సిటీ గ్రాంట్ కమిషన్(యూజీసీ) గత ఏడాది బార్క్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం లో భాగంగా చేపట్టిన పరిశోధనలలో ఇదొకటని వర్సిటీ పేర్కొంది. ఈ క్రమంలో అసోసియేట్ డైరెక్టర్ వీపీ వేణుగోపాలన్ మార్గదర్శకత్వం కింద ఓ బృందం సంప్రదాయ వరి వంగడాలపై పరిశోధన జరిపి ఈ విషయాన్ని గుర్తించారు.

వేసవిలో 'సవ్యసాచి'?


నాగచైతన్య

నాగచైతన్య, చందు మొండేటి కాంబినేషన్‌లో వచ్చిన 'ప్రేమమ్' మంచి ప్రేక్షకాదరణ పొందిన విషయం తెలిసిందే. మళ్ళీ వీరిద్దరి కలయికలో వస్తున్న చిత్రం 'సవ్యసాచి'. నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో మాధవన్, భూమిక కీలక పాత్రల్లో కనిపించ నున్నారు. ద్వి శతాధిక చిత్రాల స్వరకర్త ఎం.ఎం.కీరవాణి బాణీలు అందిస్తున్నారు. ఇదిలా ఉంటే.. ఈ సినిమా విడుదల తేది గురించి టాలీవుడ్ సర్కిల్స్‌లో ఓ వార్త హల్ చల్ చేస్తోంది. అదేమిటంటే.. మార్చి నెలాఖరుకల్లా చిత్రీకరణ పూర్తిచేసుకోనున్న ఈ మూవీని మే 24న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారని తెలిసింది. దీనిపై త్వరలోనే క్లారిటీ వస్తుంది.

ఇవీ 'నవాబ్'లోని పాత్రలు


మణిరత్నం

విభిన్న చిత్రాలను రూపొందిస్తూ దర్శకుడిగా తనకంటూ ఓ ప్రత్యేకతను ఏర్పరచుకున్న దర్శకుడు మణిరత్నం. తన డైరెక్షన్‌లో సినిమా వస్తోందంటే అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తారు. తాజాగా మణిరత్నం దర్శకత్వంలో ఓ మల్టీస్టారర్ రూపొందుతున్న విషయం తెలిసిందే. 'చెక్క చివంత వానమ్' పేరుతో తమిళంలో తెరకెకుతున్న ఈ చిత్రం తెలుగులో 'నవాబ్' పేరుతో విడుదల కానుంది. ఈ చిత్రంలో నటిస్తున్న ప్రముఖ హీరోల పాత్రల తీరుతెన్నులు ఎలా ఉంటాయనే దానిపై అందరిలోనూ ఆసక్తి నెలకొంది. ఇందులో అరవింద్ స్వామి రాజకీయ నేత పాత్ర పోషిస్తుండగా, శింబు ఇంజినీర్‌గా కనిపించనున్నారను. విజయ్ సేతుపతి పోలీస్ ఆఫీసర్‌గా, అరుణ్ విజయ్ విలన్‌గా నటిస్తున్నారు. 'చెలియా' చిత్రంతో అందర్నీ ఆకట్టుకున్న అదితిరావు హైదరి ఓ కీలక పాత్ర పోషిస్తోంది. ఐశ్వర్య రాజేష్, ప్రకాష్‌రాజ్ ఇతర ముఖ్యపాత్రల్లో కనిపిస్తారని తెలుస్తోంది. ఎ.ఆర్.రెహమాన్ ఈ చిత్రానికి సంగీతం సమకూరుస్తుండగా, సంతోష్ శివన్ ఛాయాగ్రహణాన్ని అందిస్తున్నారు. మద్రాస్ టాకీస్, లైకా ప్రొడక్షన్స్ సంస్థలు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. జూలైలో ఈ చిత్రం విడుదలవుతుంది.

మే 11న 'సాక్ష్యం'


శ్రీనివాస్

బెల్లంకొండ శ్రీనివాస్ హీరోగా శ్రీవాస్ దర్శకత్వంలో అభిషేక్ నామా నిర్మిస్తున్న చిత్రం 'సాక్ష్యం'. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రాన్ని మే 11న విడుదల చేయనున్నారు. ప్రస్తుతం రామోజీ ఫిలింసిటీలో ఈ చిత్రం షూటింగ్ జరుగుతోంది. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ కూడా శరవేగంగా జరుగుతోంది. ఈ సందర్భంగా నిర్మాత అభిషేక్ నామా మాట్లాడుతూ ''ప్రేమికుల రోజు సందర్భంగా రిలీజ్ చేసిన పోస్టర్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. ప్రస్తుతం రామోజీ ఫిలింసిటీలో ఏర్పాటు చేసిన భారీ సెట్‌లో క్లైమాక్స్‌కు సంబంధించిన భారీ షెడ్యూల్ చిత్రీకరణ జరుగుతోంది. హీరో శ్రీనివాస్ సరికొత్త లుక్‌లో ఈ సినిమాలో కనిపించనున్నారు. శ్రీవాస్ చాలా అద్భుతంగా ఈ సినిమాని తెరకెక్కిస్తున్నారు. పూజాతో చేసిన రొమాంటిక్ సీన్స్‌తో పాటు అడ్వంచరస్ యాక్షన్ సీన్స్ సినిమాకు హైలెట్‌గా నిలుస్తాయి. రామోజీ ఫిలింసిటీ షెడ్యూల్ తర్వాత అమెరికా షెడ్యూల్ ప్రారంభ మవుతుంది'' అన్నారు.

మేలో తేజు కొత్త చిత్రం


సాయిధరమ్‌తేజ్
గోపీచంద్ మలినేని

సాయిధరమ్ తేజ్, డైరెక్టర్ గోపీచంద్ మలినేనిల క్రేజీ కాంబి నేషన్ లో శ్రీబాలాజీ సినీ మీడియా పతాకంపై ఓ కొత్త చిత్రం ప్రారంభం కానుంది. జె.భగవాన్, జె.పుల్లారావు సంయుక్తంగా నిర్మించనున్న ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ మే నుంచి మొదలుకానుంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు మాట్లాడుతూ.. ''మాస్ హీరో ఇమేజ్ సొంతం చేసుకొన్న సాయిధరమ్ తేజ్, కమర్షియల్ సినిమాలకి కేరాఫ్ అడ్రెస్ లాంటి గోపీచంద్ మలినేనిల కాంబినేషన్ లో సినిమా తీయడం చాలా ఆనందంగా ఉంది. ఒక కొత్త జోనర్ చిత్రంగా ఈ సినిమా ఉండబోతోంది. ఇదివరకూ సాయిధరమ్ తేజ్ చేయని కాన్సెప్ట్‌తో ఈ చిత్రం రూపొంద నుంది. త్వరలోనే మిగతా నటీనటులు మరియు సాంకేతిక నిపుణుల వివరాలను తెలియజేస్తాం'' అన్నారు.

భానుమతిగా భాగమతి


అనుష్క

మహానటి సావిత్రి జీవితం ఆధారంగా రూపొందుతున్న చిత్రం 'మహానటి'. సావిత్రి పాత్రలో కీర్తి సురేష్ నటిస్తున్నారు. నాగ్ అశ్విన్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. సమంత, మోహన్‌బాబు, ప్రకాశ్‌రాజ్, దుల్కర్ సల్మాన్, విజయ్ దేవరకొండ, షాలిని పాండే ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇదిలా ఉంటే అలనాటి నటి భానుమతి పాత్రలో అనుష్క నటిస్తున్నట్లు టాలీవుడ్ వర్గాల సమాచారం. ఇటీవల భాగమతిగా అందర్నీ అలరించిన అనుష్క 'మహానటి' చిత్రంలో భానుమతిగా నటించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. భానుమతి వంటి పవర్‌ఫుల్ క్యారెక్టర్‌కి అనుష్క సరిగ్గా సరిపోతుందని యూనిట్ భావించిందట. అయితే ఈ పాత్రకు ఓకే చెప్పిందా లేదా అనేది తెలియాల్సి ఉంది. వైజయంతి మూవీస్ పతాకంపై తెలుగు, తమిళం, మలయాళ భాషల్లో ఈ సినిమాను విడుదల చేస్తున్నారు. అశ్విని దత్ ఈ సినిమాకు నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. మిక్కీ జే మేయర్ స్వరాలు సమకూ రుస్తున్నారు. మార్చి 20న ఈ సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

నితిన్‌తో రాశీఖన్నా...


రాశీఖన్నా

ఇటీవల విడుదలైన 'తొలిప్రేమ' చిత్రంలో వర్షగా సందడి చేసి యువతరాన్ని గిలిగింతలు పెట్టింది రాశీ ఖన్నా. ఈ సినిమాతో నటిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న రాశికి..తాజాగా ఓ క్రేజీ ప్రాజెక్ట్‌లో హీరోయిన్‌గా నటించే అవకాశం దక్కిందని తెలిసింది. నితిన్ హీరోగా 'శతమానం భవతి' ఫేమ్ సతీష్ వేగేశ్న దర్శకత్వంలో దిల్ రాజు ఓ చిత్రాన్ని నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. 'శ్రీనివాస కల్యాణం' పేరుతో తెరకెక్కనున్న ఈ సినిమాలో కథానాయికగా రాశిని ఎంచుకున్నారని టాలీవుడ్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇంతకుమందు పూజా హెగ్డే, రష్మిక మండన్నా వంటి పేర్లు వినిపించినా.. ఇప్పుడా స్థానంలో రాశి చేరిందని తెలిసింది. నందితా శ్వేత మరో నాయికగా నటించనున్న ఈ సినిమా త్వరలోనే పట్టాలెక్కనుంది.

ఫిబ్రవరి 23న 'రా..రా'



శ్రీకాంత్ , నాజియా హీరో హీరోయిన్లుగా నటిస్తోన్న చిత్రం 'రా రా'. . శ్రీమిత్ర చౌదరి సమర్పణలో విజి చెర్రీస్ విజన్స్ నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 23న విడుదలవుతుంది. ఈ సందర్భంగా జరిగిన ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో హీరో శ్రీకాంత్, నాని, తరుణ్, రఘుబాబు, అలీ, హేమ, సదానంద్, నిర్మాత అశోక్, ప్రతాప్, ఖయ్యూమ్, భూపాల్ తదితరులు పాల్గొన్నారు. నాని మాట్లాడుతూ ''నాకు 'అష్టాచమ్మా' నుండి శ్రీకాంత్‌గారితో మంచి పరిచయం ఉంది. నటుడిగా ఆయనేంటో అందరికీ తెలుసు. ఇప్పుడు హారర్ మూవీ 'రా.. రా' చేస్తున్నారు. ఈ సినిమా ఆయనకు మరో పెద్ద హిట్ చిత్రంగా నిలవాలని కోరుకుంటున్నాను'' అన్నారు. తరుణ్ మాట్లాడుతూ ''శ్రీకాంత్‌గారి 125వ సినిమా ఇది. అందరూ కమెడియన్స్ కలిసి ఈ సినిమాలో నటించారు. సినిమా పెద్ద సక్సెస్ సాధించాలని కోరుకుంటున్నాను'' అన్నారు. నిర్మాతలు మాట్లాడుతూ ''శ్రీకాంత్‌గారితో 24 సంవత్సరాల అనుబంధం ఉంది. నా స్వంత బ్రదర్‌లాంటి వ్యక్తి. ఈ కథ విన్న తర్వాత విజయ్ డైరెక్ట్ చేయాలని అనుకున్నాం. శ్రీకాంత్‌గారి వంటి సీనియర్ హీరో ఇలాంటి సినిమా చేయడం గొప్ప విషయం. సినిమా తప్పకుండా అందరికీ నచ్చేలా ఉంటుంది'' అన్నారు. శ్రీకాంత్ మాట్లాడుతూ ''హాస్యంతో కూడిన హారర్ థ్రిల్లర్ చిత్రమిది. మనుషులకు, దెయ్యాలకు మధ్య సాగే సరదా ఆటలు సగటు సినిమా ప్రేక్షకుడిని మెప్పిస్తాయి. హారర్ కామెడీ థ్రిల్లర్ చిత్రం నేను తొలిసారి చేస్తున్నాను. 'రా..రా 'చిత్రం ప్రేక్షకుల ఆదరణకు నోచుకుంటుదని ఆశిస్తున్నాను అన్నారు. ఈ 23న విడుదలవుతున్న ఈ సినిమా నాకు మంచి సక్సెస్ అవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు.

శీరత్ అవుట్...రిచా ఇన్...

రచయిత శ్రీధర్ సీపాన దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'బృందావనమది అందరిది'. ఈ సినిమాలో కామిక్ డ్రామాగా తెరకెక్కనున్న ఈ సినిమాలో శీరత్‌కపూర్ కీలకపాత్రలో నటించడానికి అంగీకరించింది. చిత్ర యూనిట్ ఈ విషయాన్ని అధికారికంగా కూడా ప్రకటించారు. అయితే కారణాలు తెలియలేదు కానీ.. శీరత్ కపూర్ ఈ ప్రాజెక్ట్ నుండి తప్పుకుందని విశ్వసనీయ వర్గాల సమాచారం. శీరత్ కపూర్ స్థానంలో రిచాపనయ్ నటించనుంది. 'యముడికి మొగుడు', 'ఈడు గోల్డ్ ఎహే', 'రక్షక భటుడు' సినిమాల్లో రిచా పనయ్ నటించింది. త్వరలోనే చిత్రయూనిట్ రిచాపనయ్ నటించబో తుందనే విషయాన్ని అధికారికంగా ప్రకటించనున్నారు.


రిచా పనయ్

'మెహబూబా' షూటింగ్ పూర్తి


ఆకాష్ పూరి

పూరి జగన్నాథ్ దర్శకత్వంలో ఆకాష్ పూరి హీరోగా లావణ్య సమర్పణలో పూరి జగన్నాథ్ టూరింగ్ టాకీస్ పతాకంపై రూపొందుతున్న చిత్రం 'మెహబూబా'. ఈ చిత్రానికి సందీప్ చౌతా సంగీతం అందిస్తున్నారు. 1971 ఇండియా, పాకిస్తాన్ యుద్ధ నేపథ్యంలో సాగే ప్రేమకథగా రూపొందుతున్న ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. పూరి జగన్నాథ్ కెరీర్‌లోనే డిఫరెంట్ మూవీగా రూపొందుతున్న 'మెహబూబా' చిత్రాన్ని సమ్మర్‌లో చాలా గ్రాండ్‌గా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఆకాష్ పూరి సరసన నేహాశెట్టి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: సందీప్ చౌతా, సినిమాటోగ్రఫీ: విష్ణుశర్మ, ఎడిటింగ్: జునైద్ సిద్ధిఖీ, యాక్షన్: రియల్ సతీష్, ఆర్ట్: జానీ షేక్, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, నిర్మాత, దర్శకత్వం: పూరి జగన్నాథ్.

బాలీవుడ్ రీమేక్‌లో


జ్యోతిక

హీరో సూర్యతో వివాహం తర్వాత నటనకు గ్యాప్ తీసుకుంది నటి జ్యోతిక. తన సెకండ్ ఇన్నింగ్స్‌ను '36 వయదినిలే', 'మగళిర్ మట్టుమ్', 'నాచియార్' వంటి లేడీ ఓరియెంటెడ్ సినిమాల్లో నటిస్తూ ఆకట్టుకుంటుంది. తర్వలోనే జ్యోతిక ఓ రీమేక్ సినిమాలో నటించబోతుందని సమాచారం. విద్యాబాలన్ టైటిల్ పాత్రలో నటించిన 'తుమ్హారీ సులు' సినిమా బాలీవుడ్‌లో మంచి వియాన్ని దక్కించుకున్న సంగతి విదితమే. ఈ సినిమాను తమిళంలో రీమేక్ చేయను న్నారు. గతంలో జ్యోతికతో 'మొళి' అనే సినిమాను తెరకెక్కించిన దర్శ కుడు రాధామోహన్ ఈ సినిమాని డైరెక్ట్ చేయబోతున్నారట. మరి ఈ సినిమాను సూర్య తన స్వంత బ్యాన ర్ 2 డీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిర్మిస్తాడా? లేదా? అని తెలియా లంటే కొన్ని రోజులు ఆగాల్సిందే.



తలైవరా.. వణక్కం

- రజనీకాంత్ ఇంటికి కమల్‌హాసన్
- 3 రోజుల్లో కమల్ పార్టీ ప్రారంభం
- కలయికను కాలమే నిర్ణయిస్తుంది: కమల్
- ప్రజాసేవ కోసమే ఆయన రాజకీయాల్లోకి
- సినిమాల్లో మా ఇద్దరి స్టైల్ వేరు: రజనీ

చెన్నై, ఫిబ్రవరి 18: సరిగ్గా మరో మూడురోజుల్లో తన పార్టీ ఆవిర్భావ ప్రకటన చేయనున్న విశ్వనాయకుడు కమల్‌హాసన్.. ఆదివారం ఉన్నట్టుండి తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ ఇంటికి వెళ్లారు. తాను కూడా రాజకీయాల్లోకి రాబోతున్నట్లు రజనీ ఇప్పటికే ప్రకటించిన నేపథ్యంలో వీరిద్దరి కలయికపై పలు రకాల ఊహాగానాలు వెల్లువెత్తాయి. అయితే, పార్టీ ప్రారంభానికి ముందు తాను ఆరాధించే ముఖ్యులందరినీ కలుస్తున్నానని, అందులో భాగంగానే తలైవా ఇంటికి కూడా వెళ్లానని కమల్ మీడియాకు తెలిపారు. తన నిర్ణయాన్ని గురించి చెప్పడానికే వెళ్లానన్నారు. ఇది స్నేహంలో భాగంగా కలవడమే తప్ప ఇందులో రాజకీయాలకు తావులేదని చెప్పారు. రాజకీయాల్లోకి త్వరలో వస్తున్న మీరిద్దరూ చేతులు కలుపుతారా అని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. ''మా కలయికను కాలమే నిర్ణయించాలి'' అని ఆయన సమాధానం ఇచ్చారు. త్వరలోనే జాతీయ రాజకీయ నాయకులను కూడా కలిసే అవకాశం రావచ్చన్నారు.

కమల్ హాసన్ తమిళనాడు ప్రజలకు సేవ చేయాలనుకుంటున్నారని, ఆయన విజయం సాధించాలని తాను భగవంతుడిని ప్రార్థిస్తానని రజనీకాంత్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. పేరు కోసమో లేదా డబ్బు కోసమో కమల్ రాజకీయాల్లోకి రావడం లేదని, కేవలం రాష్ట్ర ప్రజలకు సేవ చేయడానికే వస్తున్నారని అయన అన్నారు. మరి రాజకీయాల్లో ఇద్దరూ ఎప్పుడు చేతులు కలుపుతున్నారని ప్రశ్నించగా.. ''సినిమాలలో కూడా నా స్టైలు, ఆయన స్టైలు వేరు'' అని నర్మగర్భంగా సమాధానం ఇచ్చారు. ఈనెల 21వ తేదీ నుంచి కమల్‌హాసన్ రాష్ట్ర వ్యాప్త పర్యటన ప్రారంభిస్తున్నారు. ముందుగా తన సొంత ఊరైన రామనాథపురం నుంచి ప్రారంభించి, ఆ తర్వాత మదురై, దిండిగల్, శివగంగ జిల్లాల్లో ఆయన తన పర్యటనను కొనసాగిస్తారు.

అంతిమ పోరాటం

- **ప్రత్యేకహోదా ఆంధ్రుల హక్కు**
- **టీడీపీ, బీజేపీ ఉంటే ఇది రాదు**
- **పోరుకు అన్ని పక్షాలు కలిసిరావాలి: రఘువీరా**



అమరావతి, ఫిబ్రవరి 18 (మనం ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సాధించడం కోసం అంతా కలిసికట్టుగా ముందుకు సాగాలని.. వివిధ పార్టీలు, వర్గాలకు అతీతంగా అంతిమ పోరాటానికి సిద్ధం కావాలని ఏపీసీసీ అధ్యక్షుడు ఎన్. రఘువీరారెడ్డి పిలుపునిచ్చారు. ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీల సమితి ఆధ్వర్యంలో విజయవాడలోని ఐవీప్యాలెస్‌లో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రఘువీరారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ''మన కర్తవ్యం అంతిమ పోరాటం. ఈ బడ్జెట్ సమావేశాల్లోపు మన హక్కులను సాధించుకుంటే.. సాధించుకున్నట్లు. లేదంటే ఎన్డీయే ప్రభుత్వం ఉన్నంత వరకు ఇక కాదు. మార్చి 5వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో సవరణలు జరగాలి. లేదా చట్టంలో ఏమైనా మార్పులు అవసరమనుకుంటే ఆ మార్పులను ప్రభుత్వమే ప్రతిపాదిస్తూ పార్లమెంట్ ముందుకు తీసుకురావాలి'' అని ఆయన వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ ఆ రెండింటికి సంబంధించి నోటీసులు ఇచ్చినా తిరస్కరించారు కాబట్టి.. కేంద్రప్రభుత్వమే ఈ రెండు పనులు చేయాలని రఘువీరారెడ్డి సూచించారు. ఇందులో రాజీపడే ప్రసక్తిలేదని స్పష్టంచేశారు. ప్రత్యేకహోదాను కనుమరుగు చేసే కుయుక్తులు జరుగుతున్నాయని తెలిపారు. శత్రువులను పక్కలో పెట్టి యుద్ధం చేయలేమని.. ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు అని ఈ రోజుకైనా నినదించే వారితో మాత్రమే కలిసి పనిచేయాలని తాను అభ్యర్థిస్తున్నానన్నారు.

24 నుంచి పెట్టుబడుల సదస్సు

- **విశాఖలో 3 రోజులు నిర్వహణ: యనమల**

విశాఖపట్నం, ఫిబ్రవరి 18 (మనం న్యూస్ బ్యూరో): విశాఖ వేదికగా ఈ నెల 24 నుంచి మూడు రోజుల పాటు మూడో అంతర్జాతీయ పారిశ్రామిక పెట్టుబడులు సదస్సు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు తెలిపారు. సీఐఐ ఆధ్వర్యంలో జరగనున్న ఈ సదస్సు ఏర్పాట్లను ఆయన ఆదివారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదస్సు జరిగే సమయంలో ఆందోళనలకు దిగవద్దని, రాష్ట్ర ప్రతిష్టను కాపాడాలని వామపక్షాలను విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది పెట్టుబడుల సదస్సులో 300 కంపెనీలతో ఒప్పందాలు, రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని ఆయన ఆకాంక్షించారు.

త్వరలోనే జేఎఫ్‌సీ నివేదికలు

- **కమిటీ సభ్యులకు పవన్ కృతజ్ఞతలు**

హైదరాబాద్, ఫిబ్రవరి 18(మనం ప్రతినిధి): ఏపీకి జరుగుతున్న అన్యాయంపై ఏర్పాటు చేసిన జాయింట్ ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ(జేఎఫ్‌సీ) నివేదికలను త్వరలోనే ప్రజల ముందుంచుతామని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ తెలిపారు. కొన్ని ఉపకమిటీలను నియమించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెబుతున్న లెక్కలపై అధ్యయనం చేయిస్తున్నామని పేర్కొన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించిన సమావేశాల్లో పారదర్శకంగా చర్చ జరిగిందని పవన్ అన్నారు. ఈ సమావేశాలను విజయవంతం చేసినందుకు కమిటీ సభ్యులకు పేరుపేరునా కృతజ్ఞతలు చెబుతున్నానని ఆదివారం పవన్ ఓ ప్రకటన విడుదల చేశారు. తెలుగు ప్రజలకు మేలు కలగాలన్న కాంక్షతో న్యాయకోవిదులు, ప్రజాపరిపాలన అనుభవజ్ఞులు, రాజకీయ నాయకులు చర్చల్లో పాల్గొనడం ఎంతో సంతృప్తినిచ్చిందని తెలిపారు.

తమిళనాడులో రోడ్డు ప్రమాదం
9 మంది దుర్మరణం


చెన్నై, ఫిబ్రవరి 18: తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రైవేట్ బస్సు, మినీ ట్రక్కు ఢీకొన్నాయి. ఈ ఘటనలో 9మంది ప్రయాణికులు ఘటనా స్థలంలోనే మరణించారు. కాంచీపురం జిల్లాలోని చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిపై ఈ ఘటన జరిగింది. చనిపోయిన వారిలో ఏడుగురు మహిళలే ఉండటం గమనార్హం. ప్రమాదం జరిగిన సమయంలో 24మంది ప్రయాణికులు మినీ ట్రక్కులో ఉన్నట్లు తెలిసింది. వెల్లూరు జిల్లా నెమిలి తాలూకాకు చెందిన వీళ్లంతా అంత్యక్రియలకు వెళ్లి తిరిగొస్తుండగా ఈ విషాదం చోటుచేసుకుంది. హైవే మధ్యలో యూ టర్న్ తీసుకోవాలని మినీ ట్రక్కు డ్రైవర్ ప్రయత్నించడం వల్లే ప్రమాదం జరిగినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది.

వచ్చే నెలలో పార్టీ

- **వరంగల్ లేదా హైదరాబాద్‌లో ఆవిర్భావ సభ**
- **పార్టీ రిజిస్ట్రేషన్‌కు చురుగ్గా ఏర్పాట్లు: కోదండరాం**

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (మనం ప్రతినిధి) : వచ్చే నెలలో టీజేఏసీ పార్టీ ఆవిర్భావం ఉండనుందని చైర్మన్ కోదండరాం వెల్లడించారు. మార్చి 10న లేదా 15న హైదరాబాద్ లేదా వరంగల్‌లో పార్టీ అవిర్భావ సభ ఉంటుందని తెలిపారు. పార్టీ రిజిస్ట్రేషన్ కోసం సంబంధించిన వేగంగా పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. ఆదివారం జరిగిన టీజేఏసీ స్టీరింగ్ కమిటీ సమావేశం అనంతరం కోదండరాం మాట్లాడారు. 200 మందితో కలిసి తెలంగాణలో పార్టీ సన్నాహక కమిటీ ఏర్పాటు చేశామన్నారు. అయితే, ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తామని, ఇప్పుడే పొత్తులపై ఆలోచించడంలేదని వ్యాఖ్యానించారు. సోమవారం అమెరికా పర్యటనకు వెళ్లనున్నానని, మార్చి ఒకటిన తిరిగి వస్తానని తెలిపారు. ఈ నెల 22, 23 తేదీల్లో నిరుద్యోగ సమస్యపై ఉత్తరాల ఉద్యమాన్ని చేపడతామన్నారు. జిల్లా జేఏసీల ఆధ్వర్యంలో రైతు అధ్యయన సదస్సులు జరుగుతాయని తెలిపారు. మార్చి మొదటివారంలో మార్కెట్ యార్డుల సందర్శన ఉంటుందని కోదండరాం చెప్పారు. అంతకుముందు మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఫిర్జాదిగూడలో జరిగిన తెలంగాణ సామాజిక పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో కోదండం రాం మాట్లాడారు. ప్రజల హక్కులను గౌరవించేలా ప్రభుత్వం నడుచుకోవాలని హితవు పలికారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నడచుకోని ప్రభుత్వం మనుగడ సాధించబోదని పేర్కొన్నారు.

టెట్.. ఓ అగ్ని 'పరీక్ష'



ANDHRA PRADESH TEACHER ELIGIBILITY TEST:: 2017-2018
COMPUTER BASED ENTRANCE TEST (CBET)
HALLTICKET

Name: NG VENUGOPAL — Gender: MALE

PAPER-II: 02-MAR-2018, 2:30 PM to 05:00 PM

Venue Name: SREE VAHINI INSTITUTE OF SCIENCE & TECHNOLOGY, YEPASS ROAD, SAI VAHINI NAGAR, TIRUVURU - 521235, ANDHRA PRADESH

Language I: TELUGU; QP Medium: EM/TM; Optional Sub: MATHEMATICS AND SCIENCE

Mother Name: N LAKSHMAMMA

COMPUTER BASED ENTRANCE TEST (CBET)
HALLTICKET

Name: N G VENUGOPAL — Gender: MALE

PAPER-I: 02-MAR-2018, 2:30 PM to 05:00 PM

Venue Name: ION Digital Zone IDZ Vinjanampadu Village, KKR & KSR Institute of Technology and Sciences, Vinjanampadu Village, Vattichendkuru Mandal, Prathipadu Road, Guntur District, Guntur, Andhra Pradesh, India, 522017

Mother Name: N LAKSHMAMMA

టెట్ పేపర్-1కు గుంటూరులో, పేపర్-2కు కృష్ణాజిల్లాలో సెంటర్లు వచ్చిన అభ్యర్థి హాల్ టికెట్లు

- ఒకే రోజు రెండేసి పేపర్లు
- ఒకే సమయానికి పరీక్షలు
- రెండు జిల్లాల్లో సెంటర్లు
- అయోమయంలో అభ్యర్థులు

అనంతపురం, ఫిబ్రవరి 18 (మనం న్యూస్ బ్యూరో): అనంతపురం జిల్లా గోరంట్లకు చెందిన రంజిత్ బీఈడీ పూర్తిచేసి కొన్నేళ్లుగా డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్నారు. ఇన్నాళ్లకు వచ్చిన నోటిఫికేషన్‌తో కలిగిన సంతోషం కొద్ది రోజుల్లోనే ఆవిరైంది. ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) హాల్‌టికెట్ ఆయన ఆనందాన్ని మింగేసింది. ఒకే రోజు రెండు పేపర్లకు పరీక్షలు నిర్వహిస్తున్న ప్రభుత్వం.. ఆయనకు పేపర్-1కు నెల్లూరు, పేపర్-2కు గుంటూరులో పరీక్ష కేంద్రాలు కేటాయించింది. రెండు పరీక్షలు మార్చి-2న మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటలకు జరుగుతాయని హాల్ టికెట్‌లో పేర్కొంది. ఒకే రోజు, ఒకే సమయా నికి రెండు పరీక్షలకు, వేర్వేరు జిల్లాల్లో ఎలా రాయాలని తలపట్టుకుని కూర్చున్నారు. అనంతపురం జిల్లా హిందూపురం వాసి వేణుగోపాల్ బీఎస్సీ, బీఈడీ చేశారు. ఆయన టెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. మార్చి 2న జరిగే పేపర్-1 పరీక్షకు గుంటూరు.. పేపర్-2కు కృష్ణాజిల్లా తిరువూరులలో సెంటర్లు వచ్చాయి. రెండూ అదే రోజు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగనున్నాయి. ఒకే సమయంలో రెండు వేర్వేరు జిల్లాల్లో రెండు పరీక్షలు ఎలా రాయాలో అధికారులే చెప్పాలని ఆయన నిలదీస్తున్నారు.

ఈ సమస్య ఇద్దరిదే కాదు.. రాష్ట్రవ్యాప్తంగా వేలాది ఉపాధ్యాయ ఉద్యోగార్థులది ఇదే పరిస్థితి. ఏళ్లుగా డీఎస్సీ కోసం తమ ఎదురుచూపులకు ఫలితం దక్కే సమయం వచ్చిందనుకుంటే.. అధికారుల నిర్లక్ష్యం ఇప్పుడు నిండా ముంచేసేలా ఉందని ఆవేదన చెందుతున్నారు. ఆది నుంచీ టెట్ పరీక్షపై అలసత్వం కనిపిస్తూనే ఉంది. లక్షలాది మంది నిరుద్యోగులు ఎన్నో ఆశలు పెట్టుకున్న టెట్ నోటిఫికేషన్ ఎట్టకేలకు విడుదలైంది. అయితే వాయిదాల మీద వాయిదాలు పడుతూ వచ్చింది. రోజుకో ప్రకటనతో సగం మంది ఆశలు ఆవిరయ్యాయి. ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా వ్యవహరించకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తింది. చివరకు ఈ నెల 21 నుంచి మార్చి 3 వరకు టెట్ నిర్వహిస్తామని ప్రకటించింది. అంతలోనే ముందు పాత సిలబస్ అన్నారు. మళ్లీ కొత్త సిలబస్ అన్నారు. ఇలా రకరకాల ప్రకటనలతో అందరినీ అయోమయంలో పడేశారు. వీటన్నింటి నుంచి సర్దుకుని ప్రిపరేషన్‌పై అభ్యర్థులు దృష్టి పెట్టారు. ఇటీవలే హాల్‌టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచామని ప్రభుత్వం ప్రకటించింది. తమకు ఎక్కడ సెంటర్లు పడ్డాయో చూసుకుందామన్న ఉత్సుకతతో హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకున్నారు. అంతే అప్పటి వరకూ ఉన్న ఆనందం ఒక్కసారిగా ఆవిరైపోయింది. ప్రభుత్వం ఏ జిల్లా అభ్యర్థులను ఆ జిల్లాకు కేటాయించకుండా ఇతర జిల్లాలకు కేటాయించింది. ఒకే రోజు జరిగే రెండు పేపర్లను ఒక్కొక్కటి ఒక్కో జిల్లాలో వేసింది. అంతేకాదు ఒకే సమయంలో రెండు పరీక్షలు ఉన్నట్లుగా అందులోని షెడ్యూల్ ఉంది. దీంతో అభ్యర్థులు అయోమయంలో పడిపోయారు. ప్రభుత్వ నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం వ్యక్తంచేస్తున్నారు.

మంత్రి మాటలు ఉత్తుత్తివేనా!

హాల్ టికెట్లలో లోపాల విషయం ప్రభుత్వం దృష్టికి రావడంతో ఇతర జిల్లాల్లో పరీక్ష కేంద్రాలు వచ్చిన వారు వాటిని సొంత జిల్లాకు మార్చుకోవచ్చని మంత్రి గంటా శ్రీనివాసరావు ప్రకటించారు. ఈ నెల 16న ప్రకటన చేసిన తర్వాతి రోజు సాయంత్రం 5 గంటల్లోపు మాత్రమే కేంద్రాలను మార్చుకునేందుకు వీలు ఉంటుందని చెప్పారు. కానీ, విద్యాశాఖ సూచించిన వెబ్‌సైట్ ఎంతకీ ఓపెన్ కాలేదు. దీంతో అభ్యర్థులు ప్రభుత్వం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లక్షల మంది నిరుద్యోగుల జీవితాలతో ఆటలా అంటూ మండిపడుతున్నారు.

పక్క రాష్ట్రాల్లోనూ సెంటర్లు

టెట్‌కు మొత్తం 4.50 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా.. 15,605 మందికి ఇలా వేర్వేరు చోట్ల పరీక్ష కేంద్రాలు కేటాయించారు. కొందరికి పక్క రాష్ట్రాల్లోని చెన్నై, బెంగళూరు, హైదరాబాద్‌లలోనూ పరీక్ష కేంద్రాలు వచ్చాయి. సందేశాల నివృత్తి కోసం విద్యాశాఖ కార్యాలయం నంబర్ల ఇచ్చినప్పటికీ వాటిలో ఏ ఒక్కటీ పని చేయడం లేదు.

అవిశ్వాసానికి సై

- **తీర్మానం పెట్టేందుకు మేం సిద్ధం**
- **మాపార్టీ ఐదుగురు ఎంపీలూ రెడీ**
- **తీర్మానానికి 50 మంది అవసరం**
- **ఆ బలం చంద్రబాబు తెస్తారా?**
- **ప్రకాశం జిల్లా పాదయాత్రలో జగన్**



కందుకూరు, ఫిబ్రవరి 18: జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సూచించినట్లే కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టడానికి తాము సిద్ధమని వైఎస్ఆర్‌సీపీ అధినేత, ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రకటించారు. అయితే అసలు తీర్మానం తీసుకోవాలంటే కనీసం 50 మంది ఎంపీల బలం కావాలని, తమ పార్టీ తరపున ఐదుగురు ఎంపీలు అందుకు సిద్ధమని ఆయన చెప్పారు. మిగలినవారిని చంద్రబాబు డబ్బులిచ్చి కొనుగోలు చేశారనన్నారు. చంద్రబాబుకు చెప్పి ఆయన దగ్గర ఉన్న ఎంపీలు, ఇతర పార్టీల వారిని కూడా కూడగట్టేలా ఒప్పించాలని పవన్‌కు సూచించారు. ప్రకాశం జిల్లాలో సాగుతున్న 'ప్రజాసంకల్ప యాత్ర' పాదయాత్రలో భాగంగా కందుకూరులో ఆదివారం జరిగిన సభలో జగన్ మాట్లాడారు. మొత్తం 25 మంది ఎంపీలూ రాజీనామా చేయాలని తాము పిలుపునిచ్చినా ఇంతవరకు చంద్రబాబు స్పందించకపోగా.. అసలు హోదా గురించే మాట్లాడటం లేదన్నారు. చంద్రబాబు తాన అంటే వెంటనే తందాన అనడానికి సిద్ధంగా ఆయనకు పవన్ కల్యాణ్ అనే పార్ట్‌నర్ ఉన్నారంటూ ఎద్దేవా చేశారు.

పోరాటానికి ముందుకు రండి

పవన్ కల్యాణ్ జాయింట్ ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీని ఏర్పాటు చేశారని, కానీ దాని పని కోడిగుడ్డు మీద ఈకలు పీకినట్లే ఉందని జగన్ ఎద్దేవా చేశారు. ఈ వ్యవహారమంతా చేయడానికి బదులు ప్రత్యేక హోదా మా హక్కు అంటూ పోరాడాలని పవన్‌కు సూచించారు. మార్చి 5 నుంచి పార్లమెంటు సమావేశాలు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో 1న కలెక్టరేట్ల దిగ్బంధం చేస్తున్నామని, అలాగే తమ పార్టీ నేతలు 3న బయల్దేరి ఢిల్లీ వెళ్లి 5న ఢిల్లీ నడిబొడ్డున పోరాటం చేస్తారని, అలాగే తమ ఎంపీలు పార్లమెంటులో కూడా పోరాటం చేస్తారని చెప్పారు. ప్రత్యేక హోదాపై కేంద్రం నుంచి ప్రకటన రాకపోతే.. పార్లమెంటు సమావేశాల చివరిరోజున ఎంపీలు తమ రాజీనామాలు వాళ్ల మొహాన కొట్టి వస్తారన్నారు. ఏడాది లోపు ఎన్నికలు రాబోతున్నాయంటూ కార్యకర్తలను చంద్రబాబు సిద్ధం చేస్తున్నారని, టీడీపీ ఎన్నికల ప్రణాళికలో ప్రతి కులానికీ ఒక పేజీ కేటాయించారని జగన్ విమర్శించారు.

జాబులేదు.. కరువొచ్చింది.

ఈ నాలుగేళ్లలో బాబు వచ్చినా జాబు రాలేదు గానీ ప్రకాశం జిల్లాకు కరువు మాత్రం వచ్చిందని జగన్ విమర్శించారు. మొన్న ఖరీఫ్ లో 56 మండలాలకు 46 కరువు మండలాలున్నాయని, రబీలో -71 శాతం వర్షపాతం నమోదైంది. జనవరిలోనూ ఒక్క చినుకు వర్షపాతం పడలేదని.. పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నా చంద్రబాబు ప్రభుత్వం మాత్రం కరువు మండలాల ప్రకటన చేయలేదని తెలిపారు. ఉపాధి హామీ పనుల కోసం 7 లక్షల జాబ్ కార్డ్ హోల్డర్స్ ఉంటే.. గతఏడాది కేవలం 58 రోజులు మాత్రమే ఉపాధి కల్పించారని, ఈ ఏడాది కరువు వచ్చినా 100 రజులు పనులు కల్పించాలని ఉపాధి ఉపాధి హామీ చట్టం చెబుతున్నా.. అదీ నెరవేర్చటం లేదని అన్నారు. రాళ్లపాడు ప్రాజెక్టుకు చంద్రగ్రహణం పట్టిందని, తాను అధికారంలోకి వస్తే ఆ ప్రాజెక్టును ఆరు నెలల్లో పూర్తి చేస్తానని చెప్పారు.



దుష్ప్రచారాన్ని తిప్పికొడదాం!

- **ఎక్కువే ఇచ్చాం: హరిబాబు**

విజయవాడ, ఫిబ్రవరి 18(మనం న్యూస్ ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం అన్యాయం చేసిందంటూ దుష్ప్రచారం చేస్తున్న వారి ఆరోపణలను తిప్పికొట్టాలని భారతీయ జనతా పార్టీ రాష్ట అధ్యక్షులు కంభంపాటి హరిబాబు పిలుపునిచ్చారు. విజయవాడలోని ఐలాపురం కన్వెన్షన్‌లో ఆదివారం బీజేపీ పదాధికారుల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీడీపీ మిత్రపక్షమైనా ఆ పార్టీ నేతల ఆరోపణలకు దీటుగా ఎదుర్కోవాలని బీజేపీ నేతలకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాష్ట్రానికి ఇవ్వాల్సిన వాటికన్నా ఎక్కువే ఇచ్చామని, బీజేపీ రాష్ట్రానికి చేసిన మేలును ప్రజల్లోకి తీసుకెళ్ళాల్సిన ఆవశ్యకత నేతలపై ఉందని ఆయన తెలిపారు. కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరిగిందంటూ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న విమర్శల్లో వాసవం లేదని హరిబాబు స్పష్టం చేశారు. విభజన చట్టంలో లేని విద్యాసంస్థలన్నిటినీ కేంద్రం సమకూర్చిందని చెప్పారు. విశాఖ రైల్వే జోన్ విషయంలో అభ్యంతరాలున్నందున పొరుగు రాష్ట్రాలతో సంప్రదింపులు జరుపుతున్నామని ఆయన వెల్లడించారు. కడపలో ఉక్కు కర్మాగార స్థాపనకు కేంద్రం సానుకూలంగానే ఉందని ఆయన వెల్లడించారు. మెట్రో ప్రాజెక్టులకు కేంద్రం సానుకూలమేనని స్పష్టం చేశారు. రెవెన్యు లోటు భర్తీ విషయమై రాష్ట్ర సర్కార్ లెక్కలకు, కేంద్ర ప్రభుత్వ అంచనాలకు వ్యత్యాసం ఉందని ఆయన చెప్పుకొచ్చారు. ఈ విషయంలో స్పష్టత రాగానే ఆ లోటు నిధులను అందించేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని హరిబాబు తెలిపారు. పాస్‌పోర్ట్ కేంద్రం, దూరదర్శన్ ఏర్పాటు కూడా అభివృద్ధేనా అని ప్రశ్నించే వారు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. ఏపీకి వస్తేనే హక్కులు కాపాడినట్లు లేకుంటే ప్రధాని మోదీ పాపమంటూ విమర్శించేవారికి బీజేపీ శ్రేణులు గట్టిగా బదులివ్వాలని హరిబాబు పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. ఏపీని ప్రధాని ఎంతో ఆదుకున్నారని, అంత చేసినా విమర్శలు చేయడం బాధాకరమని హరిబాబు చెప్పారు.

ముసుగులో గుద్దులాటలొద్దు

- మార్చి 6 నుంచి ఉద్యమం తీవ్రతరం
- చంద్రబాబు గందరగోళం వీడాలి
- నిధుల్లో కోత పెడితే రాష్ట్రం మరో 30 ఏళ్లు వెనక్కే
- ప్రత్యేక హోదా సాధన సమితి సమావేశంలో వక్తల ఉద్ఘాటన



ప్రత్యేక హోదా సాధన సమితి సమావేశంలో మాట్లడుతున్న సీపీఎం మధు

విజయవాడ, ఫిబ్రవరి 18(మనం న్యూస్): బడ్జెట్ సమావేశాల్లోగా విభజన హామీలు సాధించలేకపోతే మార్చి 6వ తేదీ నుంచి ఉద్యమం తీవ్రతరం చేస్తామని వామపక్ష నేతలు హెచ్చరించారు. తడ నుంచి ఇచ్ఛాపురం వరకూ హోదాను సాధించడానికి అందరూ ముందుకు రావాలని ప్రత్యేక హోదా సాధన సమితి సమావేశంలో నేతలు పిలుపునిచ్చారు. పార్టీలన్నీ కలిసికట్టుగా ఉద్యమించి ఢిల్లీ పీఠాన్ని గడగడలాడించాలని వారు పిలుపునిచ్చారు. విభజన హామీలు, ప్రత్యేక హోదా అంశాలపై హోదా సాధన సమితి ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడ ఐ.వి.ప్యాలెస్ నందు వివిధ పార్టీ నేతలతో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది.

ఈ సమావేశంలో సి.పి.ఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు మాట్లాడుతూ.. ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజీ సమానమని వాదిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఇకనైనా ఆ గందరగోళం నుంచి బయటపడాలని సూచించారు. రాష్ట్రానికి రూ. ॥9 వేల కోట్లు ఇవ్వాల్సిన నిధుల్లో కోతకోసి రూ.420 కోట్లే ఇచ్చారని ఆయన చెప్పారు. ఇలాగైతే రాష్ట్రం మరో 30 ఏళ్లైనా విభజన నష్టం నుంచి కోలుకోలేదని వ్యాఖ్యానించారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు రాజకీయ క్రీడలో ముందుంటున్నాయన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఏపీకి ఏం కావాలో సీఎం చంద్రబాబుకు తప్ప అందరికీ అవగాహన ఉందని ఎద్దేవా చేశారు. ప్యాకేజీ తమకొద్దని, ప్యాకేజీని ఒప్పుకొన్నది చంద్రబాబే తప్ప 5 కోట్ల రాష్ట్ర ప్రజలు కాదన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కావలసింది 'ప్రత్యేక హోదా' మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. బాబుకు అవగాహన లేకపోవడం వల్లనే రాష్ట్రం అధోగతి పాలవుతోందని సి.పి.ఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. పార్టీలకతీతంగా ప్రత్యేక హోదా కోసం కలిసికట్టుగా పోరాడాలని, అప్పుడే బీజేపీ మెడలు వంచి హోదాను సాధించగలమని ఆయన చెప్పారు. 'హోదా సాధిద్దాం' అనేదే మన ముందున్న ఏకైక ధ్యేయంగా ప్రతి ఆంధ్రుడు ఉద్యమించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. దేశంలో నియంతృత్వ పాలనకు చరమగీతం పాడాలని ఉత్తరాంధ్ర హక్కుల పోరాట సమితి నేత కొణతల రామకష్ణ పిలుపునిచ్చారు. జనసేన రాష్ట్ర నేత పోతిన వెంకట మహేష్ మాట్లాడుతూ.. తమ అధినేత పవన్ కళ్యాణ్ కేంద్ర, రాష్ట్రాల నిజస్వరూపాలను బట్టబయలు చేసేందుకే ''జాయింట్ ఫ్యాక్ట్ ఫైండింగ్ కమీషన్''ను ఏర్పాటు చేశారన్నారు. త్వరలో అన్ని నిజాలను పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ వెల్లడించి, ప్రజల్ని చైతన్యవంతుల్ని చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ తరపున తులసిరెడ్డి, కొలనుకొండ శివాజీ, వైసీపీ తరపున పార్థసారధి, వెల్లంపలి శ్రీనివాస్, సినీనటుడు శివాజీ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ క్యాపిటలైజేషన్

(రూ. కోట్లలో)

16 ఫిబ్రవరి / 9 ఫిబ్రవరి

మొత్తం లాభం 35425 | మొత్తం నష్టం -38724

కంపెనీ	లాభం / నష్టం	16 ఫిబ్రవరి	9 ఫిబ్రవరి
రిల్	15044	583817	568773
టీసీఎస్	-6719	562265	568984
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు	7037	487243	480206
ఐటీసీ	-6036	324765	330801
హెచ్.యు.ఎల్	3690	292735	289044
హెచ్‌డీఎఫ్‌సీ	6803	290140	283336
మారుతి	-3216	267039	270254
ఇన్ఫోసిస్	2850	245678	242827
ఓఎన్‌జీసీ	-1476	239468	240944
ఎస్‌బీఐ	-21278	234576	255854

ప్యాసింజర్ కార్ల అమ్మకాలు

జనవరి 2018

మొత్తం : 184,264 -1.25%

జనవరి 2017: 186,596

కంపెనీ	అమ్మకాలు
మారుతి సుజుకి	106,246
హ్యూండాయ్	36,009
టాటా మోటార్స్	13,415
హోండా	9,483
రెనాల్ట్	5,590
నిస్సాన్	3,590
వోక్స్‌వ్యాగన్	3,373
టయోటా కిర్ల్	3,182
ఫోర్డ్ ఇండియా	2,088
స్కొడా	1,088
ఎం అండ్ ఎం	125
ఫియట్ ఇండియా	45
మహీంద్రా ఎలక్ట్రిక్	30
జనరల్ మోటార్స్	0

ఎగుమతులు 43,399 / 40,953 (జనవరి 2017)

తయారీ 235,282 / 238,737 (జనవరి 2017)

ఆధారం: సియామ్

విస్తరణ పథకాల జోరులో జేఎన్‌పీటీ



నవీ ముంబయి: పూర్తి స్థాయిలో రూపుదిద్దుకునేందుకు సతమతమవుతున్న, చుట్టుపక్కల ఖాళీగా ఉన్న నౌకాశ్రయాల ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని దేశంలోని అతి పెద్ద నౌకాశ్రయం జేఎన్‌పీటీ భావిస్తోంది. కొత్త కార్గో కేటగిరీలలోకి విస్తరించాలని అది ప్రయత్నిస్తోంది. కంటైనర్ల నిర్వహణలో జేఎన్‌పీటీ అందెవేసిన చేయి అనిపించుకుందని ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. ''ముంబయి పోర్టుకు శాటిలైట్ పోర్టుగా వ్యవహరించగలదనే ఆలోచనతో ఈ పోర్టు ప్రారంభమైంది. కానీ, ఇప్పుడు ఈ పోర్టుకు కూడా ఉప నౌకాశ్రయంగా ఉపయోగపడగల మరో శాటిలైట్ పోర్టును అభివృద్ధి చేయవలసిన సమయం ఆసన్నమైంది'' అని నౌకాయాన శాఖ కార్యదర్శి గోపాల్ కృష్ణ ఇటీవల ఇక్కడ మీడియా ప్రతినిధులకు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన రెండు (రేవాస్, విజయ్‌దుర్గ్) ప్రాజెక్టులు పరిశీలనలో ఉన్నట్లు తెలిపారు. అందుకు మరో మూడింటిని కూడా గుర్తించినట్లు తెలిపారు. గతంలో వాటిని చేజిక్కించుకున్న వారి నుంచి వాటిని తీసుకునే అవకాశం ఉంది. రేవాస్ పోర్ట్ ప్రాజెక్టును అతి పెద్ద కార్పొరేట్ సంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్ ప్రమోట్ చేస్తోంది. దక్షిణ కొంకణ ప్రాంతంలో విజయ్‌దుర్గ్ పోర్టు ఉంది. ఇది రూ. 1.5 ట్రిలియన్‌ల మెగా రిఫైనరీకి దగ్గరలో ఉంది. రాజకీయ నాయకుని నుంచి మీడియా అధిపతిగా మారిన రాజీవ్ చంద్రశేఖర్ నడుపుతున్న కంపెనీ ఆ పోర్టును ప్రమోట్ చేస్తోంది. జేఎన్‌పీటీ ఆర్థికంగా పటిష్ఠంగా ఉన్న నౌకాశ్రయమని, ఎగువ పేర్కొన్న ఆస్తుల స్వాధీనానికి ఉన్న అవకాశాలను మంత్రిత్వ శాఖ పరిశీలిస్తోందని, అనుగుణమైన నిర్ణయం తీసుకుంటామని గోపాల్ కృష్ణ తెలిపారు.

నిధులకు కొరత లేదు

జేఎన్‌పీటీ ఇదివరకే వేలాది కోట్ల రూపాయల పెట్టుబడులతో ముడిపడిన కొన్ని ప్రాజెక్టులను చేపట్టిన సంగతిని ప్రకటించింది. వాటిలో దహను తీరానికి దూరంగా వాధవన్ వద్ద నిర్మిస్తున్న టెర్మినల్ కూడా ఉంది. మహారాష్ట్రలోని నాలుగు చోట్ల డీప్-సీ ల్యాండ్ రిక్లైమింగ్, డ్రై పోర్టులను నిర్మించనుంది.

దేశ లేదా ప్రాంతీయ అవసరాలను దృష్టిలో ఉంచుకొని భవిష్యత్తులో ద్రవ, కాలుష్య కారక బల్క్ కార్గోతో వ్యవహరించాలని దేశంలోని ఈ అతిపెద్ద కంటైనర్ పోర్టు భావిస్తున్నట్లు జేఎన్‌పీటీ తాత్కాలిక చైర్మన్ నీరజ్ బన్సల్ చెప్పారు. నౌకాశ్రయాల నిర్మాణానికి పెద్ద మొత్తాలలో పెట్టుబడులు అవసరమవుతాయని, వాటిని సమకూర్చేందుకు అది సిద్ధంగా కూడా ఉందని గోపాల్ కృష్ణ తెలిపారు. ''కొన్ని ఆర్థిక సంస్థల సహకారంతో మేం అధ్యయనాలు జరుపుతున్నాం. అధ్యయన ఫలితాలు రాగానే, అది మంచి ప్రతిపాదనా కాదా అనేది మేం మదింపు చేస్తాం. ఆర్థిక, టెక్నికల్ సాధ్యాసాధ్యాలన్నింటినీ బేరీజు వేస్తాం'' అని ఆయన చెప్పారు.

వాధవన్‌కు ప్రతిఘటన

వాధవన్‌పై ప్రగతి సంతృప్తికరంగా లేదని ఆయన చెప్పదలచుకున్నట్లుగా కనిపించింది. దానికి స్థానికుల నుంచి ప్రతిఘటన ఎదురవుతోంది. పర్యావరణ పరమైన అనుమతులు పొందడం కష్టంగా మారింది. వ్యూహాత్మక సంస్థలకు సమీపంలో ఉన్నందు వల్ల కూడా దానికి చిక్కులు ఎదురవుతున్నాయి. అయినా, సమగ్ర ప్రాజెక్టు నివేదికతో ముందుకు సాగుతున్నామని గోపాల్ కృష్ణ చెప్పారు. ఇండో ర్-మ న్మాడ్ రైల్వే లైను నిర్మాణానికి తమ మంత్రిత్వ శాఖ రైల్వేలతో చర్చలు జరుపుతోందని కృష్ణ తెలిపారు. దాని ద్వారా స్థానిక ఉత్పత్తులను ఎ గుమతి మార్కెట్‌కు తీసుకెళ్ళడం సాధ్యపడుతుందని చెప్పారు. జేఎన్‌పీటీ రూ. 2000 కోట్లతో డ్రై పోర్టుల నిర్మాణ పనులు నిర్వహిస్తున్నట్లు బన్సల్ తెలిపారు. వాటి ఫలితాలు త్వరలో కనిపించడం ప్రారంభిస్తాయని తెలిపారు.

మణిపూర్ నుంచి మైన్మార్‌కు రోడ్డు

మైన్మార్‌లో సిట్వే పోర్టు నిర్మాణానికి భారత భూభాగం నుంచి కనెక్టివిటీపై ఆందోళనలు వ్యక్తమై అవాంతరాలు ఎదురవుతున్నాయని ఆయన చెప్పారు. దానికి మణిపూర్ నుంచి రోడ్డు వేయనున్నట్లు తెలిపారు.



భారత్‌లో నోకియా 6 మొబైల్..

న్యూఢిల్లీ: హెచ్ఎండీ గ్లోబల్ సంస్థ భారత మార్కెట్లో నోకియా 6 ఫోన్‌ను ప్రవేశ పెట్టింది. 4 జీబీ ర్యామ్, 64 జీబీ ఇంటర్నల్ స్టోరేజీతో ఉన్న ఈ మొబైల్ ధర రూ.16,999. ఫిబ్రవరి 20 నుంచి ఫ్లిప్‌కార్ట్‌లో అమ్మకాలు ప్రారంభం అవుతాయి. ఇది మేట్ బ్లాక్ కలర్‌లో అందుబాటులో ఉండనుంది. ఫోన్ కొనుగోలు చేయాలనుకునేవారు ముందుగా రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుంది. ఫోన్ అమ్మకాలు ప్రారంభమయ్యాక వారికి నోటిఫికేషన్ అందుతుంది. లాంచ్ ఆఫర్‌గా పాత ఫోన్‌పై ఫ్లిప్‌కార్ట్ రూ. 2000 అదనంగా ఇవ్వనుంది.

5.5 అంగుళాల తాకే తెర, 1920 -1080 పిక్సల్ రిజల్యూషన్, స్నాప్ డ్రాగన్ 430 ప్రాసెసర్, అడెర్నో 505 జీపీయూ లాంటి ఫీచర్లు నోకియా 6 సొంతం. 4జీబీ ర్యామ్, 64 జీబీ ఇంటర్నల్ మెమొరీ ఉండగా.. ఎస్‌డీ కార్డుతో దీన్ని 128 జీబీకి పెంచుకోవచ్చు. 16 మెగాపిక్సల్ రియర్ కెమెరా, 8 మెగాపిక్సల్ ఫ్రంట్ కెమెరా ఈ ఫోన్ సొంతం.

4జీ వోల్ట్, అండ్రాయిడ్ నోగాట్ ఆపరేటింగ్ సిస్టమ్, 3000 ఎంఏహెచ్ బ్యాటరీ తదితర ఫీచర్లున్నాయి. ఇప్పటికే ఈ ఫోన్‌ను చైనాలో రిలీజ్ చేయగా.. 24 గంటల్లోనే 2.5 లక్షల మంది ముందస్తుగా బుకింగ్ చేసుకున్నారు.

రిఫండుకు సవాలక్ష ప్రశ్నలు

కోయంబత్తూరు: ప్రభుత్వం ఐ.జి.ఎస్.టి పన్ను రిఫండుకు సంసిద్ధత వ్యక్తం చేసినప్పటికీ, దుస్తుల పరిశ్రమకు పేరుగాంచిన తమిళ నాడులోని తిరుపూర్‌లో చెప్పుకోతగిన సంఖ్యలో ఉన్న ఎగుమతిదార్లు రిటర్నులు దాఖలు చేసేందుకు మనఃస్ఫూర్తిగా ప్రయత్నించడం లేదు. రిఫండు క్లైమ్ చేసేందుకు నిబంధనల్లోని అస్పష్టత అడ్డు వస్తోందని పరిశ్రమ వర్గాలలోనివారు తెలిపారు. ''ఐ.జి.ఎస్.టి రిఫండుపై జి.ఎస్.టి నోటిఫికేషన్లు పరిశీలిస్తే, రిఫండు యంత్రాంగం ద్వారా అది దానికంతట అదే ఆమోదం పొంది వచ్చేస్తుందని అనిపించింది. కానీ, ఇందులో ఒక లోపం ఉంది. దాన్ని సరిదిద్దవలసిందిగా జి.ఎస్.టి కౌన్సిల్‌ను అభ్యర్థించాలని మేం నిర్ణయించుకున్నాం'' అని తిరుపూర్ ఎగుమతిదార్ల సంఘం అధ్యక్షుడు రాజా ఎం. షణ్ముఖం చెప్పారు. యంత్రాలు, యంత్ర పరికరాల దిగుమతి గురించి ప్రస్తావిస్తూ, రిఫండు రూపంలో పన్ను క్లైమ్‌కు అనుమతించడం లేదని చెప్పారు. ''కొనుగోలు చేసిన ముడి పదార్థంతో సహా ఉత్పాదక సామగ్రిపై క్లైమ్ చేయడానికి లేదని మాకు తెలిసి వచ్చింది. మూలధన వస్తువుల దిగుమతిలో ఐ.జి.ఎస్.టి చాలా ఎక్కువగా ఉంది'' అని ఆయన అన్నారు. క్యారీ ఫార్వర్డ్ యంత్రాంగం మార్గాన్ని ఉపయోగించి ఐ.జి.ఎస్.టి రిఫండు కోరడానికి అవకాశం లేకపోవడం పట్ల ఎగుమతిదార్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్న ఎగుమతిదార్లు ఈ విషయంలో సహాయానికి ఆడిటర్లపై ఆధారపడుతున్నారు. ఆడిటర్లు ''ప్రశ్నల మీద ప్రశ్నలు వేస్తున్నారు'' అని వారు వాపోతున్నారు. రిఫండుకు దరఖాస్తు చేయడానికి సంశయంలో ఉన్నవారికి సాయపడేందుకు తిరుపూర్ ఎగుమతిదార్ల సంఘం (టి.ఇ.ఏ) ముందుకు వచ్చింది. పన్ను రిఫండుకు ఎగుమతిదార్లు లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్ లేదా బాండ్ సమర్పించాలి. లేదా ఐ.జి.ఎస్.టి రూటును ఎంచుకోవాలి. ఐ.జి.ఎస్.టి రూటు ఎంచుకున్న కొద్ది మంది ఎగుమతిదార్లకు పన్నుల్లో సర్దుబాటు చేసిన తర్వాత రిఫండు రూపంలో కొంత నగదు అందినట్లు తెలిసింది.

ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐ.టి.సి) పొంది, దానికి సరిపోయే క్లైమ్ చేయడం మరో మార్గం.



మామూలుగా అయితే, యూనిట్లు ప్రతి నెలా మూడు రిటర్నులు దాఖలు చేయాలి. కానీ, దీనిని 2018 మార్చి వరకు సస్పెండ్ చేశారు. దీనితో ఎగుమతిదార్లు ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంపై మ్యాచింగ్ క్లైమ్ చేయలేకపోతున్నారు. వారు మాన్యుయల్ ప్రాసెసింగ్‌ను ఎంచుకోవచ్చు. కానీ, ఈ విధానంలో ప్రతి లావాదేవీ వివరాలను సమకూర్చవలసి ఉంటుందని ధనంజయన్ వివరించారు. జి.ఎస్.టి వ్యవస్థ అమలులోకి వచ్చిన తర్వాత, పన్ను రిఫండు పొందడంలో జాప్యం వల్ల ఎగుమతిదార్లు తీవ్ర నగదు ఒత్తిడికి లోనవుతున్న మాట నిజమేనని ఆయన అంగీకరించారు.

ఈ సమస్యను పరిష్కరించేందుకు ఎగుమతిదార్ల సంఘం జి.ఎస్.టి-సెంట్రల్ ఎక్సైజ్ సంయుక్త కమిషనర్ ఎం. పెరియసామిని ఇష్టాగోష్ఠి సంభాషణకు ఆహ్వానించింది. నిబంధనలు పాటిస్తున్నామా లేదా అనే విషయంలో సంకోచాలు వదిలి, వెంటనే రిఫండుకు దరఖాస్తు చేసుకోవలసిందని ఆయన వారికి ధైర్యం చెప్పారు.

50% పైగా జన్‌ధన్ ఖాతాలు మహిళలవే

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి మోదీ ప్రతిష్ఠాత్మకంగా మొదలుపెట్టిన జన్‌ధన్ యోజన పథకం సకారాత్మక ఫలితాలనే ఇచ్చినట్లు కనిపిస్తోంది. ఆర్థిక కార్యకలాపాలకు దూరంగా ఉన్న ప్రజలను వ్యవస్థీకృత ఆర్థిక లావాదేవీల దిశగా నడిపించాలన్నది జన్‌ధన్ యోజన ముఖ్య ఉద్దేశాల్లో ఒకటి. దానికి సంబంధించి పలు అధ్యయనాలు ఇప్పటికే పీఎంజేడీవై(పీఎం జన్ ధన్ యోజన)ని సమర్థించాయి. ఇప్పుడు మైక్రో సేవ్ అనే సంస్థ సైతం ఏజెంట్ నెట్వర్క్ 2017 స్థితిగతి పేరిట ఒక నివేదికను తయారు చేసింది. అందులో 2015 నుంచి 2017 మధ్య జన్ ధన్ ఖాతాల్లో నగదు లావాదేవీలు 200 శాతం పెరిగినట్లు వెల్లడి అయింది. ప్రస్తుతం జన్ ధన్ ఖాతాల్లో సగానికి పైగా ఖాతాలు మహిళలే నిర్వహిస్తున్నారని నివేదిక విశ్లేషించింది.



ఎక్కువ మంది పేద ప్రజలు బ్యాంకింగ్ కార్యకలాపాలు జరిపేలా మోదీ ప్రభుత్వం చేపట్టిన జన్ ధన్ యోజన పథకం ప్రోత్సహిస్తుంది. తద్వారా వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ది ఎటువంటి లీకేజీలు లేకుండా నేరుగా ఖాతాల్లోకి చేరుతుంది. ఇంకా వారంతా అవసరమైనప్పుడు అప్పులు తీసుకునే వీలును కల్పిస్తుంది.

ప్రస్తుతం ఆధార్ సంఖ్యను, బ్యాంకు ఖాతాలతో అనుసంధానించడంతో బ్యాంకు కరెస్పాండెంట్లు లేదా ఏజెంట్లు ఆర్థిక ఉత్పత్తులను ప్రజలకు విస్తృతంగా పరిచయం చేస్తున్నారు. ముఖ్యంగా ఎక్కువ మంది ప్రజలకు సూక్ష్మ బీమా అందుబాటులోకి వచ్చింది. ముఖ్యంగా పొదుపు ఖాతా ఉన్నవారికి రోజుకు రూ.1 కన్నా తక్కువ ప్రీమియంతో ప్రారంభించిన ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకానికి బాగానే స్పందన వచ్చింది. ఏప్రిల్ 24,2017 నాటికి 3.11 కోట్ల మంది ఈ పథకంలో లబ్దిదారులుగా చేరారు.

ఎంత ఆదాయం వస్తే ఎంత పన్ను కట్టాలి ?



న్యూఢిల్లీ: ఈ ఏడాది బడ్జెట్‌లో కూడా పన్ను శ్లాబులు మారలేదు. రెండు దశాబ్దాలకు పైగా కొనసాగుతున్న వ్యక్తిగత పన్ను శ్లాబులను.. ఇప్పటికైనా పూర్తి స్థాయిలో సమీక్షిస్తారని ఆశించిన వేతన జీవులకు.. నిరుత్సాహమేనా? ఈసారి బడ్జెట్లో సైతం నిరాశే ఎదురైంది. అయితే.. స్టాండర్డ్ డిడక్షన్ రూపంలో కొంత ఊరటనిచ్చే ప్రయత్నం చేశారు ఆర్థికమంత్రి. గత రెండు సంవత్సరాలుగా పన్ను వసూళ్లు పెరుగుతున్నట్లు బడ్జెట్ ప్రసం గంలో జైట్లీ వెల్లడించారు. గత ఆర్థిక సంవత్సరంలో 12.6% అధికంగా పన్ను వసూళ్లు కాగా... ప్రస్తుతం జనవరి 15 వరకూ 18.7% ఎక్కువగా ఆదా యపు పన్ను వసూలు జరిగినట్లు తెలుస్తోంది. పన్ను చెల్లిం పుదార్ల సంఖ్య సైతం విపరీతంగా పెరిగింది. అందుకోసమే చాలా మంది ఆశలు పెట్టుకున్నప్పటికీ వ్యక్తిగత ఆదాయపు పన్ను శ్లాబులో జైట్లీ ఎలాంటి మార్పు చేయలేదు.

యాజమాన్యం నుంచి ఉద్యో గి అందుకున్న మొత్తం ఆదాయం పై పన్ను విధిస్తారు. మూలంలో తగ్గించిన పన్ను(టీడీఎస్)గా కనీస మినహాయింపు పరిమితిని అధిగమించినట్లైతే, యాజమాన్యమే ప న్ను కోత వేసి మిగిలిన సొమ్మును ఉద్యోగికి వేతనంగా చెల్లిస్తుంది. ఆదాయపు పన్ను పరిధిలో ఉండి కూడా ఐటీ రిటర్నులు దాఖలు చేయని వారి సమాచారాన్ని సైతం ప్రభుత్వం వేగంగా గుర్తిస్తోందని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ వెల్లడించారు. ఇందు కోసం టీడీఎస్ వివరాలను లోతుగా శోధిస్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. అంతే కాకుండా ఆర్థిక లావాదేవీల నివేదిక (ఎస్ఎఫ్‌టీ), శాశ్వత ఖాతా సంఖ్య (పాన్)ను ఉప యోగించి సైతం పన్ను ఎగవేతదారులను సులువుగా గుర్తి స్తున్నట్లు వెల్లడించారు.

ఆదాయపు పన్ను శ్లాబు రేట్లు
(మదింపు సంవత్సరం 2018-19)

- రూ.2,50,000 లోపు ఆదాయం ఉంటే ఎటువంటి పన్నుండదు
- రూ.2,50,000 నుంచి రూ.5,00,000 మధ్య 5 శాతం
- రూ.5,00,000 నుంచి రూ.10,00,000 మధ్య 20 శాతం
- రూ.10,00,000కు మించి ఆదాయం ఉంటే 30 శాతం

అమెజాన్ గోదాంపై 16 కేసులు నమోదు

హైదరాబాద్: ప్రముఖ ఈ-కామర్స్ సంస్థ అమెజాన్‌కు చెందిన గోదాంలో తూనికలు, కొలతల శాఖ అధికారులు తనిఖీలు చేశారు. టోలిచౌకిలోని గోదాంలో సోదాలు జరిపిన అధికారులు ప్రతి వస్తువును క్షుణ్ణంగా పరిశీలించారు. నిబంధనలకు ఉల్లంఘించడంపై 16 కేసులు నమోదు చేశారు. తమ సోదాల్లో లభించిన నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వస్తువులను సీజ్ చేశారు. కేసు నమోదుచేసినట్టు అధికారి భాస్కర్ రెడ్డి తెలిపారు.





బ్రియోకు హోండా బ్రేకులు

ముంబై: హోండా కార్స్ ఇండియా లిమిటెడ్ తొలిసారిగా 2011లో బ్రియో హ్యాచ్‌బ్యాక్ కారును ఇండియన్ మార్కెట్లోకి లాంచ్ చేసింది. సిటీ కారు తరహాలోనే బ్రియో కూడా ఎంతో మంది ఇండియన్స్ హృదయాలను దోచుకుంటుందని హోండా భావించింది. అయితే, దీనికి ఆశించిన ఆదరణ లభించలేదు. కానీ, బ్రియో ఆధారంగా వచ్చిన అమేజ్ కాంపాక్ట్ సెడాన్ బ్రియో కంటే మంచి ఫలితాలు సాధించింది.

హోండా మోటార్స్‌కు అమేజ్ మంచి ఫలితాలు సాధించిపెట్టడంతో సెకండ్ జనరేషన్ అమేజ్ కాంపాక్ట్ సెడాన్ కారును ఆటో ఎక్స్‌పో 2018లో ఆవిష్కరించింది. అయితే, అమేజ్ కంటే ముందుగా పరిచయం అయిన బ్రియో హ్యాచ్‌బ్యాక్‌ను మాత్రం సెకండ్ జనరేషన్ వెర్షన్‌గా ఆవిష్కరించలేదు.

ఇదే విషయాన్ని ఓ ఆన్‌లైన్ మీడియా ప్రస్తావిస్తూ, హోండా తమ బ్రియో హ్యాచ్‌బ్యాక్‌ను ఇప్పుడప్పుడే పరిచయం అవకాశం లేనట్లు పేర్కొంది. కాంపాక్ట్ ఎస్‌యూవీ సెగ్మెంట్లోకి కొత్త మోడల్‌ను ప్రవేశపెట్టే విషయంలో ఈ స్మాల్ హ్యాచ్‌బ్యాక్‌ను ప్రక్కనపెట్టినట్లు తెలిపింది.

హోండా గత ఏడాది విడుదల చేసిన డబ్ల్యూఆర్-వి క్రాసోవర్ ఎస్‌యూవీకి మంచి డిమాండ్ లభించడంతో ఇప్పుడు ప్రత్యేకించి ఎస్‌యూవీ మీద దృష్టి సారిస్తోంది. అంతే కాకుండా సెడాన్ సెగ్మెంట్ మీద కూడా టార్గెట్ చేస్తున్నట్లు తెలిసింది.

హోండా కార్స్ ఇండియా లిమిటెడ్ మేనేజింగ్ డైరక్టర్ యోయిచినో యయెనో మీడియాతో మాట్లాడుతూ, భారత్‌లో కాంపాక్ట్ ఎస్‌యూవీ సెగ్మెంట్ శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. ఈ నేపథ్యంలోనే స్మాల్ కార్ సెగ్మెంట్‌ను ప్రక్కనపెట్టి పలు విభిన్న ఎస్‌యూవీ మోడళ్లను ఇండియన్ మార్కెట్ కోసం పరిశీలిస్తున్నట్లు వెల్లడించాడు.

ప్రస్తుతం సెకండ్ జనరేషన్ హోండా అమేజ్ కాంపాక్ట్ సెడాన్ ఆధారిత సబ్-4-మీటర్ కాంపాక్ట్ ఎస్‌యూవీని అభివృద్ది చేస్తున్నట్లు వెల్లడించారు. అందు కోసం అమేజ్‌ను డెవలప్ చేసిన 2యుఎ కోడ్ పేరున్న ప్లాట్‌ఫామ్‌ను ఉపయోగించనున్నారు.

చిన్న ఎస్‌యూవీ మరియు సెడాన్ కార్లతో పాటు కొత్త తరానికి చెందిన సిఆర్-వి, హెచ్ఆర్-వి, సివిక్ మరియు అకార్డ్ వంటి ఖరీదైన ప్రీమియమ్ మోడళ్లను బ్రాండ్ వ్యాల్యూ పెంచడానికి మరియు అమేజ్, సిటి మరియు డబ్ల్యూఆర్-వి మోడళ్లను అధిక సంఖ్యలో సేల్స్ సాధించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.

ప్రస్తుతం హోండా బ్రియో ఆశించిన సేల్స్ సాధించడంలో విఫలమవుతోంది. హోండా బ్రియో విక్రయాలు పూర్తిగా పడిపోగా, బిఆర్-వి సేల్స్ సగటున 800 నుండి 1000 యూనిట్ల సంఖ్యలోనే అమ్ముడవుతోంది. కాబట్టి ఈ రెండు మోడళ్ల ఉత్పత్తిని హోండా ఈ సమయంలోనైనా నిలిపేసే అవకాశం ఉంది.



సమయం, దూరం, వేగం పెంచుకుంటూ.. వ్యాయామం అలవాటయ్యేలా చూసుకోవాలి.

కాలు మీద కాలేసుకొని కూచోవటం ఒకప్పుడు దర్జా! కానీ ఇప్పుడదే మహాశాపం. శారీరక శ్రమ లేని శరీరం జబ్బుల ఊబిగా తయారవు తుండటమే దీనికి నిదర్శనం. ఒకవైపు అధిక రక్తపోటు, మధుమేహం వంటి దీర్ఘకాల సమస్యలు.. మరోవైపు క్యాన్సర్ వంటి ప్రాణాంతక జబ్బులు ముంచుకొస్తున్న తరుణంలో శారీరక శ్రమ తప్పనిసరి 'తరుణోపాయంగా' మారిపోయింది. ఈ దిశగా సమాజంలో 'వ్యాయామ' కూడా పెరిగింది. అయినా కూడా ఎన్నో సందేహాలు. వ్యాయామం ఎప్పుడు చేయాలి? ఎంతసేపు చేయాలి? వేగంగా చేయాలా? నెమ్మదిగానా? ఇలా ఎన్నెన్నో ప్రశ్నలు. అందుకే వ్యాయామానికి సంబంధించిన సమగ్ర వివరాలను మీకోసం...

వ్యాయామం చేద్దాం!

వ్యాయామం జీవనాడి. అవును.. ఇప్పుడిదే నయా జీవనసూత్రం. బద్ధకాన్ని ఒకింత వదిలిపెట్టి ఒళ్లు వంచటం మొదలుపెడితే ఒనగూడే ప్రయోజనాలు చాలానే. వ్యాయామంతో మెదడు ఉత్తేజితమై మనసుకు ఉల్లాసాన్ని కలిగించే రసాయనాలు విడుదలవుతాయి. శారీరక దృఢత్వం, సామర్థ్యం పెంపొందుతుంది. శరీర సౌష్టవం, చర్మ ఆరోగ్యం మెరుగుపడి అందం ఇనుమడిస్తుంది. కుంగుబాటు, ఆందోళన దూరమై.. ఆత్మ విశ్వాసం, నమ్మకం పుంజుకుంటాయి. ఒంటి నిండా హుషారు తొణికిసలాడుతుంది. పనిలో సామర్థ్యం, నైపుణ్యం కొత్తపుంతలు తొక్కుతాయి. అన్నింటికీ మించి మధుమేహం, గుండెజబ్బులు, ఎముకలు గుల్లబారటం, క్యాన్సర్ వంటి పలు సమస్యల ముప్పూ తగ్గుతుంది. అయితే దీన్ని సరైన పద్ధతిలో చేయటం, అవగాహన పెంచుకోవటం చాలా ముఖ్యం.

అతివేగం మంచిదేనా?


వ్యాయామం నెమ్మదిగా, క్రమం తప్పకుండా చెయ్యటం మంచి పద్ధతి. అయితే కొద్దిసేపట్లోనే ఉద్ధ తంగా వ్యాయామం చేసే పద్ధతితో (హెచ్‌ఐఐటీ) కూడా మంచి ఫలితం కనబడుతుంది. 20 సెకండ్ల పాటు ఉద్ధతంగా వ్యాయామం చేయటం.. 10 సెకండ్ల పాటు విశ్రాంతి తీసుకోవటం.. ఇలా నాలుగు నిమిషాల సేపు వ్యాయామం చేయటం ఇందులోని కీలకాంశం. దీన్ని జపాన్‌కు చెందిన ఇజుమి టబాటా బ ందం 90ల్లో రూపొందించింది. ఇలా వారానికి నాలుగు రోజులు చేసినా కూడా- మామూలు వ్యాయామాలను వారానికి ఐదు రోజుల చొప్పున ఆరు వారాల పాటు చేసినంత ప్రయోజనం లభిస్తున్నట్టు పరిశోధకులు గుర్తించారు. శరీరం ఆయాసం వంటి వాటిని తట్టుకునేలా వెంట వెంటనే సిద్ధపడుతుండటమే దీనికి కారణం. డాక్టర్లను సంప్రదించిన తర్వాతే సరిపోతుందో లేదో నిర్ణయించుకోవాలి. అలాగే నిపుణుల సమక్షంలోనే చేయాల్సి ఉంటుంది. లేకపోతే నొప్పులు, గాయాల వంటివి వేధించొచ్చు. మరీ ఇంత కఠినమైన వ్యాయామాలు చేయలేమని భావించేవారు ఇంకాస్త వేగంగా పరుగెత్తటం, మెట్లు ఎక్కటం వంటి వాటిని ఎంచుకోవచ్చు. ఏదేమైనా కాస్త వేగంగా వ్యాయామం చేయటం వల్ల జబ్బులు ముప్పు తగ్గుతుండటం మాత్రం నిజమని నిపుణులు చెబుతున్నారు. అయితే అప్పటికే హైబీపీ, మధుమేహం వంటివి ఉన్నవాళ్లు, వ్యాయామం అస్సలు అలవాటులేనివారు ఒక్కసారిగా ఉద్ధృతంగా వ్యాయామం మొదలుపెట్టకూడదు. క్రమంగా సమయం, దూరం, వేగం పెంచుకుంటూ.. వ్యాయామం అలవాటయ్యేలా చూసుకోవాలి.





ట్రెడ్‌మిల్ మీద పరుగెత్తటం

నేల మీద, ట్రెడ్‌మిల్ మీద పరుగెత్తటం ఒకటేనా? ట్రెడ్‌మిల్‌తోనూ సమానంగా ఫలితం ఉంటుందా? ట్రెడ్‌మిల్ వ్యాయామం చేసేవారికి ఇలాంటి సందేహాలే వస్తుంటాయి. సాధారణంగా ఆరుబయట పరుగెట్టేటప్పుడు మనం గాలిని తోసుకుంటూ ముందుకు కదులుతుంటాం. ఒకచోట కుదురుగా ఉండే ట్రెడ్‌మిల్ మీదైతే ఇలా కష్టపడాల్సిన పనుండదు. అందువల్ల ట్రెడ్‌మిల్ మీద పరుగెట్టటం కాస్త తేలికగా అనిపిస్తుంది. ఈ తేడాను సరిదిద్దటానికే కొందరు ట్రెడ్‌మిల్ ఇంక్లైన్‌ను 1 శాతానికి సెట్ చేసుకుంటుంటారు. దీంతో నేల మీద 7 నిమిషాలకు మైలు దూరం పరుగెత్తినప్పటితో సమానంగా కేలరీలు ఖర్చవుతాయి. అయితే నెమ్మదిగా పరుగెడితే మాత్రం పెద్ద తేడా ఏమీ ఉండదు. ట్రెడ్‌మిల్ మీద పరుగెత్తటం చాలామందికి కాస్త కష్టంగానే అనిపిస్తుంటుంది. అందుకే నేల మీద కన్నా ట్రెడ్‌మిల్ మీద నెమ్మదిగానే పరుగెడుతుంటారు. ఒకే వేగాన్ని కొనసాగించేందుకు మనం బలంగా ప్రయత్నిస్తుండటమే దీనికి కారణం. అదే ఆరుబయట అయితే కొద్దిసేపు వేగంగా, కొద్దిసేపు నెమ్మదిగా.. ఇలా మన శక్తికి అనుగుణంగా వేగాన్ని మార్చుకోవచ్చు. చుట్టుపక్కల పరిసరాలను చూస్తుంటే ఎంత వేగంతో పరుగెడుతున్నామో కూడా మనకు తెలుస్తుంటుంది. పచ్చటి చెట్ల మధ్య, ప్రశాంతమైన వాతావరణంలో, శుభ్రమైన గాలిని పీలుస్తూ పరుగెట్టటం మనసుకూ ఉత్సాహాన్ని ఇస్తుంది. ఆనందం, త ప్తి లభిస్తాయి. ఆరుబయటకు వెళ్లటం కుదరనివారు ట్రెడ్‌మిల్ ఇంక్లైన్‌ను ఒకే స్థాయిలో కాకుండా మధ్యమధ్యలో మారుస్తుండటం మేలు.



ఎంతసేపు.. ఎలా?

ఎంతసేపు వ్యాయామం చేయాలి? చాలామంది మనసును తొలిచే ప్రశ్న. ప్రపంచ ఆరోగ్యసంస్థ సిఫారసు ప్రకారం.. పెద్దవాళ్లు వారానికి కనీసం 150 నిమిషాల సేపు నడక, జాగింగ్ వంటి ఒక మాదిరి (మోడరేట్) వ్యాయామాలు చేయాలి. మరింత కఠినమైన, తీవ్రమైన (రిగరస్) వ్యాయామాలైతే 75 నిమిషాలు సరిపోతుంది. ఇది శరీరం ఫిట్‌గా, కండరాలు దృఢంగా ఉండటానికి, బరువు అదుపులో ఉండటానికి, ఆయుర్దాయం పెరగటానికి తోడ్పడుతుంది. వ్యాయామ చేసే సమయం పెరుగుతున్నకొద్దీ ఇలాంటి ప్రయోజనాలూ పెరుగుతుండటం గమనార్హం. జాగింగ్ చేయటం, జిమ్‌లకు వెళ్లటం కుదరనివారు నిరుత్సాహపడాల్సిన పనేమీ లేదు. ఇంటిపనులు, తోటపని వంటివీ ఒక మాదిరి వ్యాయామం కిందికే వస్తాయి. ఆఫీసుకు నడుచుకుంటూ వెళ్లటం.. ఇల్లు ఊడ్చటం, తుడవటం వంటి పనులను వారానికి 150 నిమిషాల సేపు చేసినా కూడా అకాల మరణం ముప్పు 28% వరకు తగ్గుతున్నట్టు అధ్యయనాలు పేర్కొంటున్నాయి మరి. నిజానికైతే రోజూ క్రమం తప్పకుండా వ్యాయామాలు చేయటం ఎంతో మంచిది. ఒకవేళ అలా కుదరనివారు వారాంతంలోనైనా చేసినా సరే. ఇలాంటి 'వారాంత యోధులకు' సైతం క్రమం తప్పకుండా వ్యాయామం చేయటంతో సమానంగా అకాల మరణం ముప్పు తగ్గుతున్నట్టు అధ్యయనాలు నొక్కి చెబుతున్నాయి. మరీ అతిగా వ్యాయామం చేస్తే అనర్థమని కొందరు అనుకుంటుంటారు గానీ ఇందులో నిజమేమీ లేదు. శరీరం సహకరించినంతవరకు తమ శక్తి మేరకు వ్యాయామం చేయొచ్చు. వారానికి కనీసం 3-5 సార్లు వ్యాయామం చేసేలా చూసుకోవటం ఉత్తమం. అయితే అదేపనిగా మైళ్లకొద్దీ పరుగెత్తటం వంటి ఒకేరకం వ్యాయామాలు కాకుండా వివిధ రకాలను ఎంచుకోవటం మరీ మంచిది. అలాగే అలవాటులేని వ్యాయామాలను ఒక్కసారిగా చేయటం మంచిది కాదు.

శక్తి పానీయాలు తాగాలా?

చెమట పట్టినపుడు రక్తంలోని ప్లాస్మా నుంచి నీరు బయటకు వచ్చేస్తుంది. దీంతో రక్తం పరిమాణం కూడా తగ్గుతుంది. ఫలితంగా కండరాలకు అవసరమైన ఆక్సిజన్, ఇతర పోషకాలను అందించటానికి గుండె మరింత ఎక్కువగా కష్టపడాల్సి వస్తుంది. కాబట్టి శారీరక శ్రమ, వ్యాయామాలు చేసేటప్పుడు ఒంట్లో నీటి శాతం తగ్గకుండా (డీహైడ్రేషన్) చూసుకోవటం చాలా ముఖ్యం. వ్యాయామ సమయంలో గంటకు సగటున 0.8 నుంచి 1.4 లీటర్ల నీరు చెమట రూపంలో బయటకు వెళ్తుందని అంచనా. మన శరీర బరువులో 2% నీరు కోల్పోతే.. అంటే 75 కిలోల బరువుగల వ్యక్తికి 1.5 లీటర్ల చెమట పడితే డీహైడ్రేషన్‌లోకి వెళ్లినట్టే. కాబట్టి ఎక్కువసేపు వ్యాయామాలు చేసేవారు మధ్యమధ్యలో నీరు తాగటం మంచిది. అయితే కొందరు నీటికి బదులు శక్తినిచ్చే పానీయాలు తాగుతుంటారు. మరీ ఎక్కువసేపు వ్యాయామాలు చేసేవారికేమో గానీ ఒక మాదిరిగా చేసేవారికి మాత్రం ఇవి అంతగా ఉపయోగపడవు. వీటిల్లో చక్కెర అధికంగా ఉండటం వల్ల కేలరీల మోతాదు పెరిగిపోయి బరువు తగ్గటానికి బదులు ఇంకాస్త పెరుగుతుంది.

ఉదయం వ్యాయామమే మంచిదా?

ఉదయం నిద్ర లేచేసరికి కడుపు ఖాళీగా ఉంటుంది. అప్పుడు వ్యాయామం చేస్తే పిండి పదార్థాలేవీ అందుబాటులో ఉండవు కాబట్టి శరీరం కొవ్వును శక్తిగా వినియోగించుకుంటుంది. కాబట్టి ఉదయాన్నే వ్యాయామం చేయటం మంచిదని భావిస్తుంటారు. ఇందులో కొంత నిజం లేకపోలేదని బాత్ విశ్వవిద్యాలయ అధ్యయనంలో బయటపడింది. కొందరు ఊబకాయులను పరగడుపున, మరికొందరు ఊబకాయులను ఆహారం తీసుకున్నాక ట్రెడ్‌మిల్ మీద నడిపించి పరిశీలించగా.. పరగడుపున వ్యాయామం చేసినవారిలోనే కొవ్వు ఖర్చయినట్టు బయటపడింది. అయితే ఉద్ధ తంగా, ఎక్కువసేపు వ్యాయామాలు చేయాలని భావించేవారు ఖాళీ కడుపుతో వ్యాయామాలకు ఉపక్రమించటం మంచిది కాదు. ఎందుకంటే పిండి పదార్థాలు లేకపోతే ఎక్కువసేపు వ్యాయామం చేయటానికి అవసరమైన శక్తి లభించదు. దీంతో కొద్దిసేపటికే చతికిలబడిపోవచ్చు. అయితే ఏ వ్యాయామమైనా తిన్న వెంటనే చేయకూడదు. ఆహారం తినగానే రక్తప్రవాహం మొత్తం జీర్ణవ్యవస్థ వైపు మళ్లుతుంది. ఆ సమయంలో వ్యాయామం చేస్తే గుండె మీద భారం పడుతుంది. కాబట్టి తినగానే వేగంగా నడవటం, వ్యాయామాల వంటివి చేయొద్దు.

చెమట పడితేనే బాగా చేసినట్టా

చెమట ఎంత ఎక్కువ పడితే అంత ఎక్కువ వ్యాయామం చేసినట్టని, బరువు కూడా బాగా తగ్గు తామని కొందరు భావిస్తుం టారు. కొంతవరకిది సమంజసం గానే అనిపించొచ్చు గానీ వ్యాయా మం వల్ల లభించే ప్రయోజ నాలకు చెమట కొలమానమేమీ కాదు. మన శరీరం వేడిని తగ్గించుకోవటానికి చేసే ప్రయత్నంలో భాగంగా చెమట పడుతుందనే విషయాన్ని గుర్తించటం అవసరం. చెమట ఎక్కు వగా పోసే స్వభాగం గలవారికి వ్యాయామంతో ఇది మరింత ఎక్కువవుతుంది. కాబట్టి వ్యాయామ ప్రయోజనాలకు సంబం ధించి చెమట కన్నా గుండె వేగం పెరగటమే కీలకం. జిమ్‌లో పక్కవాళ్లు చెమట్లు కక్కుతుంటే మన కన్నా ఎక్కువగా కష్టప డుతున్నారని భావించాల్సిన పని లేదు.

కొవ్వు కరుగుతుందా?



వ్యాయామం నెమ్మదిగా, ఎక్కువసేపు చేయటం వల్ల కొవ్వు మరింత అధికంగా ఖర్చవుతుందన్నది కొందరి నమ్మకం. మన శరీరం పిండి పదార్థాలను త్వరగా శక్తిగా మలచుకుంటుండటమే ఈ భావనకు పునాది. నిజానికి నెమ్మదిగా వ్యాయామం చేసినపుడే మన శరీరం పిండి పదార్థాల కన్నా కూడా కొవ్వునే ఎక్కువగా వినియోగించుకుంటుంది. అయితే వేగంగా వ్యాయామాలు చేసినపుడు పిండి పదార్థాలు, కొవ్వు రెండూ మరింత పెద్దమొత్తంలో ఖర్చవుతుండటం గమనార్హం. అందువల్ల వ్యాయామంతో మరింత ప్రయోజనం పొందాలని అనుకునేవారు కాస్త వేగంగా వ్యాయామాలు చేసినా మంచిదే.

కండరాల నొప్పి ఎందుకు




జాగింగ్‌కు, జిమ్‌కు వెళ్లటం ఆరంభించిన మర్నాడు ఒళ్లునొప్పులతో బాధపడటం సహజమే. వ్యాయామ సమ యంలో కండరాలు అలసిపోవ టం, హైడ్రోజన్ అయాన్ల వంటి వ్యర్థాలు పోగుపడటం, ఆ వ్యర్థాలను బయటకు వెళ్లగొట టానికి వెళ్లిన ద్రవం అక్కడే చిక్కుబడటం వంటివి ఇందుకు దోహదం చేస్తుంటాయి. ఒకట్రెండు రోజులు విశ్రాంతి తీసుకుంటే ఈ నొప్పులన్నీ మాయమైపోతాయి. కొందరికి వ్యాయామం చేసిన 24 నుంచి 72 గంటల తర్వాత కూడా కండరాల నొప్పులు తలెత్తొచ్చు. కొన్నిసార్లు కండరం దెబ్బతినటం, పట్టేయటం వల్ల వ్యాయామం చేసిన వెంటనే తీవ్రమైన నొప్పి వేస్తుంటుంది. ఇలాంటివి వారం వరకు విశ్రాంతి తీసుకుంటేనే గానీ తగ్గవు.

సంగీతం వినటం మంచిదేనా?



సంగీతం వ్యాయామానికీ కొత్త హుషారునిస్తుంది. మరిం త ఎక్కువసేపు వ్యాయామం చేయటానికి అవసరమైన శక్తిని అందిస్తుంది. నొప్పి భావన తగ్గటానికీ సంగీతం దోహదం చేస్తుంది. సాధారణంగా సంగీత బాణీలకు అనుగుణంగా కాళ్లు, చేతులు లయబద్ధంగా కదులుతుంటాయి. ఇది వ్యాయామాల వేగం పెరగటానికి లేదా తగ్గటానికి తోడ్పడుతున్నట్టు కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. కాబట్టి వేగంగా నడవాలని, సైకిల్ తొక్కాలని అనుకునేవారు కాస్త హుషారైన పాటలు వినటం మంచిది. దీంతో వేగం పెరగటమే కాదు, మరింత ఎక్కువసేపూ వ్యాయామం చేసేలా చూసుకోవచ్చు. అవసరమైతే ఇందుకు ఓ చిన్న చిట్కానూ పాటించొచ్చు. నిమిషానికి ఎన్ని అడుగులు వేస్తున్నారో లెక్కించుకొని.. దాన్ని రెట్టింపు చెయ్యండి. ఇప్పుడు ఆ అడుగుల సంఖ్యకు తగిన 'బీట్'తో కూడిన బాణీని ఎంచుకుని ప్రయత్నించండి.

సన్నద్ధత తప్పనిసరా?



లేడికి లేచిందే పరుగన్నట్టు కొందరు నేరుగా వ్యాయామా లకు సిద్ధమవుతుం టారు. వేగంగా నడవటం, పరుగెత్తటం వంటివి చేస్తుంటారు. ఇది సరైన పద్ధతి కాదు. వ్యాయామం చేయటానికి ముందు కాసేపు కాళ్లు, చేతులను సాగదీయటం.. కీళ్లను కదిలించటం వంటి సన్నద్ధ వ్యాయామాలు చేయటం మంచిది. దీంతో కండరాలు, కండర బంధనాలు వదులవుతాయి. కండరాలు గాయపడే ముప్పు తగ్గుతుంది. వ్యాయామాలు చేసేటప్పుడు కదలికలు సులువవుతాయి. అందువల్ల కాస్త సమయం పట్టినా కూడా వ్యాయామానికి ముందు కొంతసేపు శరీరం సన్నద్ధం కావటానికి సాగదీత వ్యాయామాలు చేయటం ఎంతో మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

ఎలా తింటున్నారు!



తినే వస్తువు కనిపిస్తే ఆగలేకపోతున్నారా...? అదే పనిగా తినడం చేటు అని తెలిసి కూడా 'ఆ.. ఏమవుతుందిలే' అనుకుంటూ కంటిన్యూ చేస్తున్నారా? తినండి...కానీ, చూసిన ప్రతి దాన్ని తినేయాలన్న జిహ్వ చాపల్యం కాకుండా కొన్ని చిట్కాలు పాటిస్తూ తినడం వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని అంటున్నారు పోషకాహార నిపుణులు. పొద్దున్నే తీసుకునే ఆహారం బరువు తగ్గడాన్ని డిసైడ్ చేస్తుంది. ప్రొటీన్ ఎక్కువగా ఉన్న ఆహారాన్ని అల్పాహారంగా తీసుకోవడం వల్ల అది ఆకలిని మందగింపజేస్తుంది. దాంతో నోరు దానంతట అదే మూతపడుతుంది. ఓట్స్ ఉప్మా, సేమియా ఉప్మా, అలూ పరాటా, గుడ్లు, మొలకెత్తించిన ధాన్యం మొదలైనవి ఉదా హరణగా పేర్కొనవచ్చు. తినే ప్లేట్ సైజ్ కూడా కీలకమే. నిప ుణులు మాత్రం చిన్న సైజు ప్లేట్ లో ఆహారాన్ని తీసుకోవాలని చెబుతుంటారు. తద్వారా తినే పరిమాణం తగ్గుతుందని వారి సూచన. లంచ్, డిన్నర్ అయితే, ప్లేట్ లో సగం కాయగూరలు, పావు శాతం కార్బో హైడ్రేట్లు, పావు శాతం ప్రొటీన్ పదార్థాలు ఉండేలా చూసుకోవాలి. కార్బోహైడ్రేట్లు అంటే బియ్యం, గోధుమలే కాదు. ధాన్యంలో ఎన్నో రకాలు ఉన్నాయి. జొన్నలు, రాగులు, సజ్జలు, కొర్రలు ఇలా వెరైటీలను మారుస్తూ తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి ఎంతో బలం చేకూ రుతుంది. వేగంగా తినడం వల్ల ఎక్కువ పరిమాణం లోపలికి వెళుతుంది. దానికి బదులు కాస్తంత నిదానం అనే నియమాన్ని పాటించండి. 20 నిమిషాలకు పైగా అలా నిదానంగా తింటూ కూర్చుంటే కడుపు నిండిపోయింది ఇక చాలులే అని మెదడు సంకేతాలు ఇవ్వడం మొదలు పెడుతుందట.

ఉప్పు మెదడుకూ ముప్పే



ఉప్పు అనగానే మనకు ముందుగా అధిక రక్తపోటే గుర్తుకొస్తుంది. అయితే ఉప్పు రక్తపోటు పెరగటానికే కాదు, మెదడుకూ చేటు చేస్తుందనే సంగతి మీకు తెలుసా? ఉప్పు ఎక్కువగా గల ఆహారం వల్ల జ్ఞాపకశక్తి, ఆలోచన సమస్యలూ తలెత్తుతున్నట్టు తాజాగా బయటపడింది. ఉప్పు వాడకాన్ని చాలావరకు హైబీపీ, గుండెజబ్బులు, పక్షవాతం కోణంలోనే చూస్తున్న నేపథ్యంలో తాజా అధ్యయనానికి మరింత ప్రాధాన్యం ఏర్పడింది. ఇకపై డాక్టర్లు ప్రతి ఒక్కరినీ ఉప్పు వాడకం గురించి ఆరా తీయాల్సిన అవసరమూ రావొచ్చు. ఉప్పు అధికంగా తిన్నప్పుడు చిన్న పేగుల్లో కొత్త ప్రతిస్పందన మొదలవుతున్నట్టు పరిశోధకులు గుర్తించారు. దీంతో టీహెచ్17 అనే తెల్లరక్తకణాలు పెద్ద మొత్తంలో ఉత్పత్తి కావటం.. ఇది రోగనిరోధకవ్యవస్థలో పాలు పంచుకునే ఐఎల్-17 ప్రొటీన్ స్థాయులు పెరగటానికి దారితీయటం సంభవిస్తోంది. ఇలా ఐల్-17 ప్రొటీన్ స్థాయులు బాగా పెరిగిపోతే నైట్రిక్ ఆక్సైడ్ సరఫరా తగ్గిపోతుంది. నైట్రిక్ ఆక్సైడ్ స్థాయులు తగ్గిపోతే రక్తనాళాలు బిగుసుకుపోతాయి. ఫలితంగా మెదడుకూ రక్తసరఫరా తగ్గిపోతోంది. అంటే పేగుల్లో తలెత్తే ప్రతిస్పందనలు జ్ఞాపకశక్తి, ఆలోచనా సమస్యలకు దారితీస్తున్నాయన్నమాట. మెదడుకు రక్తసరఫరా తగ్గటం, మెదడులో రక్తనాళాలు సరిగా పనిచేయకపోవటం వంటివి దీర్ఘకాలం కొనసాగితే పెద్ద ప్రమాదమే ముంచుకురావొచ్చని అభిప్రాయపడుతున్నారు. ఉప్పు ఎక్కువగా తినే దేశాల్లో పక్షవాతం, డిమెన్షియా ఎక్కువగా కనబడుతున్నట్టు కొన్ని ఇతర పరిశోధనలు కూడా పేర్కొంటున్న సంగతిని ఆయన గుర్తుచేస్తున్నారు. అందువల్ల డిమెన్షియా నివారణకు ఉప్పు తక్కువగా తినటం కీలకమైన అడుగు కాగలదని సూచించారు.

మనం స్పోర్ట్స్
సోమవారం 19 ఫిబ్రవరి 2018
www.manamnews.com





గెలుపుతో ఆరంభం

ధావన్ ధనాధన్

5 వికెట్లతో చెలరేగిన భువీ

తొలి టీ20లో భారత్ విజయం

28 పరుగులతో సఫారీల ఓటమి

జోహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో టీమిండియా 28 పరుగులతో విజయం సాధించి శుభారంభం చేసింది. శిఖర్ ధావన్ (72: 39 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్సర్లు) హాఫ్ సెంచరీతో చెలరేగి ఆడగా.. రోహిత్ శర్మ 9 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 21, విరాట్ కోహ్లీ 20 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్‌తో 26 పరుగులతో రాణించారు. దీంతో మొదట బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 203 పరుగులు చేసింది. ఇది ట్వంటీ 20ల్లో దక్షిణాఫ్రికాపై భారత్ అత్యధిక స్కోరుసఫారీల ముందు 204 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికాకు భువనేశ్వర్ (5/24) చుక్కలు చూపించాడు. ఇతని ధాటికి దక్షిణాఫ్రికా (20 ఓవర్లలో) 175/9 పరుగులు మాత్రమే చేయగలిగింది. దీంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో టీమిండియా 1-0తో ఆధిక్యం సాధించింది. భారీ లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన దక్షిణాఫ్రికాకు ఆరంభంనుంచే భువనేశ్వర్ కట్టడి చేశాడు. నిప్పులు చెరిగే బంతులతో హడలెత్తించాడు. ఇతని ధాటికి ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్ భారీ పరుగులు చేయడంలో విఫలమయ్యారు. సఫారీ జట్టులో ఓపెనర్ హెండ్రిక్స్ 50 బంతుల్లో (70) పరుగులు, బెహండ్రెన్ (39) తప్ప మిగతా బ్యాట్స్‌మెన్ ఘోరంగా విఫలమయ్యారు. దీంతో సఫారీ జట్టు 28 పరుగులతో ఓటమి పాలైంది. భారత బౌలర్లలో భువనేశ్వర్ కుమార్ 5 వికెట్లు పడగొట్టగా, ఉనద్కాట్, పాండ్యా, చాహల్ తలో వికెట్ తీశారు. భువనేశ్వర్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.


మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ భువనేశ్వర్

టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాకు శిఖర్ ధావన్, రోహిత్ శర్మలు ధాటిగా ఇన్నింగ్స్‌ను ఆరంభించారు. మ్యాచ్ తొలి ఓవర్లోనే రోహిత్ శర్మ తనదైన శైలిలో విరుచుకుపడ్డాడు. ప్యాటర్సన్ వేసిన మొదటి ఓవర్‌లో రెండు సిక్సర్లు, ఫోర్ సాయంతో రోహిత్ విజృంభించి ఆడాడు. దాంతో తొలి ఓవర్‌లోనే భారత్ 18 పరుగులను సాధించింది. అదే ఊపును రెండో ఓవర్‌లో కూడా కొనసాగించే క్రమంలో రోహిత్ అవుటయ్యాడు. డాలా వేసిన రెండో ఓవర్ ఐదో బంతికి కీపర్ క్లాసెన్‌కు క్యాచ్ ఇచ్చి రోహిత్ తొలి వికెట్‌గా పెవిలియన్ చేరాడు. దీంతో 23 పరుగుల వద్ద భారత్ తొలి వికెట్ కోల్పోయింది. అనంతరం చాలా కాలం తర్వాత జట్టులోకి వచ్చిన సురేశ్ రైనా దూకుడుగా ఆడే క్రమంలో రెండో వికెట్‌గా వెనుదిరిగాడు. డాలా బౌలింగ్‌లో భారీ షాట్‌కు ప్రయత్నించిన రైనా 7 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్సర్‌తో 15 పరుగులు చేసి పెవిలియన్ బాట పట్టాడు. ఆ సమయంలో ధావన్‌కు జత కలిసిన కెప్టెన్ కోహ్లీ భారత ఇన్నింగ్స్‌ను ఆదుకునే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలోనే టీమిండియా 8.2 ఓవర్లలో 100 పరుగులను పూర్తి చేసుకుంది. కానీ, ఈ సమయంలోనే కుదురుగా ఆడుతున్న కోహ్లీ 20 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్‌తో 26 పరుగుల వద్ద షమ్సి బౌలింగ్‌లో ఎల్బీగా పెవిలియన్ చేరాడు. దీంతో భారత జట్టు 108 పరుగుల వద్ద మూడో వికెట్‌ను కోల్పోయింది. ఒకవైపు వికెట్లు పడుతున్న.. మరోవైపు ధావన్ మాత్రం నిలకడగా ఆడుతూ 27 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయితే ఫెహ్లుకోహియో వేసిన ఇన్నింగ్స్ 15 ఓవర్ నాల్గో బంతిని వికెట్ల వెనక్కిహిట్ చేయబోయి కీపర్‌కు సునాయస క్యాచ్ ఇచ్చి ధావన్ అవుటయ్యాడు. విధ్వంసర ఇన్నింగ్స్ ఆడిన ధావన్ 39 బంతుల్లోనే 10 ఫోర్లు, 2 సిక్స్‌లతో 72 పరుగులు చేసి వెనుదిరిగాడు. తర్వాత ధోని (16) ఐదో వికెట్‌గా పెవిలియన్ చేరాడు. చివర్లో మనీష్ పాండే (29 నాటౌట్), హార్దిక్ పాండ్యా(13 నాటౌట్)లు జట్టు స్కోరును 200 పరుగులకు దాటించారు. సఫారీ బౌలర్లలో డాలా రెండు వికెట్లు తీయగా, మోరిస్, షమ్సీ, ఫెహ్లుకోహియోలకు తలో వికెట్ దక్కించుకున్నారు.

మహిళల జట్టుకు చుక్కెదురు

మూడో టీ20లో భారత మహిళల ఓటమి

దక్షిణాఫ్రికా బోణీ





జొహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికాతో జరుగుతున్న టీ20 సిరీస్‌లో టీమిండియాకు చుక్కెదురైంది. సిరీస్‌లో భారత మహిళలు తొలి ఓటమిని ఛవీచూశారు. దక్షిణాఫ్రికా జట్టు తొలి విజయంతో భోణి కొట్టి సిరీస్‌పై తమ ఆశలను సజీవంగా ఉంచుకుంది. తొలి రెండు మ్యాచుల్లో ఘన విజయాలు సాధించిన టీమిండియా మూడో టీ20లో మాత్రం తడబడింది. ఆదివారం జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో భారత బ్యాట్స్ వుమెన్ ఘోరంగా విఫలమవ్వడంతో తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియా (17.5 ఓవర్లలో) కేవలం 133 పరుగులకే కుప్పకూలింది. తొలి రెండు మ్యాచుల్లో అద్భుత ఇన్నింగ్స్ ఆడి విజయాల్లో కీలక పాత్ర పోషించిన సీనియర్ బ్యాట్స్ వుమన్ మిథాలీ రాజ్ (0) ఈ సారి డకౌట్‌గా వెనుదిరిగింది. కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ (48), స్మృతి మంధాన (37), వేదా క్రిష్ణమూర్తి (23) తప్ప మిగతా వారు బ్యాటింగ్‌లో విఫలమయ్యారు. సఫారీ జట్టులో చెలరేగి బౌలింగ్ చేసిన శబ్‌నిమ్ ఇస్మాయిల్ 5 వికెట్లు పడగొట్టి టీమిండియా వెన్ను విరిచింది. అనంతరం హర్మన్ సేన నిర్దేశించిన 134 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని 19 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి సునాయసంగా ఛేదించింది. దక్షిణాఫ్రికా బ్యాట్స్‌వుమెన్‌లో సున్ లూస్ (41), ట్రయాన్ (34), డాన్ వాన్ నీకెర్క్ (26) రాణించారు. భారత బౌలర్లలో వస్త్రాకర్‌కు రెండు వికెట్లు లభించాయి. 5 వికెట్లు తీసీ విజయంలో కీలక పాత్ర పోషించిన ఇస్మాయిల్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. ఈ విజయంతో 5 మ్యాచ్‌ల సిరీస్‌లో దక్షిణాఫ్రికా 1-2తో నిలిచింది. టీమిండియా ఇప్పటికీ రెండు విజయాలతో ఆధిక్యంలో ఉంది. ఆదివారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేపట్టిన టీమిండియాకు ఆరంభంలోనే షాక్ తగిలింది. మొదటి ఎవర్లోనే ఓపెనర్ మిథాలీ రాజ్ (0) ఖాతా తెరవకుండానే పెవిలియన్ బాట పట్టింది. గత రెండు టీ20 మ్యాచ్‌లలో అజేయ హాఫ్ సెంచరీలతో జట్టును విజయతీరాలకు చేర్చిన మిథాలీ ఈ మ్యాచ్‌లో ఖాతా తెరవకుండానే పెవిలియన్ బాట పట్టింది. తొలి ఓవర్ వేసిన దక్షిణాఫ్రికా పేసర్ మరిజాన్నే కాప్ ఇన్నింగ్స్ ఐదో బంతికి షాట్ ఆడగా ఫీల్డర్ లీ క్యాచ్ పట్టడంతో మిథాలీ నిరాశగా వెనుదిరిగింది. దీంతో టీమిండియా పరుగులేమి చేయకుండానే తొలి వికెట్‌ను కోల్పోయింది. అనంతరం వచ్చిన కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్‌తో కలిసి మరో ఓపెనర్ స్మృతి మంధాన భారత ఇన్నింగ్స్‌ను చక్క దిద్దే ప్రయత్నం చేసింది. వీరిద్దరూ కొద్ది సేపటి వరకు మరో వికెట్ చేజారుకుండా జాగ్రత్తపడుతూ పరుగులు సాధించారు. అవకాశం వచ్చినప్పుడల్లా బౌండరీలు బాదుతూ స్కోరుబోర్డును ముందుకునడిపించారు. తర్వాత పుంజుకున్న వీరిద్దరూ పరుగులు వేగాన్ని పెంచారు. ప్రత్యర్థి బౌలర్లపై ఎదురుదాడికి దిగి పరుగులు రాబట్టుకున్నారు. ముఖ్యంగా మంధాన చెలరేగి ఆడుతూ వరుస క్రమంలో బౌండరీలు బాదింది. ఈ క్రమంలోనే వీరు రెండో వికెట్‌కు 33 బంతుల్లోనే 50 పరుగుల భాగస్వామ్యాన్ని ఏర్పర్చుకున్నారు. ఈ భాగస్వామ్యంలో మంధాన 34 పరుగులు చేయగా, హర్మన్ 14 పరుగులు చేసింది. ఆ కొద్ది సేపటికే భారత్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. కీలక ఇన్నింగ్స్ ఆడుతున్న స్మృతి మంధాన (37: 24 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్)ను నియోక్రెక్ ఔట్ చేసింది. దీంతో 7.2 ఓవర్లలో 55 పరుగుల వద్ద టీమిండియా రెండో వికెట్‌ను కోల్పోయింది. అనంతరం క్రీజులోకి వచ్చిన రోడ్రిగోస్ అండతో హర్మన్ భారత ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేసింది. ఒకవైపు రోడ్రిగోస్ సమన్వయంతో ఆడుతుంటే మరోవైపు హర్మన్ మాత్రం దూకుడుగా ఆడుతూ పరుగుల వేగాన్ని తగ్గకుండా చూసింది. అయితే విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడుతున్న హర్మన్‌ను తెలివైన బంతితో ఇస్మాయిల్ పెవిలియన్‌కు పంపింది. తృటిలో అర్ధ సెంచరీ మిస్ అయిన హర్మన్ ప్రీత్ కౌర్ 30 బంతుల్లోనే 6 ఫోర్లు, 2 సిక్సర్లతో 48 పరుగులు చేసి వెనుదిరిగింది. ఇక్కడి నుంచి భారత పతనాన్ని మొదలు పెట్టిన ఇస్మాయిల్ వరుసా క్రమంలో వికెట్లు తీస్తూ పోయింది. ఇమే ధాటికి సమన్వయంతో ఆడుతున్న రోడ్రిగోస్ 19 బంతుల్లో 6 పరుగులు చేసి ఔటైంది. ఆ కొద్ది సేపటికే పాటిల్ (7)ను కూడా పెవిలియన్‌కు పంపడంతో భారత్ 108 పరుగుల వద్ద 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో కూరుకపోయింది. ఒకవైపు వికెట్లు పడుతున్న మరోవెపు వేదా క్రిష్ణమూర్తి మాత్రం తనదైన శైలీలో ఆడుతూ బౌండరీలు బాదుతూ దూకుడుగా ఆడింది. కానీ, డానియల్స్ అద్భుత బంతికి వేదా క్లీన్ బౌల్డ్‌గా పెవిలియన్ చేరుకుంది. దూకుడుగా ఆడిన వేదా క్రిష్ణమూర్తి 14 బంతుల్లో 4 ఫోర్లతో 23 పరుగులు చేసి ఆరో వికెట్‌గా వెనుదిరిగింది. అనంతరం మరింతగా పుంజుకున్న ప్రత్యర్థి బౌలర్లు 12 బంతుల వ్యవధిలోనే చివరి 4 వికెట్లు పడగొట్టి భారత్‌ను తక్కువ స్కోరుకే పరిమితం చేశారు. దీంతో టీమిండియా (17.5 ఓవర్లలో) 133 పరుగులకు ఆలౌటైపోయింది. దక్షిణాఫ్రికా బౌలర్లలో ఇస్మాయిల్ 5 వికెట్లు పడగొట్టగా, క్లాస్ రెండు వికెట్లు తీసింది. అనంతరం స్వల్ప లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన సఫారీలకు కూడా ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. జట్టు స్కోరు 12 వద్ద ఓపెనర్ లిజెల్లె లీ (5) వికెట్ కోల్పోయింది. అనంతరం దూకుడుగా ఆడుతున్న సఫారి కెప్టెన్ 20 బంతుల్లో 5 ఫోర్లతో 26 పరుగుల వద్ద గైక్వాడ్ బౌలింగ్‌లో కీపర్ భాటియాకు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగింది. తర్వాత లూస్, డు ప్రీజ్‌లు దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌ను ఆదుకున్నారు. మూడో వికెట్‌కు కీలకమైన 50 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి గెలుపుకు గట్టి పునాది వేశారు. తర్వాత డు ఫ్రీజ్ (20) వెనుదిరిగింది. దీంతో దక్షిణాఫ్రికా 84 పరుగుల వద్ద 3వ వికెట్ కోల్పోయింది. అనంతరం కీలక ఇన్నింగ్స్ ఆడిన లూస్ 34 బంతుల్లో 5 ఫోర్లతో 41 పరుగులు చేసి ఔటైంది. చివర్లో ట్రయాన్ విధ్వంసకర బ్యాటింగ్‌తో 15 బంతుల్లోనే 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 34 పరుగులు చేసింది. అనంతరం పాటిల్ బౌలింగ్‌లో వెనుదిరిగింది. తర్వాత మిగిలిన లక్ష్యాన్ని డి క్లార్క్ (5 నాటౌట్), కాప్ (2 నాటౌట్)లు అజేయంగా పూర్తి చేశారు. దీంతో దక్షిణాఫ్రికా 19 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 134 పరుగులు చేసి సిరీస్‌లో తొలి విజయం సాధించింది. భారత బౌలర్లలో వాస్త్రకర్ రెండు వికెట్లు పడగొట్టింది. గైక్వాడ్, పాటిల్, పూణమ్ తలో వికెట్ దక్కించుకున్నారు. ఈ రెండు జట్ల మధ్య 4వ టీ20 మ్యాచ్ బుధవారం సెంచూరియన్‌లో జరుగనుంది.

నంబర్‌వన్ చేజారి..
3వ ర్యాంక్‌కు మిథాలీ

ఆసీస్ ఎలిస్ పెర్రీకి టాప్ ర్యాంక్ • మహిళల వన్డే ర్యాంకింగ్స్ ప్రకటించిన ఐసీసీ





ఢిల్లీ: భారత మహిళల క్రికెట్ జట్టు వన్డే కెప్టెన్ మిథాలీ రాజ్ తాజాగా నెంబర్ వన్ ర్యాంకు చేజారింది. ఐసీసీ తాజాగా ప్రకటించిన వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో రెండు స్థానాలు దిగజారి మూడో స్థానానికి పరిమితమయింది. బ్యాటింగ్ విభాగం తాజా ర్యాంకింగ్స్‌లో ఆస్ట్రేలియా బ్యాట్స్‌వుమన్ ఎలిస్ పెర్రీ (725 పాయింట్లు) అగ్రస్థానంలో నిలవగా, ఆసీస్ కెప్టెన్ మెగ్ లానింగ్ (718 పాయింట్లు) రెండో ర్యాంకు దక్కించుకుంది. గతేడాది అక్టోబర్‌లో దక్షిణాఫ్రికాతో జరిగిన వన్డే సిరీస్‌ను గెలువడంలో కీలకపాత్ర పోషించిన భారత కెప్టెన్ మిథాలీ నెంబర్ వన్ ర్యాంకు సాధించింది. ఇప్పుడు తాజాగా దక్షిణాఫ్రికాతో జరిగిన వన్డే సిరీస్‌లో విఫలమైన మిథాలీ (707 పాయింట్లు) టాప్ ర్యాంకును కోల్పోవడంతో పాటు రెండు స్థానాలు దిగజారి మూడవ ర్యాంక్‌లో నిలిచింది. మరోవైపు తాజాగా దక్షిణాఫ్రికాతో జరిగిన వన్డే సిరీస్‌లో అద్భుతంగా రాణించిన స్మృతి మంధాన 14 స్థానాలు ఎగబాకి 21వ ర్యాంకులో నిలిచింది. అంతకు ముందు 35వ ర్యాంక్‌లో ఉన్న మంధాన ఇప్పుడు తాజా ర్యాంకింగ్స్‌లో (503 పాయింట్లు) మెరుగైన ర్యాంకు సాధించింది. కాగా, భారత మరో క్రికెటర్ హర్మన్ ప్రీత్ కౌర్ రెండు స్థానాలు దిగజారి (660 పాయింట్లు) 7వ ర్యాంక్‌కు చేరింది.

బౌలర్ల అగ్రస్థానంలో మరిజాన్నే కాప్

ఐసీసీ బౌలర్ల తాజా వన్డే ర్యాంకింగ్స్ లో దక్షిణాఫ్రికా పేసర్ మరిజాన్నే కాప్ (653 పాయింట్లు) అగ్రస్థానాన్ని నిలుపుకుంది. వన్డే క్రికెట్లో 200 వికెట్లు సాధించిన తొలి మహిళా బౌలర్‌గా నిలిచిన భారత స్టార్ క్రికెటర్ ఝులన్ గోస్వామి (643 పాయింట్లు) రెండో ర్యాంకులో నిలిచింది.



శ్రీలంక క్లీన్ స్వీప్

రెండో టీ20లోనూ ఓడిన బంగ్లాదేశ్

సిల్‌హెట్: బంగ్లాదేశ్‌తో జరిగిన రెండో టీ20లోనూ విజయం సాధించిన శ్రీలంక 2 మ్యాచ్‌ల సిరీస్‌ను 2-0తో క్లీన్ స్వీప్ చేసింది. ఆదివారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక 4 వికెట్లు కోల్పోయి 210 పరుగుల భారీ స్కోరును సాధించింది. లంకలో కుశాల్ మెండిస్ (42 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్స్‌లతో చెలరేగి 70 పరుగులు చేశాడు. మరోవైపు గునతిలకతో (37బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్)లతో కలిసి తొలి వికెట్‌కు 66 బంతుల్లో 98 పరుగుల కీలకమైన భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. ఇతర బ్యాట్స్‌మెన్‌లో వేగంగా ఆడిన పెరెరా 17 బంతుల్లోనే 31, ఉపుల్ తరంగా 13 బంతుల్లోనే 25 పరుగులు చేశారు. చివర్లో శనక 11 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 30 పరుగులతో అజేయంగా నిలిచాడు. దీంతో లంక భారీ స్కోరును సాధించింది. తర్వాత భారీ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ జట్టు బ్యాటింగ్‌లోనూ తడబడింది. లంక బౌలర్ల ధాటికి బంగ్లా బ్యాట్స్‌మెన్ క్రీజులో నిల్చుండలేక పోయారు. వరుస క్రమంలో వికెట్లు చేజార్చుకున్నారు. బంగ్లా కెప్టెన్ మహ్మదుల్లా (31 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్)తో 41 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఓపెనర్ తమీమ్ ఇక్బాల్ (29), షఫీఉద్దీన్ (20), మెహదీ హస్సన్ (11) తప్ప మిగతా బ్యాట్‌మెన్ రెండంకెల స్కోరును కూడా దాటలేకపోయారు. దీంతో బంగ్లా (18.4 ఓవర్లలో) 135 పరుగులకు ఆలౌటైంది. 75 పరుగులతో ఓటమిని మూటకట్టుకొని, సిరీస్‌ను కూడా కోల్పోయింది. తొలి మ్యాచ్‌లో కూడా రాణించి, రెండో మ్యాచ్‌లో కూడా చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడిన కుశాల్ మెండిస్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డులు దక్కాయి.

ఇంగ్లండ్ విజయం

ఓడినా.. ఫైనల్‌కు చేరిన కివీస్ • టీ20 ట్రై సిరీస్

హమిల్టన్: ముక్కోణపు ట్వంటీ 20 సిరీస్‌లో ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో న్యూజిలాండ్ ఓడినా కూడా ఫైనల్ బెర్తును ఖాయం చేసుకుంది. ఆదివారం ఇంగ్లండ్‌తో జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో న్యూజిలాండ్ పరాజయం పాలైనప్పటికీ మెరుగైన రన్‌రేట్ కారణంగా తుది పోరుకు అర్హత సాధించింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్‌లో డేవిడ్ మాలన్ (53), ఇయాన్ మోర్గాన్ (80 నాటౌట్) హాఫ్ సెంచరీలతో రాణించారు. చివర్లో జాసన్ రాయ్ వేగంగా ఆడి 13 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్‌తో 21 పరుగులు చేశాడు. దీంతో ఇంగ్లండ్ నిర్ణీత ఓవర్లలో 194/7 పరుగులు భారీ స్కోరు నమోదు చేసింది. అనంతరం, లక్ష్య ఛేదనకు దిగిన కివీస్ ధాటిగా ఇన్నింగ్స్‌ను ఆరంభించింది. ఓపెనర్లు గుప్టిల్, మున్రో తొలి వికెట్‌కు 6.3 ఓవర్లలోనే 78 పరుగుల మెరుగైన భాగస్వామ్యాన్ని అందించారు. అనంతరం విధ్వంసకర బ్యాటింగ్ చేసిన కోలిన్ మున్రో కేవలం 21 బంతుల్లోనే 7 సిక్సర్లు, 3 ఫోర్లతో 57 పరుగులు చేసి వెనుదిరిగాడు. తర్వాత చెలరేగి ఆడిన మరో ఓపెనర్ మార్టిన్ గుప్టిల్ కూడా 47 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లతో 62 పరుగులు చేసి ఔటయ్యాడు. తర్వాత మార్క్ చాప్‌మన్ (37 నాటౌట్) బాధ్యతాయుత ఇన్నింగ్స్ ఆడి న్యూజిలాండ్ గెలుపు దిశగా పయనించాడు. కాని, చివరి ఓవర్‌లో విజయానికి 12 పరుగులు అవసరమైన తరుణంలో కివీస్ 9 పరుగులు మాత్రమే చేసి ఓటమిని ఛవీచూసింది. హోరాహోరీ మ్యాచ్‌లో చివరికి ఇంగ్లండ్ రెండు పరుగుల తేడాతో విజయాన్ని దక్కించుకుంది. కానీ, మెరుగైన రన్‌రేట్ లేని కారణంగా ఫైనల్ పోరుకు మాత్రం అర్హత సాధించలేకపోయింది. ఈ ముక్కోణపు సిరీస్‌లో ఆస్ట్రేలియా నాలుగు మ్యాచ్‌ల్లో విజయం సాధించి 8 పాయింట్లతో ముందుగా ఫైనల్ బెర్తును ఖాయం చేసుకోగా.. న్యూజిలాండ్, ఇంగ్లండ్ జట్లు కేవలం ఒక్కో మ్యాచ్‌లో మాత్రమే విజయం సాధించాయి. దాంతో రన్‌రేట్ ఆధారంగా న్యూజిలాండ్ ఫైనల్‌కు చేరగా, ఇంగ్లండ్ ఇంటి దారి పట్టింది. తాజాగా ఆస్ట్రేలియాతో న్యూజిలాండ్ తుది పోరుకు సిద్ధమైంది. బుధవారం ఇరు జట్ల మధ్య టైటిల్ పోరు జరుగనుంది.



Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id: editor@manamnews.com.